అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

ఉక్రేన్ – గాజాలలో శాంతికి పోప్ లియో పిలుపు

శ్రీలంకలో బస్సు ప్రమాదం 21 మంది మృతి

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 162 | సోమవారం | 12-05-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# పిఓకెను తిరిగి ఇవ్వాల్సిందే

● జమ్మూకశ్మీర్ వివాదంలో మధ్యవర్తిత్వం లేదు ● మాటలంటూ ఉంటే పిఓకే గురించి మాత్రమే ● వాళ్ళ సైనిక జనరల్ ద్వారానే ఇకమీదట చర్చలు ● కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడి



**న్యూఢిల్లీ:** జమ్మూ కశ్మీరుకు సంబంధించిన వివాదంలో మధ్యవర్తిత్వాన్ని భారతదేశం తిరస్కరించిందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఆదివారం నాడు చెప్పాయి. కశ్మీరు విషయంలో ఎప్పటికీ మధ్యవర్తిత్వాన్ని భారత్ ఆశించదని, పాకిస్థాన్ దురాక్రమణ చేసిన కశ్మీరు భూభాగాన్ని భారత్‌కు తిరిగి ఇవ్వాల్సిందేనని వర్గాలు తెలిపాయి. ఇక మాటలంటూ ఉంటే పాకిస్థాన్ ఆక్రమించిన భూభాగాన్ని తిరిగి భారత్‌కు అప్పగించడం గురించి మాత్రమేననీ, ఈ విషయంలో భారత ప్రభుత్వం చర్చలకు సిద్ధంగా ఉందని వర్గాలు తెలిపాయి. పాకిస్థాన్‌తో డిజిఎంఓ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్) ద్వారా మాత్రమే ఆ దేశంతో చర్చలు ఉంటాయని ప్రభుత్వ వర్గాలు ఢిల్లీ మీడియాకు చెప్పాయి. ఆపరేషన్ సిందూర్ ఇంకా పూర్తి కాలేదని వర్గాలు తెలిపాయి. సరిహద్దుల్లో ఉగ్రవాదాన్ని ప్రతిఘటించడానికి గతం కంటే భిన్నంగా, అసాధారణ ప్రతిఘటన ఉంటుంది, సరిహద్దుల్లో తరువాయి 2లో

## కశ్మీరుపై మధ్యవర్తిత్వం చేస్తాం : ట్రంప్

### పాకిస్థాన్ హర్షం : భారత్ తిరస్కృతి

**క**శ్మీరు సమస్యపై మధ్యవర్తిత్వం చేస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. ట్రంప్ సంసిద్ధతను పాకిస్థాన్ వెంటనే ఆహ్వానించి హర్షం ప్రకటించగా, భారతదేశం మాత్రం ఈ విషయంలో మధ్యవర్తిత్వానికి అవకాశం లేదని తోసిపుచ్చింది. ఇరు దేశాలు ద్వైపాక్షికంగానే సమస్యలు పరిష్కరించుకుంటామని, చర్చల ద్వారా పరిష్కరించుకుంటామని భారత్ తెలిపింది. భారత్–పాకిస్థాన్ దేశాలమధ్య కుదిరిన కాల్పుల విరమణ అవగాహనను ఆదివారం ఉదయం ట్రంప్ ప్రశంసించారు. ఈ అవగాహన కుదరకపోయి ఉంటే లక్షలమంది రెండు తరువాయి 2లో




# పర్యవసానాలు రుచిచూపించాం

● ఉగ్రవాదాన్ని అంతం చేసే లక్ష్యంతోనే ఆపరేషన్ సిందూర్ ● 100 మంది ఉగ్రవాదులు హతం ● పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 5, పాక్‌లోని 4 ఉగ్ర శిబిరాలను నేలమట్టం చేశాం ● మూడు రోజులపాటు కొనసాగిన దాడుల్లో 35-40 మంది పాకిస్థాన్ సైనికులు మృతి ● మీడియా సమావేశంలో త్రివిధ దళాలు వెల్లడి

**న్యూఢిల్లీ :** భారత వాయుసేన, క్షిపణి రక్షణ వ్యవస్థలతో పాక్‌కు స్పష్టమైన సందేశం ఇచ్చాం. పాక్ దుస్సాహసానికి పాల్పడితే ఎలాంటి పర్యవసానాలు ఎదురవుతాయో చూపించాం. సైన్యం, వాయుసేన చర్యలకు అనుబంధంగా అరేబియా సముద్రంలో నౌకాదళం సర్వసన్నద్ధంగా ఉంది. కశ్మీర్ నుంచి గుజరాత్ వరకు సరిహద్దు నగరాలపై డ్రోన్ దాడులకు యత్నించింది. గుంపులు గుంపులుగా డ్రోన్లతో దాడులకు యత్నించింది' అని త్రివిధ దళాల అధికారులు పేర్కొన్నారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌ను పాక్ సైన్యం దాటలేదని భారత త్రివిధ దళాలు స్పష్టంచేశాయి. ఆపరేషన్ సమయంలో లక్ష్యాలను ఛేదించడంపైనే గురి ఉంటుందని పేర్కొన్నాయి. అయితే, ఆపరేషన్ సిందూర్ సమయంలో ఐదుగురు జవాన్లు అమరులయ్యారని, అమర జవాన్ల త్యాగాలను దేశం ఎన్నటికీ మరచిపోదని తెలిపాయి. ఉగ్రవాదాన్ని అంతం చేసే లక్ష్యంతోనే ఆపరేషన్ సిందూర్ చేపట్టామని భారత సైన్యం వెల్లడించింది. తాము చేపట్టిన ఆపరేషన్‌లో 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారని తెలిపింది. దాడుల భయంతో ఉగ్రశిబిరాలు ఖాళీ అవుతున్నాయని పేర్కొంది. పహల్గాంలో 26 మంది అమాయకులను ముష్కరులు పొట్టనపెట్టుకున్నారని భారత సైన్యం వెల్లడించింది. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి త్రివిధ దళాల అధికారులు మీడియా సమావేశంలో కీలక వివరాలు వెల్లడించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 5, పాక్‌లోని 4 ఉగ్ర శిబిరాలను నేలమట్టం చేసినట్లు తెలిపింది.

**పాకిస్థాన్ వణికిపోయింది: రాజీవ్ ఘాయ్**

'పహల్గాం దాడి తర్వాత ఉగ్రవాదులకు దీటుగా బదులివ్వాలని నిర్ణయించాం. ఉగ్రవాదులకు సరైన రీతిలో జవాబు తరువాయి 2లో

**భా**రత్–పాకిస్థాన్ దేశాలకు చెందిన డిజిఎంఓల సమావేశం సోమవారం-నాడు జరుగుతుంది. రెండు దేశాల డిజిఎంఓలు ఈనెల పదోతేదీన మధ్యాహ్నం టెలిఫోన్ సంభాషణ చేశారు. రెండోసారి సమావేశం సోమవారం జరుగుతుందని లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ చెప్పారు. రెండు దేశాలమధ్య శనివారం కుది-రిన అవగాహన ఒప్పందం దీర్ఘకా-లంగా ఏ విధంగా అమలు చేయాలి, ఏ విధంగా దానిని చెల్లుబాటులో ఉంచుతారు, ఏ విధంగా అమలు చేస్తారన్న విషయాలను పాకిస్థాన్ డిజి-ఎంఓతో తాము చర్చిస్తామన్నారు.

అమెరికా ఆధిపత్యవాదానికి

## ఎందుకు అవకాశమిచ్చారు?

మోదీ ప్రజలకు సమాధానం చెప్పాల్సిందే
నిలదీసిన సిపిఐ

**న్యూఢిల్లీ:** భారత్–పాకిస్థాన్ దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించిన ప్రకటనను మనదేశానికంటే ముందుగానే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎలా చేశారని ప్రధానమంత్రి నరేంద్రమోదీని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) నిలదీసింది. ఇది ఒకరకంగా భారత ఉపఖండంలో, దక్షిణాసియావ్యవహారాల్లో అమెరికా ఆధిపత్యవాదానికి తలుపులు తెరచినట్లవుతుందని, ఈ అవకాశం ఎందుకు ఇచ్చారని ప్రశ్నించింది. భారత్–పాకిస్థాన్ రెండు దేశాలూ చిత్తశుద్ధితో కాల్పుల తరువాయి 2లో

ఆపరేషన్ సిందూర్, కాల్పులు విరమణ ఒప్పందంపై

## చర్చ జరగాలి

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయండి

ప్రధాని మోదీకి రాహుల్‌గాంధీ, ఖర్గే లేఖలు



**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సిందూర్, సరిహద్దు కాల్పులకు సంబంధించి తాజా పరిణామాలను చర్చించడానికి పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని వెంటనే నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు లోక్‌సభ, రాజ్యసభలోని తరువాయి 2లో

# ఇంజనీరింగ్ విభాగంలో మొదటి పది ర్యాంకులూ బాలురవే

పల్లా భరత్ చంద్రకు మొదటి, రామచరణ్ రెడ్డికి రెండవ ర్యాంకు

ఫార్మా, అగ్రికల్చర్ విభాగంలో సాకేత్‌రెడ్డికి ప్రథమ, లలిత్ వరేణ్యకు ద్వితీయ ర్యాంకు

ఎప్‌సెట్ ఫలితాలు విడుదల చేసిన ముఖ్యమంత్రి




ప్రజాపక్షం/హైదరాబాద్


జవహర్‌లాల్ నెహ్రూ టెక్నోలాజికల్ యూనివర్శిటీ, హైదరాబాద్ (జెఎన్‌టియుహెచ్) నిర్వహించిన 'ఎప్‌సెట్' ఫలితాల్లో ఇంజనీరింగ్ విభాగంలో పది ర్యాంకులలో బాలురు ఉత్తీర్ణులయ్యారు. ఎపిలోని పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడకు చెందిన పల్లా భరత్ చంద్ర మొదటి ర్యాంకు సాధించగా, రంగారెడ్డి జిల్లా తరువాయి 2లో

ఉక్రేన్‌తో ప్రత్యక్ష చర్చలకు

# పుతిన్ సంసిద్ధత

15న ఇస్తాంబుల్‌లో సమావేశం
ముందస్తు షరతులు లేవు

**మాస్కో :** ఉక్రేన్‌తో శాంతి చర్చలకు ఎట్టకేలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ అంగీకరించారు. ఐతే ఉక్రేన్ మాత్రం ముందుగా కాల్పుల విరమణ చేపడితేనే తాము చర్చలకు సిద్ధమని స్పష్టంచేసింది. యుద్ధానికిగల మూలకారణాలపై ముందుగా చర్చించాలనీ, ఆ తర్వాత కాల్పుల విరమణపై చర్చలు జరుగుతాయని రష్యా విదేశాంగమంత్రిత్వశాఖ ఆ తర్వాత పుతిన్ ప్రకట



నకు పూర్తి వివరణ తెలియజేసింది. ఎలాంటి ముందస్తు షరతులూ లేకుండా ఈనెల 15వ తేదీ గురువారంనాడు ఇస్తాంబుల్‌లో రెండు దేశాల మధ్య తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## డియర్ ఫ్రెండ్ చైనా..
### షెహబాజ్ షరీఫ్ ప్రత్యేక కృతజ్ఞతలు

**ఇస్లామాబాద్ :** భారత్–పాకిస్థాన్ మధ్య శాంతి చర్చల్లో కీలకపాత్ర వహించిన చైనా, అమెరికా, సౌదీ అరేబియా తదితర దేశాలకు పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ కృతజ్ఞతలు తెలియజేశారు. చైనాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ''మైడియర్ ఫ్రెండ్ చైనాకు నా ప్రత్యేక కృతజ్ఞతలు, 78 సంవత్సరాల పాకిస్థాన్ చరిత్రలో ఎప్పుడు ఏ అవసరం వచ్చినా నేనున్నానంటూ స్నేహ హస్తం అందించే చైనాకు మా ప్రత్యేక కృతజ్ఞతలు'' అని తెలియజేశారు. ఎంతో చిత్తశుద్ధితో శాంతికోసం నిర్మాణాత్మకమైన పాత్ర వహించారని అన్నారు. ''చైనాను వెరీ డియర్, వెరీ డియర్, అత్యంత విశ్వసనీయమైన మిత్రుడు'' అని షరీఫ్ అభివర్ణించారు. రెండు దేశాలమధ్య చారిత్రక సంబంధాలు ఉన్నాయని, ఈ వాస్తవాలను గుర్తుంచుకోవాలన్నారు. అదేవిధంగా భారతదేశంతో సింధు జలాల నీటి సమస్య, కశ్మీరు సమస్య, ఇతర వివాదాస్పద సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## ఉక్రేన్–గాజాలలో శాంతికి పోప్ లియో పిలుపు
### బందీలను విడుదల చేయాలని విజ్ఞప్తి



**వాటికన్ సిటీ :** ఉక్రేన్, గాజాలలో శాంతి పాటించాలని, యుద్ధాలు విరమించాలని కొత్తగా ఎన్నికైన రోమన్ క్యాథలిక్ మతగురువు పోప్ లియో–14 పిలుపు ఇచ్చారు. గాజాలో బందీలుగా ఉన్న ఇజ్రాయెల్ పౌరులను, ఇతర విదేశీ పౌరులను వెంటనే విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పోప్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటి ఆదివారంనాడు జరిగిన ప్రార్థనల సందర్భంగా లియో–14 ప్రజలకు తొలి శాంతి సందేశం ఇచ్చారు. గాజాలో శాంతి సాధనకు వీలుగా ముందు, అక్కడి ప్రజలకు ఆహారం సరఫరా చేయాలని, వారికి కడుపునిండా అన్నం పెట్టాలని కోరారు. ''మళ్ళీ మనకు యుద్ధం వద్దు'' అని సెయింట్ పీటర్స్ బాసిలికా నుండి ఆయన సందేశం ఇచ్చారు. 80 సంవత్సరాల క్రితం ముగిసిన రెండవ ప్రపంచ యుద్ధకాలంనాటి పరిస్థితులను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఈ యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక యుద్ధాలు జరిగాయన్నారు. ఇక మళ్ళీ భూగోళంపై వివాదాలు ముదిరి ఘర్షణలు వస్తే అది మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందని ఆయన హెచ్చరించారు. అమెరికాకు చెందిన మొట్టమొదటి పోప్ లియో మాతృదినోత్సవాన్ని కూడా గుర్తుచేశారు. ప్రపంచవ్యాప్తంగా తల్లులందరికీ తన అభినందనలు తెలియజేశారు. స్వర్గంలో ఉన్న తల్లులకు కూడా ''హ్యాపీ మదర్స్ డే'' అని చెప్పారు. పోప్ పదవికి తాను అనర్హుడనని తనకుతాను ప్రకటించుకుంటూ ఆ వారసత్వాన్ని విజయవంతంగా ముందుకు తీసుకువెళతానన్నారు. 19వ శతాబ్దంనాటి పోప్ లియో సామాజిక న్యాయం కోసం పోరాటం చేశారని, ఆయన స్మృత్యర్థం ఆ పేరునే తాను లియో–14గా ఎంపిక చేసుకుని పెట్టుకున్నాననీ వివరణ ఇచ్చారు. మిషనరీ కార్యకలాపాలకు తాను ఎక్కువ ప్రాధాన్యం ఇస్తానన్నారు. మానవ సమాజ గౌరవ మర్యాదలను కాపాడేందుకు వీలుగా వాటికన్ సిటీ కూడా కృత్రిమ మేధ వంటి ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని సంతరించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఇంతకుముందు పోప్ ఫ్రాన్సిస్ అర్జెంటీనాకు చెందినవారు. ఇప్పుడు పోప్ లియో అమెరికాకు చెందినవారు. గనుక వాటికన్ సిటీ మాత్రం పోప్ లియోను అమెరికా నుండి వచ్చిన మొదటి పోప్‌గా కాకుండా రెండవ పోప్‌గా పరిగణిస్తున్నది. పోప్ తొలి సందేశం సందర్భంగా వాటికన్ సిటీలో ప్రజలు ప్రత్యేక బ్యాండ్ వాయిజ్యాలతో ప్రదర్శన చేశారు. గురువారంనాడు రాత్రి పోప్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత లియో–14 మొదటి ఆదివారంనాడు పవిత్ర సందేశం ఇవ్వడం వాటికన్‌సిటీలో ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఇరాన్–అమెరికా నాలుగోవిడత చర్చలు

**దుబాయ్ :** ఇరాన్–అమెరికా మధ్య నాలుగో విడత చర్చలు ఓమన్‌లో ఆదివారంనాడు ప్రారంభమయ్యాయి. రెండు దేశాల మధ్య పరోక్ష చర్చలకు ఒమన్ విదేశాంగ మంత్రి బద్ర్ అల్–బుసైదీ ఈ రెండు దేశాలకూ మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నారు. ఈ చర్చలు అటు ప్రత్యక్షంగా, ఇటు పరోక్షంగా రెండు పద్ధతులలోనూ జరుగుతాయని అమెరికా తరపున ప్రతినిధులు ఆశిస్తున్నారు. రెండు దేశాల ప్రతినిధులూ చెరో గదిలోనూ కూర్చుని ఉంటే వారి అభిప్రాయాలను వీరికీ, వీరు చెప్పిన అభిప్రాయాలను వారికీ ఒమన్ విదేశాంగ మంత్రి చేరవేస్తూ ఉంటారు. ఈవిధంగా రెండు దేశాల ప్రతినిధులు పరోక్ష చర్చలు జరుపుతారు. అమెరికాతో ప్రత్యక్ష చర్చలకు ఇరాన్ దేశం మొదటినుండీ తిరస్కరిస్తూ వచ్చింది. ఇరాన్ వద్ద అణుబాంబులు ఉండకూడదని అమెరికా స్పష్టంగా చెబుతున్నది. కానీ ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళుతోందని, దీనిని అడ్డుకునేందుకు మరింత మెరుగైన ఒప్పందం చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆశిస్తున్నారు. చర్చలకు లొంగకపోతే బలప్రయోగం చేస్తామని కూడా ఇరాన్‌కు ట్రంప్ పదే పదే హెచ్చరికలు కూడా జారీ చేశారు. ఈ నేపథ్యంలో రెండు దేశాలమధ్య నాలుగోవిడత చర్చలు జరుగుతున్నాయి. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి, అమెరికా మధ్యప్రాచ్య ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్ చర్చల్లో పాల్గొంటున్నారు. విద్యుత్ అవసరాలకు మించినస్థాయిలో ఇరాన్ యురేనియంను శుద్ధిచేస్తోందని అమెరికా ఆందోళన వ్యక్తం చేస్తున్నది.



## శ్రీలంకలో బస్సు ప్రమాదం 21 మంది మృతి

**కొలంబో :** శ్రీలంకలో ఆదివారం జరిగిన బస్సు ప్రమాదంలో 21 మంది మరణించారు. 35 మందికిపైగా ప్రయాణికులు గాయపడ్డారని పోలీసులు చెప్పారు. ఒక కొండచరియ అంచుల నుండి వెళుతున్న ప్రభుత్వ బస్సు ఉదయం లోయలో పడిపోయింది. నువారా ఎలియా–గంపోలా ప్రధాన రహదారిపై శ్రీలంక ట్రాన్స్‌పోర్ట్ బోర్డ్ బస్సు వెళుతుండగా ఈ ఘటన జరిగింది. ఈ బస్సు కతరనాగ నుండి కురునెగల వెళుతోందని పోలీసులు చెప్పారు. కొండలపై ప్రయాణం చేస్తున్న బస్సు ఎడమవైపు టర్నింగ్ తీసుకునేందుకు బస్సు డ్రైవరు ప్రయత్నించిన సమయంలో ప్రమాదం సంభవించింది. సుమారు 75 మంది యాత్రికులు ఈ బస్సులో ప్రయాణం చేస్తున్నారు. శ్రీలంకలో ఇలాంటి ఘోరమైన రోడ్డు ప్రమాదాలు అత్యంత సహజమైన విషయంగా మారాయి.

## సుంకాలపై అమెరికా–చైనా రెండో దశ చర్చలు

**జెనీవా :** సుంకాలపై అమెరికా–చైనా మధ్య రెండో విడత చర్చలు ఆదివారంనాడు తిరిగి మొదలయ్యాయి. మొదటి విడత చర్చల్లో ఎలాంటి పురోగతి లేదు. కానీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాత్రం చర్చల్లో బ్రహ్మాండమైన పురోగతి సాధించామన్నారు. ఈ విషయంలో చైనా, అమెరికా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశాయి. ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో రాస్తూ, బ్రహ్మాండమైన పురోగతి వచ్చిందన్నారు. కానీ చైనా మాత్రం దీనిపై ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు. ఈ చర్చల ద్వారా ప్రపంచ మార్కెట్లను స్థిరీకరించే ప్రయత్నం చేస్తున్నామని పేరు చెప్పడానికి ఇష్టపడని అమెరికా ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. సుంకాలయుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా మాంద్యం పరిస్థితులు, స్టాక్ మార్కెట్లలో తీవ్ర అస్థిరత ఏర్పడటంతో అనివార్యంగా రెండు దేశాలూ చర్చలకు సిద్ధపడ్డాయి. ఈ సుంకాలను 145 శాతం నుండి 80 శాతానికి తగ్గిస్తామని ట్రంప్ చర్చలకు ముందుగా ప్రతిపాదించారు.

## ఇజ్రాయెల్ దాడిలో పదిమంది మృతి

**గాజా :** గాజాలో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో ఆదివారంనాడు పదిమంది పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో ఎక్కువమంది పిల్లలు, మహిళలే ఉన్నారు. ఖాన్ యూనిస్‌లో రెండుచోట్ల ఇజ్రాయెల్ దాడులు చేసింది. కేవలం హమాస్ ఉగ్రవాద కేంద్రాలపైన మాత్రమే తాము దాడులు చేశామని ఇజ్రాయెల్ చెప్పింది. మార్చి రెండో తేదీ నుండి గాజాలోకి ఎలాంటి ఆహార సరఫరాలు రానివ్వకుండా ఇజ్రాయెల్ అడ్డుకోవడంతో పాలస్తీనా ప్రజలు కరువుతో అల్లాడుతున్నారు. దాదాపు 3000 వాహనాలు గాజా వెలుపల ఆగిపోయాయి. వాటిని ఇజ్రాయెల్ సైన్యం లోనికి పంపడంలేదు.

## ఉక్రేన్‌పై రష్యా యుద్ధం పునఃప్రారంభం

**మాస్కో :** నాజీ నియంత హిట్లర్‌పై రెండవ ప్రపంచ యుద్ధంలో విజయం సాధించిన రష్యా మే 9వ తేదీన 80వ విజయోత్సవ వేడుకలు చేసుకోవడం కోసం ఈనెల ఎనిమిదో తేదీ నుండి పదో తేదీ వరకూ ఉక్రేన్‌లో కాల్పుల విరమణ పాటించింది. రష్యాలో విజయోత్సవ వేడుకలు విజయవంతంగా జరిగాయి. ఆ మరునాడే పదకొండవ తేదీన ఆదివారంనాడు ఉక్రేన్‌పై రష్యా తిరిగి సైనిక దాడులు ప్రారంభించింది. ఆదివారంనాడు రష్యా 108 డ్రోన్లతో అనేక దాడులు చేసిందని ఉక్రేన్ ప్రకటించింది. ఐతే వీటిల్లో 101 డ్రోన్ల వల్ల ఎలాంటి నష్టం వాటిల్లలేదని ప్రకటించింది. మే 15వ తేదీ నుండి ఇస్తాంబుల్‌లో ఉక్రేన్‌తో శాంతి చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని పుతిన్ శనివారం అర్థరాత్రి దాటాక ప్రకటించారు. ఐతే రష్యాలో విజయోత్సవ వేడుకలు జరుగుతున్న సమయంలో ఉక్రేన్ మూడు రోజుల కాల్పుల విరమణ ఒప్పందాన్ని 14,000 సార్లు ఉల్లంఘించిందని రష్యా రక్షణమంత్రి ప్రకటించారు. రష్యా ప్రతిపాదించిన మూడు రోజుల కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడం ద్వారా ఉక్రేన్ సైద్ధాంతిక ఆలోచన అర్థమవుతోందని ఆయన విమర్శించారు.

## చర్చ జరగాలి
**(మొదటి పేజీ తరువాయి)**

ప్రతిపక్ష నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఉగ్రవాదంపై సమష్టి సంకల్పాన్ని ప్రదర్శించడానికి పార్లమెంటు ఉభయ సభల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు (ఎల్‌ఒపి) రాహుల్ గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున్‌ఖర్గే ప్రధానమంత్రికి లేఖ రాశారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలనే ప్రతిపక్షం చేసిన ఏకగ్రీవ అభ్యర్థనను పునరుద్ఘాటిస్తున్నాను. పహల్గామ్ ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సిందూర్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదట ప్రకటించిన కాల్పుల విరమణ విషయంపై ప్రజలు, ప్రజాప్రతినిధులు చర్చించడం చాలా ముఖ్యం. రానున్న సవాళ్లను ఎదుర్కోవడానికి మన సమష్టి సంకల్పాన్ని ప్రదర్శించడానికి ఇది ఒక అవకాశం అవుతుంది' అని రాహుల్ గాంధీ తన లేఖలో పేర్కొన్నారు. ఈ డిమాండ్‌ను తీవ్రంగా, త్వరగా పరిశీలిస్తారని తాను విశ్వసిస్తున్నానన్నారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది, ముఖ్యంగా పర్యాటకులు మరణించిన నేపథ్యంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రిని కోరుతూ తాను, రాహుల్ గాంధీ ఏప్రిల్ 28న రాసిన లేఖలను ఖర్గే గుర్తుచేశారు. తాజా పరిణామాల దృష్ట్యా, పహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్, కాల్పుల విరమణ ప్రకటనలపై చర్చించడానికి పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలనే అన్ని ప్రతిపక్ష పార్టీల ఏకగ్రీవ అభ్యర్థనను లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ఇప్పటికే మరోసారి లేఖ రాశారన్నారు. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా తాను ప్రతిపక్షాల అభ్యర్థనకు మద్దతుగా లేఖ రాస్తున్నానన్నారు. దీనిని అంగీకరిస్తారని భావిస్తున్నట్లు ప్రధానికి రాసిన లేఖలో ఖర్గే పేర్కొన్నారు.

## పది ర్యాంకులూ బాలురవే
**(మొదటి పేజీ తరువాయి)**

మాదాపూర్‌కు చెందిన ఉదగండ్ల రామచరణ్ రెడ్డి రెండవ ర్యాంకును సాధించారు. ఫార్మా, అగ్రికల్చర్ విభాగంలో మేడ్చల్ జిల్లాకు చెందిన సాకేత్‌రెడ్డికి మొదటి ర్యాంక్, కరీంనగర్‌లోని వావిరాల రామిరెడ్డి నగర్‌కు చెందిన సబ్బాని లలిత్ వరేణ్య రెండవ ర్యాంక్‌ను సాధించారు. 'ఎప్‌సెట్' ఫలితాలను హైదరాబాద్, జుబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదివారం ఫలితాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణ, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఎ.శ్రీదేవసేన, జెఎన్‌టియు హెచ్ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎప్‌సెట్‌లో మొత్తం 3,07,088 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. ఏప్రిల్ 29, 30వ తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా, మే 2, 3, 4వ తేదీలల్లో ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 16 టెస్ట్ జోన్ల పరిధిలోని 124 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో మొత్తంగా 2,20,326 అభ్యర్థులు నమోదు చేసుకోగా, 2,07,190 మంది పరీక్షలు రాశారు. ఇందులో 1,51,779 (73.26 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. కాగా బాలురు 1,19,051మంది, బాలికలు 88,139 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే అగ్రికల్చర్, ఫార్మావిభాగంలో మొత్తం 86,762 మంది నమోదు చేసుకోగా, 81,198 మంది(87.82 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 19,867 మంది, బాలికలు 61,331 మంది ఉత్తీర్ణులయ్యారు.

**ఇంజనీరింగ్ విభాగం:** మొదటి ర్యాంక్ పల్లా భరత్ చంద్ర (ఎపి, పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ). రెండవ ర్యాంక్ ఉదగండ్ల రామచరణ్ రెడ్డి (రంగారెడ్డి జిల్లా మాదాపూర్). మూడవ ర్యాంక్ హేమసాయి సూర్య కార్తీక్ (ఎపి,విజయనగరం). 4వ ర్యాంక్ మెండె లక్ష్మీ భార్గవ్ (హైదరాబాద్, నాచారం). 5వ ర్యాంక్ మంత్రిరెడ్డి వెంకట గణేశ్ రాయల్ (రంగారెడ్డి జిల్లా, మాదాపూర్). 6వ ర్యాంక్ సుంకర సాయి రిశాంత్ రెడ్డి (రంగారెడ్డి జిల్లా, మాదాపూర్. 7వ ర్యాంక్‌రష్మిత్ బండారి (రంగారెడ్డి జిల్లా, మాదాపూర్). 8వ ర్యాంక్‌బనిబ్రత మాజీ (రంగారెడ్డి జిల్లా, బడంగ్‌పేట). 9వ ర్యాంక్‌కొత్త ధనుష్ రెడ్డి (హైదరాబాద్). 10వ ర్యాంక్ కొమ్మ శ్రీకార్తీక్ (మేడ్చల్ హైదరాబాద్)

**అగ్రికల్చర్, ఫార్మా :**
మొదటి ర్యాంక్‌పెద్దకాగరి సాకేత్ రెడ్డి (మేడ్చల్‌హైదరాబాద్).రెండవ ర్యాంక్ సబ్బాని లలిత్ వరేణ్య (కరీంనగర్, వావిలాల రామ్‌రెడ్డి నగర్). మూడవ ర్యాంక్ చాడ అక్షిత్ (వరంగల్).4వ ర్యాంక్ పెద్దింటి రాచల సాయి నంద్ (వనపర్తి జిల్లా కొత్తకోట). 5వ ర్యాంక్ బ్రాహ్మణి రెండ్ల (రంగారెడ్డి జిల్లా ,మాదాపూర్). 6వ ర్యాంక్‌గుమ్మడిదల తేజస్ (మేడ్చల్ జిల్లా, కూకట్‌పల్లి). 7వ ర్యాంక్‌కొలన్ అఖిరనద్ రెడ్డి (హైదరాబాద్, నిజాంపేట్). 8వ ర్యాంక్‌భానుప్రకాష్ రెడ్డి సాదు (రంగారెడ్డి జిల్లా, సరూర్‌నగర్). 9వ ర్యాంక్ అర్జ శామ్యూల్ సాత్విక్ (రంగారెడ్డి జిల్లా, హైదర్‌గూడ). 10వ ర్యాంక్‌శశికిరణ్‌రెడ్డి అద్దుల (రంగారెడ్డి జిల్లా, బాలాపూర్).

## ఎందుకు అవకాశమిచ్చారు?
**(మొదటి పేజీ తరువాయి)**

విరమణ ఒప్పందానికి అక్షరాలా కట్టుబడాలని సిపిఐ పిలుపు ఇచ్చింది. అదేసమయంలో రెండు దేశాలూ సామ్రాజ్యవాదుల జోక్యాన్ని, బాహ్యశక్తుల జోక్యాన్ని తిరస్కరించడంద్వారా ప్రాంతీయ స్వయంప్రతిపత్తిని పరిరక్షించాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేసింది. పరస్పర విశ్వాసం ప్రాతిపదికపై, రెండు దేశాల ప్రజల ఆశయాలను గౌరవిస్తూ ద్వైపాక్షిక రాజకీయ ప్రక్రియను పునరుద్ధరించాలని సిపిఐ విజ్ఞప్తి చేసింది. అసలు ఈ రెండు దేశాలమధ్య అమెరికా చేసిన మధ్యవర్తిత్వం ఏమిటో ప్రజలకు మోదీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. వీలైనంత త్వరగా పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఈ మొత్తం వ్యవహారంపై ఎలాంటి దాపరికాలు లేకుండా సమగ్ర చర్చలు జరపాలని కోరింది. సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ఆదివారంనాడు ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. భారత్–పాకిస్థాన్ దేశాలమధ్య కాల్పుల విరమణ అంగీకారాన్ని సిపిఐ స్వాగతించింది. పూర్తిస్థాయి యుద్ధాన్ని నివారించి, దక్షిణాసియాలో శాంతి సంరక్షణ దిశగా పాకిస్థాన్ సానుకూలమైన, చర్య తీసుకోవడంపట్ల హర్షం ప్రకటించింది. ఈ పరిణామం వాస్తవాధీనరేఖ వెంబడి నివసిస్తున్న ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని, రెండు దేశాలమధ్య దీర్ఘకాలంగా శత్రుత్వం కొనసాగుతోందని పేర్కొంది. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా ఘర్షణలకు ఆజ్యంపోసే చరిత్రగల సామ్రాజ్యవాద అమెరికా దేశాన్ని మధ్యవర్తిత్వం చేసేందుకు భారత్–పాకిస్థాన్ ప్రభుత్వాలు ఎలా అంగీకరించాయని ప్రశ్నించింది. ఈ రెండు దేశాలమధ్యా ఒక ద్వైపాక్షిక సమస్యగా ఉన్న విషయంలో ఘర్షణలకు ఆజ్యం పోసే బాహ్యశక్తి మధ్యవర్తిత్వాన్ని అనుమతించడం ఇబ్బందికరంగా మారిందని సిపిఐ పేర్కొంది. మధ్యవర్తిత్వానికి అమెరికా చొరవను అంగీకరించడం ద్వారా భారత ప్రభుత్వం సిమ్లా ఒప్పంద సారాంశాన్ని ఉల్లంఘించిందనీ, తద్వారా కశ్మీరు సమస్యను అంతర్జాతీయాకరణ చేసేందుకు అవకాశం ఇచ్చిందని సిపిఐ ఆందోళన వ్యక్తం చేసింది.

## రుచిచూపించాం
**(మొదటి పేజీ తరువాయి)**

చెప్పాలన్నదే ఆపరేషన్ సిందూర్ లక్ష్యం. సరిహద్దు అవతల ఉన్న ఉగ్ర శిబిరాలను కచ్చితమైన ఆధారాలతో గుర్తించాం. స్పష్టమైన ఆధారాలతో 9 ఉగ్రవాద శిబిరాలపై దాడులు నిర్వహించాం. ఈ దాడుల్లో 100 మంది ఉగ్రవాదులు చనిపోయారు. ఆ దాడులతో పాకిస్థాన్ వణికిపోయింది. ఆ తర్వాత మన పౌరులే లక్ష్యంగా పాకిస్థాన్ దాడులకు పాల్పడింది. అనంతరం తగిన మూల్యం చెల్లించుకుంది. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఉగ్రస్థావరాలపై దాడిలో ఇండియన్ ఎయిర్ లైన్స్ ఫ్లైట్ ఐసి814 హైజాకర్లు, పుల్వామా దాడుల్లో పాల్గొన్న ముష్కరులు హతమయ్యారు. వీరిలో యూసుఫ్ అజహర్, అబ్దుల్ మాలిక్ రౌఫ్, ముదాసిర్ అహ్మద్ తదితరులు ఉన్నారు' అని ఆర్మీ డిజిఎంఒ రాజీవ్ ఘాయ్ వెల్లడించారు.

**40 మంది పాక్ సైన్యం మృతి!**

'ఈ నెల 8, 9వ తేదీ రాత్రి భారత్‌పై గగనతల దాడికి పాకిస్థాన్ యత్నించింది. డ్రోన్లు, మానవ రహిత విమానాలు మనవైపు దూసుకొచ్చాయి. వాటన్నింటినీ భారత గగనతల రక్షణ వ్యవస్థ సమర్థంగా తిప్పికొట్టింది. పౌరులపై దాడులను అడ్డుకున్నాం. డ్రోన్ దాడులకు ప్రతిగా పాక్ రాడార్ స్టేషన్లు, సైనిక స్థావరాలపై బలమైన దాడులు నిర్వహించాం. గగనతలం నుంచి భూతలంపై ఉన్న లక్ష్యాలను ఛేదించాం. లక్ష్యాల సాధనలో భారత్ వైపు ఎలాంటి నష్టం లేకుండా దాడులు చేశాం. భారత్‌వైపు వచ్చిన ప్రతి డ్రోన్‌ను నిర్వీర్యం చేశాం. లాహోర్, గుజ్రన్ వాలా రాడార్ కేంద్రాలను ధ్వంసం చేశాం. డ్రోన్ల దాడుల సమయంలో పాకిస్థాన్ పౌరవిమానాలనూ ఆకాశంలోకి అనుమతించింది. పరిస్థితి గమనిస్తూ.. కచ్చితమైన లక్ష్యాలతో పాక్ సైనిక స్థావరాలపై దాడులు చేశాం. మొత్తంగా మూడు రోజులపాటు కొనసాగిన దాడుల్లో 35 నుంచి 40 మంది పాకిస్థాన్ సైనికులు చనిపోయినట్లు అంచనా వేస్తున్నాం' అని డిజిఎంఒ స్థాయి అధికారులు పేర్కొన్నారు.

**మళ్లీ దాడులు చేస్తే..**

'పాక్ ఎన్ని దుశ్చర్యలకు పాల్పడినా దీటుగా స్పందించేందుకు సిద్ధంగా ఉన్నాం. పాక్ ప్రతిపాదన మేరకే కాల్పుల విరమణపై అవగాహనకు వచ్చాం. అయినా కొన్ని గంటల్లోనే మళ్లీ డ్రోన్ దాడులు కొనసాగించింది. ఇదే పరిస్థితి నేడు కొనసాగితే తీవ్ర ప్రతిచర్యలు ఉంటాయి. ఉల్లంఘనలపై దీటుగా స్పందించేందుకు క్షేత్రస్థాయి అధికారులకు సైన్యాధ్యక్షుడు పూర్తి అధికారాలు ఇచ్చారు' అని డిజిఎంఒ అధికారి స్పష్టం చేశారు.

పాక్ విమానాలను కూల్చేశాం

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్‌కు చెందిన కొన్ని అత్యాధునిక విమానాలను కూల్చేశామని ఎయిర్ మార్షల్ ఎకె భారతీ వెల్లడించారు. భారత యుద్ధ విమానాలను పాకిస్థాన్ నిర్బంధించినట్లు వచ్చిన వార్తలపై స్పందిస్తూ.. భారత పైలట్లందరూ సురక్షితంగా తిరిగి వచ్చారని చెప్పారు. మన స్థావరాలపై దాడి చేసేందుకు వారు చేసిన ప్రయత్నాలను గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని అన్నారు.

**సంసిద్ధంగా నౌకాదళం**

ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత నౌకాదళం కూడా పూర్తి సంసిద్ధతతో ఉందని ఇండియన్ నేవీ వెల్లడించింది. పహల్గాం దాడి తర్వాత వెంటనే అప్రమత్తమయ్యామని, బలగాలతోపాటు సబ్ మెరైన్లను సముద్రంలో మోహరించామని తెలిపింది. అవసరమైతే కరాచీ పోర్టు కూడా తమ లక్ష్యాల్లో ఒకటని పేర్కొంది. తాత్కాలిక కాల్పుల విరమణ అవగాహన నేపథ్యంలో పాకిస్థాన్ నేవీ, ఎయిర్ బేస్‌లపై నిఘా పెట్టామని.. ఈసారి పాక్ ఉల్లంఘనలకు పాల్పడితే భారత్ ఏం చేయనుందో వారికి తెలుసునని వైస్ అడ్మిరల్ ఎఎన్ ప్రమోద్ పేర్కొన్నారు.

## ఇవ్వాల్సిందే
**(మొదటి పేజీ తరువాయి)**

ఉగ్రవాదులు గతంకంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది, కోరుకున్నచోట ఉగ్రవాదుల సహకారాన్ని ఆశించినప్పటికీ, ఇక పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని కొనసాగించదు అని వర్గాలు పేర్కొన్నాయి. 1947వ సంవత్సరం నుండీ రెండు దేశాలమధ్యా కొనసాగుతున్న వివాదాన్ని పరిష్కరించడానికి మధ్యవర్తిత్వం చేస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంసిద్ధత వ్యక్తం చేసిన తర్వాత ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించింది. పాకిస్థాన్ ఆక్రమణలో ఉన్న భారత భూభాగాన్ని తిరిగి ఇవ్వడం ఒక్కటే మిగిలి ఉంది. కశ్మీరుకు సంబంధించి ఇక ఆ ఒక్క విషయం గురించే మాట్లాడతాం అని ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ పిటిఐ వార్తాసంస్థ వెల్లడించింది. పిటిఐ తెలిపిన సమాచారం ప్రకారం, అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ శనివారంనాడు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో టెలిఫోన్‌లో సంభాషించారు. రెండు దేశాలమధ్య ఉద్రిక్తతలు తగ్గించడం గురించి మాట్లాడారు. ''వాళ్ళు దాడి చేస్తే, భారతదేశం ఇంకా బలంగా, మరింత శక్తిమంతంగా ఎదురుదాడి చేస్తుంది'' అని మోదీ ఆయనకు తెలియజేశారు. ఇదిలా ఉండగా, పాకిస్థాన్ చేసే ప్రతీ చర్యకూ మరింత బలంగా ప్రతిస్పందించాలని సాయుధ బలగాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశించారని కేంద్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. సరిహద్దుల్లో ఉగ్రవాదాన్ని గతంకంటే భిన్నంగా అసాధారణంగా ప్రతిఘటించాలని ఆజ్ఞాపించారన్నారు. ''అటువైపు నుండి ఒక తూటా మనమీదకు వస్తే మీరు వారిపై ఇటువైపు నుండి గుళ్ళవర్షం కురిపించండి'' (వహాఁ సే గోలీ చలేగీ, తో యహాఁ సే గోళా చలేగా) అని ఆపరేషన్ సిందూర్' అనంతర పరిణామాల నేపథ్యంలో సాయుధబలగాలకు మోదీ ఆదేశించారని ఆదివారంనాడు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ శనివారంనాడు సాయంత్రం పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ, భూ, జల, గగనతల మార్గాలలో సైనిక చర్యలు చేయకుండా రెండు దేశాలూ అంగీకరించాయని, ఆ మేరకు ఒక అవగాహనకు వచ్చాయన్నారు.

నాలుగురోజులపాటు ఉద్ధృతంగా అనధికార యుద్ధం జరిగిన తర్వాత రెండు దేశాలూ ఈ అవగాహనకు వచ్చాయన్నారు. ఐతే ఈ కాల్పుల విరమణ పరిణామాన్ని మొదట అమెరికా ప్రకటించింది. డోనాల్డ్ ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియా ద్వారా పోస్టింగ్ పెట్టారు. రెండు దేశాలూ తక్షణం, పూర్తిస్థాయిలో కాల్పుల విమరణకు అంగీకరించాయని, అందుకు అమెరికా మధ్యవర్తిత్వమే కారణమని ట్రంప్ ప్రకటించుకున్నారు. ఆ తర్వాతే మిస్రి పత్రికాగోష్ఠిలో కాల్పుల విరమణ అంగీకారం గురించి చెప్పారు. తామే మధ్యవర్తిత్వం చేశామని ట్రంప్ చెప్పుకుంటున్న తరుణంలో ఆ విషయం నిజమేనని మిస్రీ చెబుతూ, పాకిస్థాన్‌కు చెందిన డిజిఎంఒ స్వయం గా భారత డిజిఎంఒకు శనివారం మధ్యాహ్నం 3.35 గంటలకు ఫోన్ చేశారు, ఉద్రిక్తతలు తగ్గించుకుందాం అని అడిగారని మిస్రీ చెప్పారు.

## మధ్యవర్తిత్వం చేస్తాం ట్రంప్
**(మొదటి పేజీ తరువాయి)**

దేశాలమధ్య యుద్ధంలో మరణించి ఉండేవారని ట్రంప్ అన్నారు. నాలుగు రోజులుపాటు రెండు దేశాలమధ్య శత్రుత్వం రగిలిపోయింది. అనధికారికంగా భీకరయుద్ధం జరిగింది. ఈ సందర్భంగా ట్రంప్ తన ప్రకటనలో, భారత్–పాకిస్థాన్ రెండు దేశాలతో వాణిజ్య సంబంధాలను విస్తృతం చేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా అనేక దశాబ్దాలుగా రెండు దేశాలమధ్యా నలుగుతున్న కశ్మీరు సమస్య పరిష్కారానికి మధ్యవర్తిత్వం చేస్తామని ట్రంప్ ప్రకటించారు. ''భారత్–పాకిస్థాన్ దేశాలు రెండూ ఎంతో విజ్ఞతతో వ్యవహరించాయి, వివేకంగా రాబోయే పరిణామాలను అర్థం చేసుకుని వ్యవహరించాయి. రెండు దేశాలలో ఉన్న శక్తిమంతమైన నాయకత్వం, బలమైన నాయకత్వం చూసి నేను ఎంతో గర్వపడుతున్నాను, ప్రస్తుత దురాక్రమణను ఆపడానికి ఇదే సరైన తరుణం, ఈ తరుణంలో ఈ నిర్ణయం తీసుకోకపోయి ఉంటే రెండు దేశాలమధ్య యుద్ధంలో లక్షలమంది మరణించి ఉండేవారు, అమాయకులు మరణించి ఉండేవారు, మీరు ధైర్యసాహసాలతో తీసుకున్న చర్యలు మీ వారసత్వాన్ని ఇనుమడింపజేశాయి, అమెరికా ఈ విషయంలో మీకు సహాయంచేయగల శక్తిసామర్థ్యాలు ఉన్నందుకు నేను ఎంతో గర్వపడుతున్నాను. ఈ చరిత్రాత్మకమైన, వీరోచిత నిర్ణయం తీసుకోవడానికి అమెరికా సహకరించింది, ఈ రెండు గొప్ప దేశాలతోనూ వాణిజ్యాన్ని విస్తారంగా పెంచుకోవాలని అమెరికా భావిస్తోంది, అదనంగా కశ్మీరు సమస్య పరిష్కారానికి మీ ఇద్దరితో కలిసి పని చేస్తాం, రెండు దేశాలు వ్యవహరించిన తీరుకు దేవుడు మిమ్మల్ని ఆశీర్వదించాలి'' అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో రాశారు. వెయ్యి సంవత్సరాలైనా కశ్మీరుకోసం పోరాటం చేస్తాం అని పాకిస్థాన్ గతంలో చెప్పిన విషయాన్ని కూడా ట్రంప్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

## 'సీతారామ ప్రాజెక్ట్'కు అనుమతులు లేవన్నది అబద్ధం
### మాజీ మంత్రి హరీశ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సీతారామ ప్రాజెక్టుకు సెంట్రల్ వాటర్ కమిషన్(సిడబ్ల్యుసి) హైడ్రాలజీ అనుమతులులేవని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలను ప్రచారం చేస్తోందని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. 2018 అక్టోబర్ 30న గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాజెక్ట్‌కు సంబంధించిన డిపిఆర్‌ను కేంద్ర జల సంఘానికి అందజేసిందని, 2021 సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లోనే 113.795 టిఎంసిల నీళ్లు ప్రతిపాదిత సీతారామ ప్రాజెక్టుకు అందుబాటులో ఉన్నాయని సిడబ్ల్యుసి హైడ్రాలజీ విభాగం నిర్ధారించిందని హరీశ్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కింద 70.4 టిఎంసిల నీటిని వినియోగించి 6.74 లక్షల ఎకరాలకు సాగు నీటిని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం,మహబూబాబాద్ జిల్లాలకు ఇవ్వవచ్చని, తాగునీటితో పాటు పారిశ్రామిక అవసరాలకు వినియోగించుకోవచ్చని కేంద్ర ప్రభుత్వం 2021లోనే నిర్ధారించిందని పేర్కొన్నారు.

అంత ర్రాష్ట్ర సమస్యలు, అటవీ అనుమతుల ఇబ్బందులను అధిగమించేందుకు గత సిఎం కెసిఆర్ సమీకృత సీతారామ ప్రాజెక్టును రూపకల్పన చేశారని, ఈ ప్రాజెక్ట్ ద్వారా రాజీవ్ సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టుల్లో ప్రతిపాదించిన 3.33 లక్షల ఎకరాల ఆయకట్టతో పాటు, అదనంగా మరో 3.41 లక్షల ఎకరాలకు నీరును అందించి,నిల్వ సామర్థ్యాన్ని 1.2 టిఎంసి నుంచి 10 టిఎంసిలకు పెంచి, 7,967 కోట్లతో పనులు ప్రారంభించారని హరీశ్‌రావు తెలిపారు. టిఎసి తప్ప అన్ని అనుమతులను తాము అధికారంలో ఉన్నప్పుడే పూర్తి చేశామని, ఈ ప్రాజెక్ట్‌కు అనుమతులు లేవని మంత్రి ఉత్తమ్ మాట్లాడడం అవగాహన రాహిత్యమేనని, అధికారులతో మాట్లాడి వాస్తవాలు తెలుసుకోవాలని హరీశ్‌రావు సూచించారు. ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో 6.74 లక్షల ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగునీరు అందించే ఈ ప్రాజెక్ట్ ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తుంటే, రాజకీయ భవిష్యత్తు ఉండదన్న అక్కసుతోనే కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతోనే పాలనను కొనసాగిస్తోందని ఆయన ఆరోపించారు.

రాష్ట్ర ప్రయోజనాలను తమ సొంత రాజకీయ ప్రయోజనాలకు తాకట్టు పెట్టే కాంగ్రెస్ నాయకులు, బిఆర్‌ఎస్ ,కెసిఆర్ గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో కనీసం ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేదని, ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదని పే ర్కొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులకు జాతీయ సాంకేతిక దినోత్సవ శుభాకాంక్షలు :సిఎం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ సాంకేతిక దినోత్సవం (నేషనల్ టెక్నాలజీ డే) పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శాస్త్రవేత్తలు,ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్ అభివృద్ధికి చిరునామాగా నిలిచే టెక్నాలజీ రంగంలో నూతన ఆవిష్కరణలకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహాయ, సహకారాలను అందిస్తామని పేర్కొన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకొని భారత టెక్నాలజీ శక్తిని ప్రపంచానికి చాటేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిఎం ఆకాంక్షించారు.

**మాతృమూర్తులకు సిఎం శుభాకాంక్షలు**

మాతృదినోత్సవ సందర్భంగా మాతృమూర్తులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుభకాంక్షలు తెలిపారు. జన్మకు ఆధారం, అమూల్య ప్రేమకు, ప్రతి రూపం, ప్రతి ఇంటా కొలువుండే దైవం అమ్మ అని పేర్కొన్నారు. మానవ సమాజానికి పునాది అమ్మ ఒడి, ఆప్యాయత, ఓర్పు, శక్తికి ప్రతిరూపమైన ప్రతి తల్లికి మెరుగైన జీవనం అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని తెలంగాణ తల్లి, ఆశీస్సులతో మహిళా శక్తిని చాటుదామన్నారు.

### నేటి నుంచి మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో

# స్లాట్ బుకింగ్



మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోమవారం నుంచి 'స్లాట్ బుకింగ్' విధానాన్ని అమలు చేయనున్నారు. వచ్చే నెల చివరినాటికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ప్రజల సమయాన్ని ఆదా చేసేందుకు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో కీలక సంస్కరణలకు స్వీకారం చుట్టామని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు వచ్చే కొనుగోలుదారులు, అమ్మకందారులు గంటల తరబడి చెట్ల కింద నిరీక్షించాల్సిన పరిస్థితిని మార్చుతూ, సబ్ రిజిస్టర్ కార్యాలయాలను ఆధునికీకరించడంతో పాటు, స్లాట్ బుకింగ్ విధానాన్ని దశలవారీగా అమలులోకి తీసుకొస్తున్నామన్నారు. ఇప్పటికే గత నెల 10వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో చేపట్టిన స్లాట్ బుకింగ్ విజయవంతం కావడంతో, సోమవారం (ఈ నెల 12వ తేదీ) నుంచి మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయబోతున్నామని మంత్రి ప్రకటించారు. వచ్చే నెల చివరినాటికి రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమలులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు వేగవంతమైన, సమర్థమైన సేవలందించడమే లక్ష్యంగా సంస్కరణలు తీసుకురావడంతో పాటు వాటిని అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదే అని మంత్రి స్పష్టం చేశారు.

**నేటి నుంచి స్లాట్ బుకింగ్ అమలు కానున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు :**

హైదరాబాద్ ఆర్‌ఓ కార్యాలయం, హైదరాబాద్ ఆర్‌ఓ ఆఫీస్ సౌత్,నారపల్లి, ఘట్‌కేసర్, మల్కాజిగిరి, ఉప్పల్, కాప్రా, బిబినగర్, సిద్ధిపేట, సిద్దిపేట్ రూరల్, గజ్వేల్, మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్ ఆర్‌ఓ ఆఫీసు, జనగాం, ఘన్‌పూర్, నర్సంపేట, కల్వకుర్తి, నారాయణపేట, మహేశ్వరం, రంగారెడ్డి ఆర్.ఓ ఆఫీసు, షాద్‌నగర్, ఫరూక్‌నగర్, వనస్థలిపురం, శేరిలింగంపల్లి.

**రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ**

స్లాట్ బుకింగ్ విధానాన్ని దృష్టిలో పెట్టుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరణ చేస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. అధిక, తక్కువ రద్దీ ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిని విలీనం చేసి, పనిభారాన్ని సమానం చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే రంగారెడ్డి జిల్లాలోని చంపాపేట, సరూర్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అధికార పరిధి విలీన ప్రక్రియ విజయవంతమైందని, షాద్ నగర్, ఫారూక్ నగర్ సిద్ధిపేట, సిద్దిపేట (రూరల్) విలీనం చేశారన్నారు.

**48 స్లాట్స్ దాటితే అదనపు సబ్ రిజిస్ట్రార్లు**

పని ఒత్తిడి ఎక్కువగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని సులభతరం చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. 48 స్లాట్స్ కంటే ఎక్కువ స్లాట్స్ అవసరమైన కార్యాలయాలలో ప్రస్తుత సబ్ రిజిస్ట్రార్లకు తోడుగా అదనపు సబ్ రిజిస్ట్రార్లను నియమిస్తామని, ఇప్పటికే ప్రయోగాత్మకంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు, సిబ్బందిని నియమించామని వివరించారు. ఈ విధానాన్ని ఉప్పల్, మహేశ్వరం, మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో ప్రవేశపెట్టనున్నామని, అదనంగా ఒక్కొక్క సబ్ రిజిస్ట్రార్‌ను నియమిస్తామన్నారు.

# త్యాగాలకు చిరునామా ప్రకాశరావు కుటుంబం

భవిష్యత్తు పోరాటాలకు సంస్మరణ సభలు నాంది పలకాలి

సుశీలమ్మ సంస్మరణ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



**ప్రజాపక్షం/ఖమ్మం :** తుదిశ్వాస వరకు పేదల పక్షాన నిలిచి అనేక పోరాటాలకు కేంద్ర బిందువుగా నిలిచిన తూము ప్రకాశరావు కుటుంబం త్యాగాలకు చిరునామాగా నిలిచిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. మధిర తాలూకాలో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ పునర్ నిర్మాణంలో తూము ప్రకాశరావు చేసిన కృషి అజరామరమని ఆయన మరణానంతరం కమ్యూనిస్టు పార్టీకి దన్నుగా నిలిచిన సుశీలమ్మ ధన్యజీవి అని ఆయన తెలిపారు. ఇటీవల మరణించిన బోనకల్ మండలం రాయన్నపేట మాజీ సర్పంచ్ సిపిఐ నాయకురాలు తూము సుశీలమ్మ సంస్మరణ సభ ఆదివారం రాయన్నపేట గ్రామంలో జరిగింది. తోట రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా పేదల హక్కుల కోసం ముఖ్యంగా భూ పంపిణీ కోసం ప్రకాశరావు చేసిన పోరాటంతో అనేక మంది పేదలకు భూములు దక్కాయని ఆయన తెలిపారు. కలకోట చెరువుపై హక్కులు పేదలకు చెందాలని ప్రకాశరావు తుదిశ్వాస వరకు పోరాడారన్నారు. ఆయన అమరత్వం తర్వాత సుశీలమ్మ గ్రామ సర్పంచ్‌గా, సిపిఐ నాయకురాలిగా కమ్యూనిస్టు పార్టీకి దన్నుగా నిలిచారని ఆ అమర దంపతుల వారసత్వాన్ని కొనసాగిస్తూ వారి కుటుంబం కమ్యూనిస్టు పార్టీకి అండగా నిలవడమే కాకుండా విభిన్న రీతిలో సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయం, ఆదర్శనీయమని కూనంనేని తెలిపారు. సిద్ధాంత బలమే శతాబ్ద కాలంగా కమ్యూనిస్టు పార్టీని నిలబెడుతుందని కమ్యూనిజం అజరామరం, విశ్వవ్యాప్తమని సాంబశివరావు తెలిపారు. అధికారంలో లేకున్నా కమ్యూనిస్టులు తమ పక్షానే నిలుస్తున్నారని ఇందుకు సింగరేణి ఎన్నికల్లో గెలుపే నిదర్శనమన్నారు. పోరాట వారసత్వాన్ని కొనసాగించడమే సరైన నివాళి అని కూనంనేని తెలిపారు.

**సమాజ చైతన్యం కోసం పోరాడేది కమ్యూనిస్టులే : ఎమ్మెల్సీ తాతా మధు**

సమాజ చైతన్యం కోసం పోరాడేది కమ్యూనిస్టులు మాత్రమేనని బిఆర్ఎస్ అధ్యక్షులు, శాసన మండలి సభ్యులు తాతా మధుసూదన్ తెలిపారు. సుశీలమ్మ సంస్మరణ సభలో తాతా మధుసూదన్ మాట్లాడుతూ తూము ప్రకాశరావుది చరిత్ర కలిగిన కుటుంబమని సౌకర్యాలు లేని రోజుల్లో ప్రకాశరావు నిర్వహించిన సేవ నేటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయిందన్నారు. ప్రకాశరావు కుటుంబ సభ్యులు, మనువలు సేవా వారసత్వాన్ని కొనసాగించడం అభినందనీయమని ఆయన తెలిపారు. ఈ సభలో టిడిపి నాయకులు వాసిరెడ్డి రామనాథం, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, వివిధ పార్టీల నాయకులు చిదిరాల వెంకటేశ్వరరావు, జమ్ము ల జితేందర్‌రెడ్డి, చింతలచెరువు కోటేశ్వరరావు, బత్తినేని చారిటబుల్ ట్రస్టు నిర్వహకులు బత్తినేని ప్రకాష్, ప్రకాశరావు, సుశీలమ్మల కుమార్తెలు బత్తినేని నీరజ, పారా వనజ, తూము రోషన్‌కుమార్, వట్టికొండ చంద్రమోహన్, యంగల ఆనందరావు తదితరులు ప్రసంగించగా వేదికపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి లతాదేవి, శింగు నర్సింహారావు, పోటు కళావతి, బెజవాడ రవిబాబు, తాటి వెంకటేశ్వరరావు, ఏపూరి రవీంద్ర బాబు, కాంగ్రెస్ నాయకులు రంగిశెట్టి కోటేశ్వరరావు, బత్తినేని నాగప్రసాదరావు, ఉమ్మనేని కోటయ్య, తాటి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# పుష్కర పనుల్లో నాణ్యత పాటించాలి



అభివృద్ధి పనులపై మంత్రి అసహనం

ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి/కాళేశ్వరం :** సరస్వతి పుష్కర పనుల్లో నాణ్యత పాటించాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. ఆదివారం కాళేశ్వరంలో విఐపి ఘాట్, సరస్వతి మాతా విగ్రహం, జ్ఞానతీర్థం, నదిలో భక్తుల స్నానమాచరించు ప్రదేశం, టెంట్ సిటీ తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం టెంట్ సిటీలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ముఖ్యమంత్రి రాక సందర్భంగా బందోబస్తు, పనులు పూర్తి చేయు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పనులు చాలా మెల్లగా జరుగుతున్నాయని మీరే జవాబు చెప్పాలని అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. పట్టణం మొత్తాన్ని విద్యుద్దీకరణతో ముస్తాబు చేయాలని 12 రోజులు పండుగ వాతావరణంలో పుష్కరాలు నిర్వహించాలని సూచించారు. పిండ ప్రధాన భవనం అసంపూర్తిగా ఉందని దేవాదాయ ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులు హారతి కార్యక్రమాన్ని వీక్షించేందుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులు నదిలోకి స్నానాలకు వెళ్ళడానికి తాత్కాలిక రహదారి ఏర్పాటుతో పాటు క్వియర్ మాట్ ఏర్పాటు చేయాలని తెలిపారు. భక్తులు నదిలోకి వెళ్లకుండా వెళ్లకుండా బారికేడ్స్, ప్రమాద హెచ్చరికల బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. నదిలో 50 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడంతో పాటు నాటుపడవలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. పుష్కరాలు సందర్భంగా మొట్టమొదటిసారిగా కాళేశ్వరంలో టెంట్ సిటి ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమాలు సజావుగా, సక్రమంగా పకడ్బందీగా జరిగేందుకు మినిట్ టు మినిట్ కార్యక్రమం తయారు చేయాలని సూచించారు. రహదారులకు మరమ్మత్తులు నిర్వహించాలని ఎక్కడ గుంతలు ఉండొద్దని ఆర్ అండ్ బి, జాతీయ రహదారుల అధికారులను ఆదేశించారు. తాత్కాలిక బస్టాండ్ వద్ద తాత్కాలిక లైటింగ్, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పనులు పర్యవేక్షణకు నియమించిన నోడల్ అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని ఆయన ఆదేశించారు. పనులలో నాణ్యత పాటించాలని నాణ్యత పాటించకపోతే చర్యలు తప్పవని మంత్రి కాంట్రాక్టర్లును హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకటరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, దేవాదాయ శాఖ ఆర్జెసి రామకృష్ణారావు, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూఎస్, వైద్య, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి



విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

హెల్త్ హబ్‌గా జగిత్యాల

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజానర్సింహ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే జగిత్యాల జిల్లాను అత్యుత్తమ హెల్త్‌కేర్ హబ్‌గా తీర్చిదిద్దటానికి అన్ని చర్యలు తీసుకుంటామని రాజనరసింహ పేర్కొన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో మెడికల్, హెల్త్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ డీఎంఈ పరిధిలో ఉన్న ఆస్పత్రుల బలోపేతంపై ఆయా విభాగాల అధికారులతో సుధీర్ఘంగా చర్చించారు. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన అన్ని వివరాలను మంత్రి దామోదర్ రాజనర్సింహ అడిగి తెలుసుకున్నారు. వైద్యశాఖ అధికారుల నుంచి ఆసుపత్రులు పనితీరు వైద్యుల సేవలు, ప్రజల స్పందన, ఇబ్బందులు, దవాఖానాల్లో నెలకొన్న సమస్యలను మంత్రి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ జిల్లాలో అవసరమైన వైద్య పరికరాలు అందజేస్తామన్నారు. జగిత్యాల జనరల్ హాస్పిటల్‌కు ఎమ్మారై స్కాన్‌ను మంజూరు చేస్తామని తెలిపారు. జిల్లాలో గల మూడు డయాలసిస్ సెంటర్లలో రోగులకు అత్యుత్తమైన సేవలు అందించాలని, వారి పట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు. వైద్యులు బాధ్యతయుతంగా పని చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ఇందుకు గ్రామ,గ్రామాన అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్ ప్రమాద బాధితులకు జగిత్యాల, ధర్మపురి పరిధిలో ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటుచేస్తామనీ వెల్లడించారు. ఆస్పత్రుల్లో వైద్యులు రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, వారి పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ అత్యుత్తమైన సేవలందించాలని సూచించారు. అయితే అధికారులు, సిబ్బంది పని తీరును మరింత మెరుగుపరుచుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందించి ప్రభుత్వ ఆసుపత్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రజలు ప్రైవేట్ హాస్పిటల్‌కి వెళ్లి డబ్బులు వృధా చేసుకోవద్దని, ప్రభుత్వాసుపత్రుల్లో అత్యాధునికమైన అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలంతా వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమీక్షలో ప్రభుత్వ విప్, ధర్మపురి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కోరుట్ల శాసనసభ్యులు డా.సంజయ్, జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్ బిఎస్ లత, డిఎం అండ్ హెచ్ ఓ డా.ప్రమోద్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డా. ఖాద్రి, జి జి హెచ్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. సుమన్, జిల్లాకు చెందిన వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఐదారు రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రానున్న ఐదారు రోజులు రాష్ట్రంలో పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆదిలాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, నల్లగొండ, మహబూబ్‌నగర్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణ పేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం, మంగళవారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో 5060 కి.మీల వేగంతో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. బుధవారం, గురువారం నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో 5060 కి.మీ వేగంతో ఈదురుగాలు, మెరుపులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని చెప్పారు.

## 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కార్మికులకు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్న 4లేబర్ కోడ్స్ తక్షణమే రద్దు చేయాలని, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న జరగనున్న దేశవ్యాప్త స్వారత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎం.నరసింహ, అధ్యక్షులు మారగోని ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం సార్వత్రిక సమ్మె పోస్టర్లలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తన కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలు చేస్తుందని ఆరోపించారు. కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా వంద సంవత్సరాలలో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో కార్పొరేట్లుకు అనుకూలంగా తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్ ద్వారా పూర్తిగా కార్మిక హక్కులను హరించే ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను వెనక్కి కొట్టేందుకు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు మే 20న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గన్నారపు రమేష్,ఉపాధ్యక్షులు జి.రాజు, గాదె లక్ష్మీ నారాయణ, జి.పరమేష్ సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, సామల మల్లేష్ ,కే.వెంకటేష్, శివశంకర్, పిట్టల సమ్మయ్య, కడారి రాములు కోశాధికారి కన్యాగారి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో 86 మంది తెలంగాణ వాసులు.. స్వస్థలాలకు పయనం!



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత్–పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు బిక్కుబిక్కుమంటూ స్వస్థలాలకు చేరుతున్నారు. శనివారం ఐఐటీ జమ్ములోని 8 మంది తెలంగాణ విద్యార్థులు ఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు దాదాపు 86 మంది తెలంగాణ వాసులు తాజాగా ఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. ఇప్పటివరకు 26 మందిని వారి స్వస్థలాలకు పంపించినట్లు భవన్ అధికారులు తెలిపారు. భవన్‌లో ఉన్నవారికి తెలంగాణ ప్రభుత్వం ఆశ్రయం, ఆహారం, రవాణా సదుపాయం కల్పిస్తోంది. ఉద్రిక్తతలు పెరిగితే మరో 100 మంది వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. సహాయం చేయడానికి ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ పనిచేస్తోందని అక్కడి అధికారులు చెబుతున్నారు. కాగా, ఢిల్లీలోని కంట్రోల్ రూమ్ నంబర్లు ల్యాండ్లైన్: 01123380556, రెసిడెంట్ కమిషనర్ ప్రైవేట్ సెక్రటరీ లైజన్ హెడ్ మొబైల్: 9871999044 , రెసిడెంట్ కమిషనర్ వ్యక్తిగత సహాయకుడు మొబైల్: 9971 387500, లైజన్ ఆఫీసర్ మొబైల్: 9643723157, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మొబైల్: 9949351270 నెంబర్లలో సంప్రదించవచ్చని ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో తండ్రీ కూతురు మృతి...!



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ రూరల్ మండలంలోని నీలాయసేట గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదిలాబాద్ పట్టణానికి చెందిన తండ్రి, కూతురు దుర్మణం చెందారు. ఆదిలాబాద్ రవీంద్ర నగర్ కాలనీకి చెందిన బ్యాటరీ వ్యాపారి బండి శంకర్(49) హైదరాబాదులో బీటెక్ చదువుతున్న కూతురు కృతిక (21) తీసుకురావడానికి కారులో డ్రైవర్‌తో కలిసి హైదరాబాద్ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కారు డ్రైవర్‌కు నిద్ర రావడంతో కాసేపు డ్రైవరును వెనుక సీట్లో, తన కూతురు కృతికను ముందు సీట్లో కూర్చోబెట్టి బండి శంకర్ డ్రైవింగ్ చేస్తుండగా నీలాయిపేట వద్ద ఎదురుగా వస్తున్న డిసిఎం వాహనం ఢీకొట్టింది. దీంతో తండ్రి కూతు రు ఇద్దరూ అక్కడికక్కడే మృతించారు. కారు డ్రైవర్‌తో పాటు డీసీఎం డ్రైవర్‌కు కూడా గాయాలయ్యా యి. మృతి చెందిన శంకర్‌కు ఇద్దరు కవల అడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. తండ్రి కూతురు ఇద్దరు మృతి చెందిన సంఘటన రవీంద్ర నగర్ కాలనీలో తీరని విషాదం సింపింది. నిర్మల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు సాగిస్తున్నారు.

# సంక్షోభంలో ప్రభుత్వ విద్య



**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రభుత్వ విద్య ఏడాది ఏడాదికి సంక్షోభంలో కూరుకుపోతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు, ముగ్గురు ఉన్న పాఠశాల సంఖ్య పెరిగిపోతుంది. విద్యార్థులు లేని కారణంగా మూతపడే పాఠశాలలు ప్రతి విద్యా సంవత్సరం లోనూ పెరుగుతూ వస్తున్నాయి. ఖమ్మం జిల్లాలో సుమారు 64 పాఠశాలలు మూతపడినట్లు సమాచారం. గ్రామీణ ప్రాంతాల్లో మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి మొదలు సంపన్న వర్గాలకు చెందిన పిల్లలు ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో విద్యను అభ్యసిస్తుండగా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు గురుకులాల బాట పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రభుత్వ విద్య పరిరక్షణ పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రత్యక్షంగా ప్రభుత్వ విద్యను పరోక్షంగా ప్రైవేటు ముఖ్యంగా కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితం అవుతుందని, కార్యాచరణ కరువైందని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. ప్రభుత్వ విద్య సంక్షోభంలోకి కూరుకుపోవటానికి విద్యార్థుల తల్లిదండ్రుల్లో పెరిగిన ప్రైవేటు మోజు ఒక కారణమైతే ప్రభుత్వ వైఖరి మరో కారణమవుతుంది. ప్రైవేటులో చదివితేనే చదువు ప్రభుత్వ బడిలో చదువు చదువు కాదన్న ఫోబియా నుంచి ప్రజలను మళ్లించటంలో విఫలమవుతున్నారు. దీనికి తోడు బిల్లు, బెల్లుకు పరిమితమై అంకిత భావంతో పనిచేసే వారి సంఖ్య తగ్గిపోయింది.


**పర్యవేక్షణ కరువు :**

మండల విద్యాశాఖాధికారులు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ కరువవుతుంది. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకే ఎంఈవో బాధ్యతలు అప్పగించడం, వారు పూర్తి కాలం పని చేయకపోవడం ప్రభుత్వ విద్యపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రభుత్వ ఉపాధ్యాయుల తీరు కూడా ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులకు నమ్మకం కోల్పోయేలా చేస్తుంది. ప్రైవేటు వ్యాపారాల్లో మునిగి తాము పనిచేస్తున్న బడిని పట్టించుకోకపోవడం, అసలు కొందరు పాఠశాలకే రావడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రభుత్వ విద్యను పరిరక్షించాలంటే ముందు మౌలిక వసతుల కల్పన, బోధనా సిబ్బంది, నిరంతర పర్యవేక్షణ అవసరం ఈ మూడింటిపై దృష్టి సారించకుండా సమీక్షలతో సరిపెడితే మరింత సంక్షోభంలోకి కూరుకుపోయి కనుమరుగు కాక తప్పదు. ప్రభుత్వ విద్య పరిరక్షణ పోరాటాలు ఉధృతం కాక తప్పదు.

**ఫలితం ఇవ్వని బడిబాట :**

ప్రభుత్వం చేపట్టిన బడిబాట ఆశించిన ఫలితం ఇవ్వటం లేదు. ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతున్నా తల్లిదండ్రుల నుంచి సానుకూల స్పందన రావటం లేదు. కొందరు ఉపాధ్యాయులను మీ పిల్లలు ఎక్కడ చదువుతున్నారంటూ ఎదురు ప్రశ్న వేస్తున్నారు. ఇటీవల ఓ ఉపాధ్యాయుడు నోరుజారి ప్రభుత్వ బడికి పిల్లలను పంపక పోతే రేషన్ బంద్ అవుతుంది అనగానే మీ పిల్లలను పంపటం లేదుగా జీతాలు తీసుకోరా అంటూ ఓ విద్యార్థి తండ్రి ప్రశ్నించిన ఘటన చర్చనీయాంశమైంది. రా రమ్మని పిలిచే బదులు మౌలిక వసతుల కల్పన, ఉత్తమ విద్యా బోధన జరిగితే విద్యార్థులు ఆకర్షితులవుతారన్న వాస్తవాన్ని మరిచిపోతున్నారు. 120 మంది బడిఈడు పిల్లలు ముఖ్యంగా ప్రాథమికోన్నత విద్య అభ్యసించే విద్యార్థులుంటే ఆ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిది మంది మాత్రమే ఉన్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు ఉపాధ్యాయులతో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎంపిడివోలకు ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే బాధ్యతను అప్పగించారు . మరి ఫలితం ఎలా ఉంటుందో.

## నీరా, కల్లును సేవించిన మిస్ వరల్డ్ పోటీదారులు





**ప్రజాపక్షం/హైదరా–బాద్:** మిస్‌వరల్డ్ పోటీల కోసం ఆయా దేశాల నుంచి హైదరాబాద్‌కు వచ్చిన అందగత్తెలు.. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కల్లు తాగారు. తెలంగాణలో సహజంగా దొరికే నీరాకల్లును.. మిస్ వరల్డ్ పోటీదారులు సేవించారు. మేకప్ వేసుకునే ఈ నీరా కల్లు సేవించి... చాలా ఎంజాయ్ చేశారు. తెలంగాణ కల్లు చాలా అద్భుతంగా ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. తెలంగాణ రాష్ట్రంలో మిస్ వరల్డ్ పోటీలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ పోటీలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చాలా అట్టహాసంగా నిర్వహిస్తోంది. శనివారం రోజు నుంచి ప్రపంచ సుందరి పోటీలు హైదరాబాద్ మహానగరంలో అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి.

# సాహితీ విహారి

# సాహిత్యం.. యుద్ధానికి వ్యతిరేకం..

భారత్, పాకిస్తాన్ దేశాలు కాల్పుల విరమణ ప్రకటించాయి. కానీ, పాకిస్తాన్ ఒప్పందాన్ని ఉల్లంఘించి, సరిహద్దుల వెంట కాల్పులకు తగబడుతున్నదని, డ్రోన్లతో దాడులకు దిగుతున్నదని వార్తలు వస్తున్నాయి. ఏక్షణమైనా పూర్తి స్థాయి యుద్ధం ముంచుకొచ్చే ప్రమాదం లేకపోలేదు. పహల్గామ్‌లో ఉగ్రదాడి... అందుకు ప్రతీకారంగా భారత్ దాడులపై చర్చలు పక్కకు ఉంచితే, యుద్ధం ఎవరికీ మంచిది కాదనేది మాత్రం వాస్తవం. ఎందుకంటే, యుద్ధాలు వినాశనాన్నే తప్ప వికాసాన్ని కోరుకోవు. నిశ్శబ్ద వాతావరణంలో బాంబుల మోతలు హోరెత్తుతాయి. తమకు ఏ మాత్రం సంబంధం లేకుండానే, ఎంతో మంది ప్రాణాలు కోల్పోతారు... అంతకు మించిన సంఖ్యలో క్షతగాత్రులై, జీవచ్ఛవాలుగా మారిపోతారు. తల్లి శవంపైపడి ఏడుస్తున్న పసికందును ఎవరు ఓదారుస్తారు? కన్నీటి చుక్కలతో రాసిన నరమేధానికి బలవుతున్న సామాన్యుడు కోలుకునేది ఎప్పుడు? తన ఇంటిని తినేసిన అగ్ని,తన కొడుకు శరీరాన్ని చివరి సారి చూసి రోదిస్తునే ఉన్న ఓ తల్లి కళ్లు తడారిపోయిన వైనానికి కారణం ఎవరన్న ప్రశ్నకు సమాధానం ఎవరిస్తారు? ప్రేమ గదులు, పిల్లల కలలు, బతుకు కథలు... అన్నీ తృటిలో మాయమైతే, సైనికుల బూట్ల సవ్వడిలో తెలియని భయం. 'శాంతి అంటే ఏమిటి?' అన్నది ఓ పసికూన ప్రశ్న. సమాధానం లేదుగానీ... తల్లివో.. తండ్రివో.. తోబుట్టువులో లేక సన్నిహితులవో.. నిశ్శబ్దంగా రక్తపు మరకలు ఎర్రగా మెరుస్తునే ఉన్నాయి. అప్పటి వరకూ అతని ముఖంపై కదలాడిన నవ్వు చీకటిలో కనుమరుగై, బాంబు శబ్దాలతో కలిసి నశించింది. యుద్ధం వచ్చిపడింది... ఇక పక్షుల పాటలు వినిపించవు.. నీలాకాశం కనిపించదు. పసికందుల కేరింతలు... పిల్లల ఆటపాటలు ఉండవు. యుద్ధం... నిర్ణయం కొందరిది... కానీ బాధ మాత్రం లక్షలదిమందికి. శాంతి ఒక్కటే ఈ దారుణ ముఖచిత్రాన్ని మార్చివేయగలదు. రక్తపు నదులు పారకుండా నివారించగలదు. సర్వం కోల్పోతున్న సామాన్యుడి రోదనకు తెరవేయగలదు. శాంతి స్థాపనలో సాహిత్యం పాత్ర అత్యంత కీలకం. విషం కక్కే కొంత మంది కుల, మత ఛాందసవాదుల రచనలను మినహాయిస్తే, ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశంలోనైనా సాహిత్యం యుద్ధాన్ని వ్యతిరేకించింది. వ్యతిరేకిస్తునే ఉంది. యుద్ధం అనే మాట వినగానే మన ముందు పేలుళ్లు, శవాలు, తల్లి చెంత చనిపోయిన శిశువు, కాలిన గ్రామాలు, మానవత్వం లేని కిరాతకత్వం వంటి ఎన్నో చిత్రాలు కనిపిస్తాయి.. కానీ ఈ మారణహోమాల వెనుక మౌనంగా నిలిచే ఓ శక్తి ఉంది.. అదే సాహిత్యం. ఇది మారణాయుధాలు, అస్త్రశస్త్రాలకు ప్రతిగా మానవ విలువలను నెమ్మదిగా, దీర్ఘకాలికంగా సమాజంలో నాటుతుంది. యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ రచనలు చేయడం అనేది ఒక మానవతా ప్రకటన మాత్రమే కాదు.. ఓ నైతిక బాధ్యత కూడా. యుద్ధ వ్యతిరేక సాహిత్య చారిత్రక, సాంస్కృతిక, సామాజిక పరిణామాలను విశ్లేషిస్తే, శాంతి స్థాపన కోసం రచయితలు పడిన తపన కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. చరిత్రలో యుద్ధ వ్యతిరేక సాహిత్యం అనేది యుద్ధం పుట్టకముందు నుంచే శాంతికి వేదికగా నిలిచింది. పురాణాల్లోనూ, శతకాల్లోనూ శాంతిని ప్రధానం చేసిన రచనలు కనిపిస్తాయి. పాశ్చాత్య సాహిత్యంలో లియో టోలిస్టాయ్ రచించిన 'వార్ అండ్ పీస్' ఒక గొప్ప ఉదాహరణ. ఈ నవలలో రష్యన్ సామాజిక స్థితిగతులు, యుద్ధవ్యతిరేక భావనలు స్పష్టంగా కనిపిస్తాయి. అదే విధంగా, ఎర్నెస్ట్ హెమింగ్వే రాసిన 'ఎ ఫేర్‌వెల్ టు ఆర్మ్స్' లాంటి రచ




నల్లో యుద్ధపు నీచ స్వభావం, మానవ సంబంధాల మీద దాని ప్రభావాన్ని వివరిస్తారు. తన 'డల్స్ ఎట్ డెకోరమ్ ఎస్ట్' కవితలో గ్యాస్ దాడిలో ప్రాణాలు కోల్పోతున్న సైనికుని ఉదంతాన్ని విల్ఫ్రెడ్ ఓవెన్ వర్ణించారు. ఆ దృశ్యం ఎంత బాధతో కూడుకున్నదో వివరిస్తూ, శాంతి స్థాపన అవసరాన్ని చెప్పకనే చెప్పారు. ఇది యుద్ధ గర్వాన్ని ప్రశ్నించే గాథ. అదే విధంగా, రాండాల్ జారెల్ రాసిన 'ది డెత్ ఆఫ్ ది బాల్ ట్యూరెట్ గన్నర్' కవిత యుద్ధపు క్రూరతను కేవలం అయిదు పంక్తుల్లో వ్యక్తపరిచిన శక్తిమంతమైన ఉదాహరణ.రెండవ ప్రపంచ యుద్ధానంతర సాహిత్యంరెండవ ప్రపంచ యుద్ధం అనంతరం సాహిత్యం పూర్తిగా మారిపోయింది. హోలోకాస్ట్ అనుభవాలపై వచ్చిన రచనలు సర్వజన మానవతావాదంపై దృష్టిని కేంద్రీకరించాయి. ఎలీ విజెల్ రచించిన 'నైట్' అనే హృదయవిదారక నవల ఒక యూదుడిగా అతను అనుభవించిన బాధను ప్రపంచానికి తెలియజేసింది. ఇది యుద్ధానికి వ్యతిరేకంగా అక్షరాలా ఏడుస్తూ, ప్రపంచ నైతికతను మేల్కొలిపే ప్రయత్నం. జపాన్ లో హిరోషిమా, నాగసాకి బాంబుల ప్రభావంపై వచ్చిన రచనలు కూడా ఇలాంటివే. ఉదాహరణకు, సాదాకో, వెయ్యి కాగితపు సారసాల కథ.. వంటి రచనలు యుద్ధపు వికృతరూపాన్ని పిల్లల దృష్టితో చూపించి శాంతికి పునాదులు వేసే ప్రయత్నం చేశాయి. ఇటో సేయ్ రాసిన 'బ్లాక్ రైన్' నవల, మసుజి ఇబుయే రచనగా, అణు బాంబు ప్రభావాన్ని అద్భుతంగా ప్రతిబింబిస్తుంది. అలాగే, కురోనో నారా వంటి రచయితలు జపాన్‌లో యుద్ధానంతర జీవనాన్ని తీవ్రంగా అక్షరాలలో బిగించారు. ఇవి అంతర్జాతీయంగా పాఠకులను మానవ విలువలపై మళ్లీ ఆలోచించాల్సిన అవసరాన్ని గుర్తుచేశాయి. భారతీయ సాహిత్యంలో యుద్ధ వ్యతిరేక భావనలు కనిపిస్తాయి. గాంధీ తత్వాలు యుద్ధ వ్యతిరేక భావనకు మార్గదర్శకం. గాంధీజీ తన రచనల ద్వారా 'అహింసా పరమో ధర్మః' అనే సందేశాన్ని పలు రూపాలలో చెప్పారు. ఆయన రచనలు యుద్ధం పట్ల తిరస్కారాన్ని సున్నితంగా, కాని గంభీరంగా వ్యక్తం చేశాయి. తెలుగు సాహిత్యంలో కూడా 1965, 1971 యుద్ధాల తర్వాత పలు రచనలు యుద్ధాన్ని వ్యతిరేకించాయి. ముఖ్యంగా సాహిత్య అకాడమీ అవార్డు పొందిన కవులు, కథా రచయితలు ఆ కాలంలో శాంతి సందేశంతో కూడిన రచనలకే ప్రాధాన్యత ఇచ్చారు. నైతిక, తాత్విక స్థాయిలో యుద్ధాన్ని ప్రశ్నించారు. వట్టికోట ఆళ్వారుస్వామి, జాషువా లాంటి రచయితలు సామాజిక న్యాయంతోపాటు శాంతి అవసరాన్ని కూడా తమ రచనలలో వ్యక్తం చేశారు. తమిళ రచయిత జే. మోహన్ రాసిన కథలు మరియు కురుంథొక్ వంటి రచనల్లో యుద్ధం వలన నష్టపోయే సామాన్యుల జీవితం ఏ విధంగా ఉంటుందో హృదయాలను కదిలించేలా వర్ణించబడింది. హిందీ సాహిత్యంలో అశోక్ వాజపేయి, కవితా సింహా వంటి రచయితలు యుద్ధం పట్ల తీవ్ర విమర్శాత్మక దృక్పథంతో రచనలు చేశారు. ఆధునిక కాలంలో యుద్ధ వ్యతిరేక సాహిత్యంప్రస్తుత కాలంలో, సోషల్ మీడియా, డిజిటల్ పబ్లిషింగ్ వేదికల ద్వారా యుద్ధ వ్యతిరేక సాహిత్యం మరింత వేగంగా వ్యాపిస్తోంది. పొద్దుతిరుగుతున్న ప్రపంచంలో మానవ హక్కుల కోసం పోరాడే రచయితలు, జర్నలిస్టులు, బ్లాగర్లు నేటి యుద్ధ వ్యతిరేక వేదికలు. ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి వేదికలపై వచ్చిన కవితలు, వీడియో ఎస్సేలు, డాక్యుమెంటరీలు కూడా సాహిత్యంగానే పరిగణించబడుతున్నాయి. పాలస్తీనాఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో నయా హషీమ్, మహ్మూద్ దర్వీష్ వంటి అరబ్ కవుల కవిత్వం అంతర్జాతీయంగా ప్రసిద్ధి పొందింది. అలాగే ఉక్రెయిన్ రచయిత సెర్గీ జాడాన్ యుద్ధంతో చుట్టుముట్టిన జీవితాలను వర్ణిస్తూ యూరప్ మానవతా వేదికలపై ప్రసిద్ధి చెందారు. ఇటీవలి కాలంలో, న్యూయార్క్ టైమ్స్, గార్డియన్ పత్రికలలో ప్రచురితమయ్యే రచనలు కూడా యుద్ధ వ్యతిరేక వేదికలుగా నిలుస్తున్నాయి. 'పిఇఎన్ ఇంటర్నేషనల్' వంటి సంస్థలు సాహిత్య స్వేచ్ఛకు మద్దతుగా, యుద్ధాలపై స్పందించే రచయితలకు వేదికలు కల్పిస్తున్నాయి. యుద్ధ వ్యతిరేక రచనల సామాజిక ప్రభావంఈ తరహా రచనలు శాంతికి మార్గం వేస్తాయి. విద్యార్థుల్లో, యువతలో చైతన్యం పెంచుతాయి. యుద్ధం అనేది ఒక సమూహా నాశనం మాత్రమే కాకుండా, వ్యక్తిగతంగా మనస్సును ఎలా ముక్కలు చేస్తుందో ఈ రచనలు తెలియజేస్తాయి. విఖ్యాత రచయిత అర్చర్ బట్లర్ హాల్ పేర్కొన్నట్లు, మనిషి వేదనలో ముంచి రాసిన అక్షరాలు ఎప్పుడూ కత్తి కంటే బలంగా హృదయాల్లో నాటుకుంటాయి. సాహిత్యం గుండెను తాకే శక్తి కలిగి ఉండటం వలన, యుద్ధం మీద సంభావ్య స్పందనలు వ్యక్తులలో మార్పును తీసుకురాగలవు. అందుకే, యుద్ధ వ్యతిరేక రచనలు అవసరం. అలాంటి సాహిత్యం మనసును మేల్కొలిపే అక్షర యుద్ధం. ఇది మారణాయుధాలతో పోరాడే పని కాదు.. మార్గదర్శకంగా మారే కళ. రచయిత చేతిలో కలం శక్తివంతమైన ఆయుధం. అది కాలం మించిన శక్తి. యుద్ధాన్ని ఆపలేకపోయినా, శాంతికి బీజం వేయగలదు. ఈ రోజుల్లో, శాంతి గురించి మాట్లాడే ప్రతి కలం ఒక దీపంలాంటిది. అలాంటి కలాల వెలుగులు, ఈ అంధకార యుద్ధ ప్రబల ప్రపంచంలో మార్గదర్శకంగా నిలుస్తాయి. అందుకే యుద్ధాన్ని వ్యతిరేకించే రచనలు అవసరం. ఇవే మానవతకి తిరిగి అర్థం చెప్పగల మార్గాలు.

– సత్య శ్రీ

## 'అదివాస్తవికత'కు చిరునామా నారాయణబాబు

మే 17న జయంతి




తెలుగు సాహిత్యంలో సర్రియలిజం లేదా అధివాస్తవికతను పరిచయం చేసిన ప్రముఖ కవిశ్రీరంగం నారాయణబాబు (మే 17, 1906 అక్టోబర్ 2, 1961). విజయనగరంలో, 1906, మే 17వ తేదీన జన్మించిన ఆయన ఆజన్మ బ్రహ్మచారిగా జీవితం గడిపారు. నారాయణబాబు పద్య రచనలకు, భావ కవిత్వానికి భిన్నంగా కొంతమందితో కలసి సర్రియలిజం అనే విదేశీయ ప్రక్రియను అనుసరించి రచనలు చేశారు. ఒక యదార్థ రూపాన్ని కవితలోనో, చిత్రలేఖనంలోనో చూపించినపుడు, ఆ విషయం యొక్క మూల స్వరూపాన్ని వివిధ విపరీత పరిస్థితులలో వర్ణించి మరువలేని చిత్రంగా ప్రదర్శించడాన్ని 'సర్రియలిజం' అంటారు. దీనిని 'అధివాస్తవికత' అని కొందరు అంటే, 'అతి వాస్తవికత' అంటే బాగుంటుందని మరికొందరు పేర్కొంటారు. 'మార్చ్', 'విశాఖపట్నం', 'ఫిడేలు', 'నాయుడుగారి వేళ్ళు', 'గడ్డిపరక', 'గేదెపెయ్యె', 'తెనుగురాత్రి', 'రుధిరజ్యోతి', 'కపాలమోక్షం', 'కిటికీలో దీపం', 'ఊరవతల', 'పండగనాడు', 'మౌన శంఖం', 'సంపంగి తోట' వంటి ప్రసిద్ధ రచనలు చేశారు. వీటిలో 'రుధిరజ్యోతి'ని మహాకవి శ్రీశ్రీకి అంకితమిచ్చారు. నారాయణ బాబు రచనలు ఆయనను విభిన్న ధోరణుల రచయితగా, ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న కవిగా నిలబెట్టాయి. 20వ శతాబ్దపు తొలి భాగంలో తెలుగు కవిత్వాన్ని ఆధునిక దిశగా నడిపించిన మహావ్యక్తుల్లో ఆయన ఒకరు. స్వతంత్ర భావధోరణి, హృదయాన్ని హత్తుకునే శైలీ, సామాజిక స్పందనతో కూడిన రచనలు ఆయన సాహిత్యంలో కనిపిస్తాయి. నారాయణబాబు 1903లో ప్రకాశం జిల్లాలోని ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. బాల్యంలోనే సాహిత్యంతో ఆసక్తి పెంపొందింది. ఆయనకు ఆంగ్ల భాషపై మంచి పట్టు ఉండటం వల్ల పాశ్చాత్య సాహిత్యాన్ని చదివే అవకాశం లభించింది. రవీంద్రనాథ్ టాగూర్, పిబి షెల్లీ, జాన్ కీట్స్, ఆస్కార్ వైల్డ్ వంటి కవుల ప్రభావం ఆయన మీద కనిపిస్తుంది. అయితే, ఆ ప్రభావాన్ని మూలన పెట్టి తనదైన శైలిని నెలకొల్పడం లో ఆయన ప్రత్యేకత ఉంది. నారాయణబాబు కవిత్వంలో ఆధునికత, సామాజిక చైతన్యం, స్నేహతత్వ భావాలు, భావగంభీరత, సౌందర్యశాస్త్రపు స్ఫూర్తి స్పష్టంగా కనిపిస్తాయి. ఆయన కవిత్వం మానవతావాదానికి ప్రతీకగా నిలిచింది. అభ్యుదయ భావాలు, స్వేచ్ఛాప్రధానమైన వ్యక్తీకరణ ఆయన రచనల్లో ముఖ్యాంశంగా దర్శనమిస్తుంది. బహుశా, ఇది తెలుగు కవిత్వాన్ని పాశ్చాత్య సాహిత్యంతో కలిపే ప్రయత్నంగా భావించవచ్చు. ప్రేమ, స్నేహం, ప్రకృతి, పరవశత వంటి భావాలు ఆయన కవితల్లో ఉదాత్తంగా వ్యక్తమయ్యాయి. భావం ఏదైనా గాఢతతో, హృదయాన్ని తాకేలా ఉంటుంది. ఆయన పద్య రూపంలో కొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. పాశ్చాత్య కవిత్వంలోని 'ఫ్రీ వర్స్' ప్రభావం కలిగిన రీతిలో రచనలు చేసారు. ఆయన రచనల్లో మనిషి భావోద్వేగాలు, ప్రేమలోని పరవశత, జీవితంలోని విపరిణామాలు చాలా చక్కగా వ్యక్తమవుతాయి. నారాయణబాబు రచనలు తదుపరి కవులపై తీవ్రమైన ప్రభావం చూపాయి. ముఖ్యంగా 1940ల తర్వాత తెలుగు సాహిత్యంలో వచ్చిన మార్పుకు పునాదులు వేసిన వారిలో ఆయన ఒకరు. నిగూఢ భావనల్ని సరళంగా చెప్పగలగడం ఆయన ప్రత్యేకత. నారాయణబాబు కవిత్వంపై సాహిత్య విమర్శకులు విస్తృతంగా అధ్యయనం చేశారు. 'తెలుగు కవిత్వానికి ఒక కొత్త ఊపిరి' అని పలువురు విమర్శకులు ప్రశంసించారు. అనేక యూనివర్సిటీల్లో ఆయన రచనలు అధ్యయనపాఠ్యంగా ఉన్నాయి. నారాయణబాబు కవిత్వం తెలుగు సాహిత్యంలో ఒక మలుపు. భావ ప్రకటనలో స్వేచ్ఛ, భాషలో నయగర్భితత, భావనలలో ఆదునికత కలగలిసిన ఆయన రచనలు నేటికీ పాఠకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. నారాయణబాబు తెలుగు కవిత్వాన్ని కొత్త ఎత్తులకు తీసుకెళ్లిన మార్గదర్శకుల్లో అగ్రగణ్యుడు.ఈ వ్యాసాన్ని మీరు వ్యాసరూపంగా పాఠశాల, కళాశాల ప్రాజెక్టుల కోసం ఉపయోగించవచ్చు. నారాయణబాబు పూర్తిపేరు శ్రీరంగం నారాయణస్వామిబాబు. బాల్యంలోనే మృదువైన స్వభావం, కలలకైనా కలల దృష్టి, రచనాపట్ల ఆకర్షణ మొదలయ్యాయి. చిన్నతనం నుంచి నారాయణబాబు సంప్రదాయ ధోరణులను నిలదీసేవారు. తర్వాతి కాలంలో ఈ స్వభావమే ఆయన విప్లవాత్మక కవిత్వానికి పునాదిగా నిలిచింది. నారాయణబాబు ఎదిగిన కాలం బ్రిటిష్ వలస పాలనలో గడిచింది. భారతదేశంలో స్వాతంత్ర్య చైతన్యం ఉదయించింది. ఉద్యమాలు, నిరసనలు, అహింసా భావం వంటి అంశాలు ఆయనను ప్రభావితం చేశాయి. అయితే ఆయన పూర్తిగా రాజకీయంగా కాక, సాహిత్య ద్వారా చైతన్యాన్ని అందించాలనుకున్నారు. తన ఆలోచనలకు కట్టుబడ్డారు.

## తప్పక చదవాల్సిన పుస్తకం

## వేదకాలానికి అక్షర రూపం రుగ్వేద ఆర్యులు

హిందీ యాత్రాసాహిత్య పితామహుడు, బహుభాషావేత్త, తాత్వికుడు, మార్క్సిస్టు మేధావి, ప్రఖ్యాత చరిత్రకారుడు, రచయిత, యాత్రికుడు రాహుల్ సాంకృత్యాయన్ రచనల్లో ఒకటి 'రుగ్వేద ఆర్యులు'. చారిత్రకభౌతికవాదానికి ఇది నిలువటద్దం. దీనిని కేవలం సాధారణ ఆధ్యాత్మిక లేదా ధార్మిక గ్రంథంగా చూడడానికి వీల్లేదు. రుగ్వేదంలోని శ్లోకాలను ఆధారంగా చేసుకొని చారిత్రక విశ్లేషణ చేస్తుంది. రచయిత మార్క్సిసు భావజాలం ఉన్న వ్యక్తి కాబట్టి, ఆర్థిక వ్యవస్థ, సామాజిక సమీకరణాలు పై ఎక్కువ దృష్టి ఉంటుంది. రుగ్వేద యుగపు ఆర్యుల జీవన విధానం, చారిత్రక, సామాజిక, తాత్విక విశ్లేషణగా ఈ పుస్తకాన్ని పేర్కోవచ్చు. భారతీయ పురావస్తు చరిత్ర, ఆధ్యాత్మికత, సామాజిక నిర్మాణాలపై భౌతికవాద దృక్పథంతో రచయిత దీనిని హృద్యందంగా మలిచారు. సామాన్యులకు అర్థమయ్యే రీతిలో సులభమైన భాషను ఉపయోగించారు. తెలుగు అనువాదం కూడా కూడా అదే స్థాయిలో ఉంటుంది. ఈ పుస్తకం, భారతదేశంలో ప్రారంభకాలపు ఆర్యుల చరిత్రను వేదాల ఆధారంగా విశ్లేషించే ఒక అద్భుత గ్రంథం. ఇది వేద సాహిత్యాన్ని చారిత్రక దృష్టికోణంతో పరిశీలించి, అప్పటి సమాజాన్ని, ఆర్థిక పరిస్థితిని, రాజకీయ వ్యవస్థను, సాంస్కృతిక నిర్మాణాన్ని వెల్లడించే ప్రయత్నం. ఇది కేవలం భక్తి రసంతో కరగని వేదాలలోని సామాజిక వాస్తవాలను వెలికి తీయడమే కాకుండా, ఆర్యుల వలసల, వర్ణవ్యవస్థ ఆధారాలను వెలికితీసే ప్రయత్నంగా కూడా చెప్పవచ్చు. 'రుగ్వేద ఆర్యులు' పుస్తకంలో రాహుల్ సాంకృత్యాయన్ వేదాలను భక్తిపరంగా కాక, చారిత్రక, సమాజ శాస్త్ర, ఆర్థిక దృష్టితో విశ్లేషించారు. రుగ్వేదంలోని సూక్తులను ఆధారంగా తీసుకొని, అప్పటి కాలపు ఆర్యుల జీవన విధానం, వారి ఆచారాలు, రాజకీయం, ఆర్థిక వ్యవస్థ, శ్రమ విభజన వంటి అంశాలను విశ్లేషించారు. ఆయన పరిశీలనలో మార్క్సిస్ట్ సిద్ధాంతాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ పుస్తకం వేదకాలం నాటి ఆర్యుల మూలాల అన్వేషణ,వారి సామాజిక, ఆర్థిక నిర్మాణం విశ్లేషణ, భారతదేశ చరిత్రలో వారి పాత్ర అనే మూడు ప్రధాన అంశాలపై దృష్టి సారిస్తుంది. రాహుల్ సాంకృత్యాయన్ రచనశైలిలో స్పష్టత, ఉదాహరణలు, పరిశోధనా దృక్పథం, భావనల్లో పారదర్శకత కనిపిస్తాయి. ఆయన వేదాలు అర్థం చేసుకోవడంలో సాంప్రదాయ భాష్యకారులకే కాక, ఆధునిక పాశ్చాత్య పరిశోధకుల దృష్టికోణాన్నీ కలగలిపారు. అయితే, ఆయన వివరణలు అంచనాలతో కాకుండా ఆధారాలతో నడవడమే ఈ పుస్తకానికి విశ్వసనీయతను కలిగించింది. సాంకృత్యాయన్ రచనలో ముఖ్యాంశంగా కనిపించే అంశంఆర్యులు భారత్‌కి వలస వచ్చినవారన్న సిద్ధాంతం. ఆయన వేదాల్లోని భాష, వర్ణనలు, భౌగోళిక సూచనలను అధ్యయనం చేసి ఆర్యుల వలస సిద్ధాంతాన్ని సమర్థించారు. ఆయన ప్రకారం, ఆర్యులు మధ్య ఆసియా ప్రాంతం నుంచి భారతదేశంలోకి ప్రవేశించారు. వేద కాలంలో వర్ణవ్యవస్థ ప్రారంభ దశలో ఉందని, అయితే అది అప్పటి శ్రమ విభజనకు సంబంధించినదిగా వర్ణించారు. కాలక్రమేణ వర్ణవ్యవస్థ కఠినమై, ఆర్థిక, సామాజిక అసమానతలకు దారి తీసిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్యులు మూలంగా వ్యవసాయ వ్యవస్థను విస్తరించినప్పటికీ, పెద్దఎత్తున పశుపోషణ, దండయాత్రల ద్వారా సంపత్తి సంపాదన వృద్ధి చేశారని పుస్తకంలో వివరించారు. ఆయన వేదాలలోని ఆస్తి, సంపద, బలాత్కార యుద్ధాలు వంటి అంశాల ద్వారా ఆర్థిక శోషణ తత్వాన్ని వెలికితీశారు. వేదాల్లో మహిళల పాత్రపై చర్చిస్తూ, ఆ ప్రాథమిక సమాజంలో కొంత స్వేచ్ఛ ఉన్నా, అది పురుషాధిపత్య వ్యవస్థలో క్రమంగా కోల్పోయిందని ఆయన విశ్లేషించారు. సాంకృత్యాయన్ రచనలపై కార్ల్ మార్క్స్ సిద్ధాంతం తీవ్ర ప్రభావం కనిపిస్తుంది. రుగ్వేద ఆర్యులు పుస్తకంలో ఆయన వేదకాలిన సమాజాన్ని భౌతికవాద దృష్టితో విశ్లేషించారు. వర్గ పోరాటం, ఆర్థిక అసమానత, శ్రమ విభజన, అధికార కలపాటు వంటి అంశాలను వేదాలలో కనిపించే ఉదాహరణల ద్వారా ప్రదర్శించారు. ఇందులో విశ్లేషణాత్మక విశేషాలు కూడా ఉన్నాయి. వేదాల్లోని సహస్రసంఖ్యక దేవతలు, రితువులు, త్యాగాలు మొదలైన వాటిని ఆధ్యాత్మికంగా కాకుండా, సామాజిక ఆచారాల ప్రతీకలుగా ఆయన వివరించారు. పూర్వీకుల పట్ల భయభక్తి కలగాలనే ప్రయత్నంగా త్యాగ క్రమాలను చిత్రీకరించారు. వేదాలు ఆర్యుల విశ్వదృక్కోణం, వారి భూమి పట్ల ఆకాంక్ష, ఇతర జనజాతులపై వారి అగ్రహం వంటి విషయాలను చాటుతున్నాయని వివరించారు. ఈ పుస్తకానికి వ్యతిరేకంగా కొన్ని వర్గాలు విమర్శలు చేస్తారని తెలిసినా ఆయన వెనుకంజ వేయలేదు. వేదాలను పవిత్రమైన ధర్మగ్రంథాలుగా భావించే హిందూ సంప్రదాయవాదులు దీనిని శత్రుత్వ దృష్టితో చూసినప్పటికీ చలించలేదు. ఆర్యవాద దృక్పథాన్ని విస్మరించి, ద్రవిడ జాతుల స్థితిని స్పష్టంగా చర్చించలేదన్న విమర్శలు కూడా లేకపోలేదు. మార్క్సిస్టు భావజాలం ఆయన రచనలను ప్రభావితం చేసిందని, కొన్నిచోట్ల అర్థవంతమైన దృక్పథానికి లోటు వచ్చిందన్న అభిప్రాయాలు ఉన్నాయి. అయితే, ఈ విమర్శలు ఉన్నా, చారిత్రక పరిశోధనకు పునాది వేసిన రచనగా ఇది నిలిచింది. సాంకృత్యాయన్ రచించిన 'రుగ్వేద ఆర్యులు' పుస్తకం భారత చరిత్ర పరిశోధనకు కొత్త దిశను చూపింది. వేదాలను కేవలం ధార్మిక గ్రంథాలుగా కాకుండా, సామాజిక, ఆర్థిక, భౌతిక జీవితాన్ని ప్రతిబింబించే ఆధారాలుగా చూడాలన్న దృష్టిని ఇచ్చింది. ఇది భారతీయ చరిత్ర అధ్యయనానికి ఒక మార్గదర్శిగా మారింది. నేటి సూత్రాల పరంగా పుస్తక ప్రాముఖ్యతఈ గ్రంథాన్ని ఆధునిక భారత చరిత్రకారులు, సమాజ శాస్త్రవేత్తలు ఇప్పటికీ ప్రామాణిక గ్రంథంగా పరిగణిస్తున్నారు. ప్రాచీన భారత సమాజాన్ని అధ్యయనం చేయాలనుకునే పరిశోధకులకు ఇది ఒక ముఖ్యమైన గ్రంథంగా మారింది. ఇది ఉపన్యాసాలలో, యూనివర్సిటీలలో చారిత్రక విశ్లేషణలలో ప్రస్తావించే గ్రంథమైంది. ఈ పుసతకం సాంకృత్యాయన్ చారిత్రక దృష్టి, పరిశోధనా నైపుణ్యం, మార్క్సిస్టు ఆలోచనా విధానానికి ప్రతిరూపం. ఇది వేదాల్ని నూతన రీతిలో చూసే కళ్ళజోడుగా పనిచేసింది. హిందీ భాషలో రచించిన ఈ గ్రంథాన్ని అనేక భారతీయ భాషల్లోకి అనువదించారు. ఇది కేవలం పాఠ్యగ్రంథంగా కాకుండా, చారిత్రక దృష్టిని ప్రసారించే గొప్ప ప్రయత్నంగా నిలిచింది. సూక్ష్మంగా చెప్పాలంటే, 'రుగ్వేద ఆర్యులు' ఒక జ్ఞానపరమైన విప్లవాత్మక గ్రంథం. ఇది భారతదేశ పురాతన చరిత్రను రుగ్వేద శ్లోకాల ఆధారంగా, మార్క్సిస్టు దృష్టితో విశ్లేషించే అరుదైన రచన. వేదాలను తత్వాలుగా కాకుండా చారిత్రక పాఠ్యాంశాలుగా చూడాలనుకునే వారికి ఇది తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకం.







మానవ చరిత్ర అభివృద్ధి అనేది సహజమైన పరిణామం. సమాజ మార్పులు క్రమంగా, వనరుల పరిమితి, వాతావరణం ఆధారంగా జరిగాయి. మత వ్యవస్థలు, సామాజిక నిర్మాణాలు మానవుని అవసరాల ప్రకారం రూపుదిద్దుకున్నాయి. మార్పు అనేది మానవ చరిత్రకు మూర్తిమత్వం. అయితే, రుగ్వేద కాలంలో తాత్వికతగానీ, మత విధానాలుగానీ లేవు. ఆ కాలంలో కేవలం సామాజిక కట్టుబాట్లు, పనుల విభజన మాత్రమే ఉండేవి. వేదం అనగానే పురాణాలకు లేదా దేవతలకు సంబంధించిన అంశంగా చాలా మంది అనుకుంటారు. అయితే, రుగ్వేద ఆర్యులు పుస్తకం చదివిన ప్రతి ఒక్కరూ చరిత్రను కొత్త దృక్కోణంలో చూడగలుగుతారు. ఈ రచన మనిషి ప్రయాణాన్ని అత్యంత హృద్యంగా చూపిస్తుంది. వాస్తవానికి, ఈ గ్రంథం మానవ వికాసం మీద ఒక విలువైన పాఠం. ఈ పుస్తకం చదవడం ఓ అపూర్వమైన ప్రయాణం. రుగ్వేద కాలాన్ని, జీవన విధానాన్ని ఈ పుసతకంప్రతిబింబిస్తుంది. రాహుల్ సంకృత్యాయన్ రచనా శైలి ఎంతో సహజమైనది. వలసలు, యుద్ధాలు, మతమార్పులు, ఆర్థిక మార్పులు వంటి సహజమైన పరిణామాలని ఆయన తన రచనల్లో చూపించారు. రచనల్లో కేవలం రాజులు, సామ్రాజ్యాల చరిత్ర కాకుండా, సామాన్య మానవుడి జీవన యాత్రను పట్టించుకున్నారు. అందుకే 'ఓల్గ నుంచి గంగకు' మాదిరిగానే రుగ్వేద ఆర్యులు కూడా ఒక ప్రత్యేక దృశ్యకావ్యాన్ని కళ్ల ముందు ఆవిష్కరిస్తుంది. ఇందులోని ప్రతి భాగం ఆనాటి సమాజపు ప్రతిబింబంగా గోచరిస్తుంది. మన ఆధునిక జీవితానికి మూలం ఏమిటో, మనం ఎలా ఈ స్థాయికి వచ్చామో ఈ పుస్తకం ద్వారా స్పష్టంగా అర్థమవుతుంది.ఇది కేవలం చరిత్ర కాదు.. అది మన చిత్తచైతన్యపు గమనం కూడా.

**పుస్తకం పేరు: రుగ్వేద ఆర్యులు**

రచన: రాహుల్ సంకృత్యాయన్
తెలుగు సేత: చాగంటి తులసి
ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్
12-1-493/VA,
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
జిఎస్ఐ పోస్ట్,
హైదరాబాద్: 040 29884453/ 54.

## ఈ వారం కవితలు

## కామ్రేడ్ పశ్య కన్నమ్మకు జోహార్లు



సాయుధ పోరాట చరితలో
వీరవనితవు పశ్య కన్నమ్మ...
అందుకో జోహార్లు.... మాయమ్మ
ధీరవనిత పశ్య కన్నమ్మ..
అందుకో జోహార్లు మాయమ్మ....

॥ అందుకో ॥

అన్న శంబిరెడ్డి ఆశయ స్ఫూర్తితో
ఆంధ్ర మహాసభకు కదలి వెళ్ళినావు
ఉద్యమ నేత పశ్య రాంరెడ్డి
గుండె చప్పుడై గుభాలించావు
జంట పక్షులు లాగా పోరాట దారిలో
శత్రు దాడులను తిప్పి కొట్టినారు
ఎర్రజెండా.. పరిమళం ..నీవమ్మా
అందుకో జోహార్లు ..కన్నమ్మ

॥ అందుకో ॥

కష్టాల దారిలో కమ్యూనిస్టు జండెత్తి
పేదోళ్ల కష్టాల కడతేర్చకదిలావు
దుక్కి దున్నేటప్పుడు
నాటు వేసేటప్పుడు
పొలమంతా కోసి కుప్పపెట్టేటప్పుడు
కుప్పనూర్చేటప్పుడు చాటకొట్టేటప్పుడు
కళ్ళెంలో ధాన్యాన్ని ఇల్లు చేర్చేటప్పుడు
మహిళలు పడుతున్న బాధలను చూసావు
మహిళా సంఘం పెట్టి బతుకంతా నడిచావు
కడదాకా కమ్యూనిస్టు జెండయ్యి బతికావు

॥ అందుకో ॥

విభేదాలు వచ్చి పార్టీ చీలినప్పుడు
సిపిఐ జెండా ఎత్తిపట్టినావు
భారత జాతీయ మహిళా సమాఖ్య
నాయకురాలిగా పోరాడి గెలిచావు
పేదలకు ఇండ్లు పెన్షన్లు ఇవ్వాలని

సొంత కాళ్ల మీద మహిళ బతకాలని
కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రం
మహిళా మండలి భవనాన్ని కట్టావు
ఆదర్శ నేతవు నీవమ్మా....
కామ్రేడ్ పశ్య కన్నమ్మ.

॥ అందుకో ॥

సాయుధ పోరాట వీరులేసిన బాట
ఎర్ర ఎర్ర జెండాలు విరబూసిన తోట
తెలంగాణ మాగాణం తెగువ చూపిన తూట
మట్టి మనుషుల జేరి తట్టి లేపిన పాట
పేదోళ్ల ఇండ్లలో ఎగిరేటి బావుటా
ఆ బాటలో... పాటలో .... నీవమ్మా
నిన్ను మర్చిపోము మేము కన్నమ్మ
అందుకో జోహార్లు.... మాయమ్మ
వీర వనిత .... పశ్య కన్నమ్మ
రైతు నేత పశ్య కన్నమ్మ
'అందుకో' జోహార్లు మాయమ్మ
మహిళా సంఘం నేత.. కన్నమ్మ
అందుకో జోహార్లు మాయమ్మ
సాహసాల చరిత నీవమ్మా
కమ్యూనిస్టు నేత కన్నమ్మ
జోహార్లు జోహార్లు నీకమ్మ
కామ్రేడ్ పశ్య కన్నమ్మ....

(తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు పశ్య కన్నమ్మ సంతాప సందర్భంగా ఆమెకు నివాళి అర్పిస్తూ...)

కె.వి.ఎల్., 9490952649

## జయహో సైనికా



పహల్గాం రక్త చరిత్ర
రాస్తున్నది మరోచరిత
ముచ్చటినే ఓపిక లేదిక
సహనం లేచింది
శాంతం ఉరిమింది

ఈ నేలలేచిన భుగభుగలు గగనతలంలో,
శత్రుతలాపున అగ్ని విస్ఫోటనం...
ఊళలేసె నక్కలఊపిరాగింది అక్కడ
క్కడ నక్కి ఉన్న నక్కలూ ఇక ఖతమే !
ఉగ్రసంహారం విజయారంభం
వీరజవాన్ నీకు వందనం

అస్తమించని సరిహద్దుల పొద్దులు
జాతి గుండె చప్పుడు మీరే
వీరపుత్రులారా!
హద్దేలేని మీత్యాగాలకు ఏమివ్వగలం..
ఉప్పొంగుతున్న హృదయంతో, గళమెత్తి నినదిస్తామంతే
జయహో భారత్

జయహో వీరజవాన్
హెచ్చిన మతోన్మాద
పైశాచిక పయనంలో
పుట్టలు పుట్టలుగా స్థావరాలు..
పాలు పోసి పెంచిన కోరల్లో
చిక్కుకొని వదరుతున్నవ్
మతి గతి తప్పి పౌర ప్రయోజనాలు
గాలికొదిలిన పాకిస్తాన్

సహకార దేశాల మంత్రాంగంలో
యంత్రాంగంలో మర బొమ్మవై
ప్రాణాలే పెట్టుబడిగా ఆయుధాలే
అవసరాలుగా బతుకుతున్నవు

ఇంత జరిగినా పంతమా!
కయ్యానికి కాలుదువ్వుతూ
తెగబడుతున్నావా ?
త్రివిధ దళాల ఉగ్రరూపం
త్రినేత్రం.. ఉప్పొంగిన
సింధుతరంగం..
మా కరుణ ధారలు
అగ్నిదారాలుగా మారి
మసికాకముందే మేలుకో..

మాశాంతం శిఖరాగ్రమే!
అహింసా మాధర్మమే! లంఘించి
దూకితే మాత్రం
ఏ దిక్కు దౌడు తీసిన దిక్కుండదు
మిగిలేవి శిథిలశకలాలే
'ధర్మహింసా తదైవచ'
యాదుంచుకో... ! యాజ్జేసుకో...!!

గడ్డం సులోచన
7702891559



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## 'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతోంది

### ఇచ్చిన పనిని పర్‌ఫెక్ట్‌గా పూర్తి చేశాం : ఐఎఎఫ్




**న్యూఢిల్లీ :** భారత్–పాకిస్థాన్ ఉద్రిక్తతల వేళ భారత వాయుసేన కీలక ప్రకటన చేసింది. 'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతోందని వెల్లడించింది. దీనిలో భాగంగా తమకు అప్పగించిన పనులను అద్భుత నైపుణ్యాలతో అత్యంత కచ్చితత్వంతో పూర్తి చేసినట్లు తెలిపింది. ఈ మేరకు ఎక్స్‌లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఓ పోస్ట్ పెట్టింది. ఆపరేషన్స్ ఇంకా కొనసాగుతున్నందున తర్వాత అధికారికంగా వివరాలు వెల్లడిస్తామని పేర్కొంది. అప్పటి వరకు తప్పుడు సమాచారానికి దూరంగా ఉండాలని వాయుసేన విజ్ఞప్తి చేసింది. జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఏప్రిల్ 22న ఉగ్రవాదులు పాశవికంగా పర్యటకులపై కాల్పులు తెగబడి 26మంది పొట్టనపెట్టుకున్నారు. దీంతో దేశం మొత్తం ఆగ్రహంతో రగిలిపోయింది. దీంతో భారత సైన్యం మే 6, 7 రాత్రి పాక్, పిఒకెలోని 9 ఉగ్రవాద శిబిరాలపై మెరుపుదాడులు చేసి ప్రతీకారం తీర్చుకుంది. ఆ తర్వాత పాకిస్థాన్ భారత సరిహద్దు ప్రాంతాలు లక్ష్యంగా కాల్పులకు దిగింది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరాయి.

# శ్రమజీవుల ఆశాజ్యోతి పశ్యకన్నమ్మ


పశ్య పద్మ

స్వాతంత్ర సమరయోధురాలు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు పశ్యకన్న మ్మ ఇటీవల తుది శ్వాస విడిచారు. 97 సంవత్సరా ల పరిపూర్ణమైన జీవితంలో ఆమె నిర్వహించిన పాత్ర ఘనమైనది. చరిత్రాత్మకమైనది. అతి చిన్న వయసులోనే అనేక ప్రభావాలకు, ఒత్తిడులకు గురైంది .

భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ రద్దుకై, ఫ్యూడల్ జమీందారీ,జాగీర్దారీ విధానం రద్దుకై , నిరంకుశ నిజాం పాలనను అంతమొందించడానికి సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్నారు. సాంఘిక ఆర్థిక జీవితంలో ప్రజలు అడ్డు అదుపు లేకుండా సాగుతున్న ఫ్యూడల్ దోపిడీకి బలవుతున్న పరిస్థితుల పట్ల తీవ్రంగా ఆందోళనకు గురయింది .మహిళలపై అత్యాచారాలు, సామూహిక మానభంగాలు చిత్రహింసలు కొనసాగిన రోజులలో నిజాం పోలీస్ అరెస్ట్ చేయడానికి ఇంటికి వస్తే మిద్దె పైకి వెళ్లి దూకి చనిపోవాలనుకుంది. పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి ఆ సాయంత్రం విడుదల చేయటంతో ఊపిరి పీల్చుకుంది .ముఖ్యంగా రైతులు జాగీరు ప్రాంతంలో నీటిపారుదల సౌకర్యం ఉన్న భూమిపై పన్ను అధికంగా ప్రభుత్వ ప్రాంతాలలో వసూలు చేసే దానికి పది రెట్లు ఎక్కువగా ఉండేది. పన్ను కట్టలేని రైతులను భూస్వాముల గుండాలు చిత్రవధకు గురిచేసి చివరకు రైతుల నుండి జమీందారులు భూమిని లాక్కునేవారు. వీటితోపాటు వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగిన పశ్య కన్నమ్మగారి పై అనేక ప్రభావాలు తెలంగాణ సాయుధ పోరాటం లో పాల్గొనటానికి పురి కోల్పోయి. మా తాతయ్య పశ్య లక్ష్మీ నరసింహారెడ్డి (మా అమ్మగారి మేనత్త భర్త)1941 వ సంవత్సరంలో చిలుకూరు లో జరిగిన 8 వ ఆంధ్ర మహాసభకు హాజరయ్యారు. ఊరి పెద్దమనిషి గా, ముఖ్యంగా వెట్టి చాకిరి చేసే హరిజనులు, రజకులతో ఇతర కష్టజీవులతో ఉన్న సంబంధాలే వారు 8 వ ఆంధ్ర మహాసభ కు హాజరు కావటానికి ప్రధాన కారణం. ఆ మహాసభ వివరాలను కుటుంబ సభ్యులందరికీ వివరించటం తో ఉత్తేజితులయ్యా రు. జమీందారులు, దేశముఖులకు వ్యతిరేకంగా ,వెట్టి చాకిరి కి వ్యతిరేకంగా ,అక్రమ నిర్బంధ వసూళ్లకు వ్యతిరేకంగా సాగుదారులను తమ భూముల నుండి బేదఖలు చేయడానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో 1944 ప్రారంభం నుండి సమరశీల పోరాటాలనేకం సాగుతున్నాయి.1944లో హుజూర్నగర్ తాలూకా ఆంధ్ర మహాసభ హుజూర్ నగర్ పట్టణంలో జరిగింది .దీనికి రావి నారాయణరెడ్డి హాజరయ్యారు. దీనితో యువకులలో ఉత్సాహపూరితమైన వాతావరణ ఏర్పడింది .1945 సంవత్సరంలో ఖమ్మం లో జరిగిన 12 వ ఆంధ్ర మహాసభకు దొంతి రెడ్డి శంబిరెడ్డి పశ్య కన్నమ్మ సోదరుడు దొంతి రెడ్డి శంబిరెడ్డి ప్రోత్సాహంతో పశ్యరాంరెడ్డి హాజరయ్యారు. అక్కడ చింతలపూడి రాములు కలిసారు. ఈ ముగ్గురు కలిసి హుజూర్నగర్ పట్టణంలో భారత కమ్యూనిస్టు పార్టీ శాఖ ను ఏర్పాటు చేశారు. పార్టీ సాహిత్యాన్ని ,పార్టీ వేసిన పలు కరపత్రాలను రహస్యంగా పంపిణీ చేసేవారు .ఇందులో భాగమే కన్నమ్మ పార్టీ సాహిత్యాన్ని గంపలో పెట్టుకుని ఆ పుస్తకాలపై జొన్నలు పోసి వాటిపై ఎరువు పోసి ఆ గంప ను పొలాల దగ్గరికి మొసుకొనివెళ్లి పార్టీ నాయకులకు అందించేవారు. కొన్ని సందర్భాలలో చేనులోనే పుస్తకాలను పాతిపెట్టి సమాచారాన్ని నాయకత్వానికి తెలియజేసేది.

1946వ సంవత్సరంలో లింగగిరి లో జరిగిన బహిరంగ సభకు పి.సి జోషి, పుచ్చలపల్లి సుందరయ్య హాజరయ్యారు. ఇది హుజూర్నగర్ ప్రాంత ప్రజలకు గొప్ప ప్రేరణ. 1946 సెప్టెంబర్ లో పార్టీ సభ్యుల సానుభూతి పరుల సమావేశాన్ని పశ్యకన్నమ్మ ఇంట్లో నిర్వహించారు. విసునూరు రామచంద్రారెడ్డి కిరాయి గుండాల చే హత్య గావింప బడిన దొడ్డి కొమరయ్య హత్యకు నిరసనగా 1946 అక్టోబరులో పెద్ద ప్రదర్శన హుజూర్నగర్ లో జరిగింది. ఈ ప్రదర్శనలో పాల్గొన్న వారిలో 30 మందిని అరెస్టు చేశారు .అందులో పశ్య లక్ష్మి నరసింహా రెడ్డి, , దొంతిరెడ్డి లక్ష్మీ నర్శింహారెడ్డి (కన్నమ్మ పెద్ద సోదరుడు) ఉన్నారు. 70 సంవత్సరాల మా తాత గారిని వారం రోజులు విడుదల చేసినా, ఎనిమిది నెలలకు పైగా కన్నమ్మ గారి సోదరుడు జైల్లో ఉన్నాడు. పశ్యరాంరెడ్డి, దొంతి రెడ్డి శంభిరెడ్డిలు ఇతర ముఖ్యులు అనేకమంది అరెస్టు కాకుండా తప్పించుకోగలిగారు.హుజూర్నగర్ తాలూకా మల్లారెడ్డిగూడెంలో 1946 డిసెంబర్‌లో జరిగిన కాల్పులు హుజూర్నగర్ తాలూకా ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. ఈ కాల్పులలో ముగ్గురు మహిళలు మొత్తం ఆరుగురు అక్కడికక్కడే నేలకు ఒరిగారు. అనేకమందిని అరెస్టు చేసి హైదరాబాద్ చంచల్ గూడ జైలుకు పంపారు. నైజాం పోలీసును ప్రతిఘటిస్తూ రాళ్ల వర్షం కురిపించిన ప్రజలు వెనుకకు వెళ్ళరన్న ఆలోచనతో కలెక్టరు, పోలీస్ మైకులో ముగ్గురు నలుగురు పెద్దలను మాట్లాడటానికి పంపవలసిందిగా విజ్ఞప్తి చేశారు. మాట్లాడటానికి వెళ్లిన వారిపై కాల్పులు జరిపి గ్రామ ప్రజలపై చిత్ర వధకు గురి చేశారు.



హుజూర్నగర్ కు దగ్గరలో ఉన్న మఠంపల్లి నుండి ధాన్యం 100 ఎడ్ల బండ్ల ల్లో హుజూర్నగర్ కు తరలిస్తున్న విషయం తెలిసి ఆ ధాన్యం రైతుల నుండి వసూలు చేసిన లేవీ ధాన్యం కాబట్టి ఆ బండ్లను అడ్డుకొని ప్రజలకు పంచాలని నిర్ణయించుకొని 1000 మందిని దొంతి రెడ్డి శంబిరెడ్డి,పశ్యరాంరెడ్డి, చింతలపూడి రాములు నాయకత్వంలో పార్టీ ప్రజలను సమీకరించారు. నిజాం పోలీస్ కాల్పులు జరిపింది. నాయకుల వద్ద ఒక తుపాకీ ఒక బాంబు మాత్రమే ఉండటం ఎక్కువ ఆయుధాలు లేకపోవటం వల్ల ప్లాన్ సక్సెస్ కాలేదు. 1948 ఫిబ్రవరి మొదటి వారంలో దొంతి రెడ్డి శంభిరెడ్డి రెడ్డి ఆచూకీ చెప్పమని పశ్య కన్నమ్మ తండ్రి కుటుంబం పై రజాకార్లు దాడి చేశారు. తండ్రి దొంతి రెడ్డి అంతి రెడ్డి తల పగలటం ,వెన్నులో బరిశెదిగటం జరిగింది. 25 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి జగ్గయ్యపేట హాస్పిటల్ లో తండ్రికి వైద్యం చేయిస్తున్న సమయంలోనే సోదరుడు దొంతి రెడ్డి శంభిరెడ్డి హుజూర్‌గర్ కు దగ్గరలో ఉన్న చింతలమ్మ గూడెం లో 1948 ఫిబ్రవరి 22వ తారీఖున నిజాం పోలీసులు ,రజాకార్లు ఎదురు కాల్పుల్లో చంపటం... ఈ ఘటన లన్నీ కన్నమ్మపై తీవ్రమైన ప్రభావాన్ని కలుగచేసాయి. కొందరు పోరాట యోధులు అమరులైనప్పుడు భయపడిన పశ్యకన్నమ్మ సాయుధ పంథాను వదిలి బయటకు రమ్మని సోదరున్ని కోరినప్పుడు 'పట్టిన పట్టు విడవటం కన్నా చావటం మేలు' అని దొంతి రెడ్డి శంభిరెడ్డి చెప్పిన మాటలు అనేకసార్లు మాకు ఏడ్చుకుంటూ చెప్పేది.తన చిన్నన్న తో పాటు పొనుగోడుకు చెందిన దాసరి లింగన్న, మఠంపల్లి కి చెందిన మిస్త్రీ గోపన్న అమరులు కావటం హుజూర్నగర్ పాత తాలూకా ప్రజలపై తీవ్రమైన ప్రభావం ఏర్పడింది. హుజూర్నగర్ లో కమ్యూనిస్టు పార్టీ నిర్మాతలలో ఒకరిగా1946 నుండి 1951 వరకు కమ్యూనిస్టు పార్టీ ఆర్గనైజర్ గా పనిచేసిన కాలంలో మూడు సార్లు పశ్య రాంరెడ్డి కన్నమ్మ భర్త జైలుకు వెళ్లడం, 1949లో హుజూర్‌నగర్ పోలీస్ కస్టడీలో ఐదు నెలల పాటు ఉన్న సమయంలో కుమారుడు మరణించటం, 1950లో మరో ఐదు నెలల పాటు పోలీస్ కస్టడీలో ఉంచి హుజూర్నగర్ సబ్ జైలుకు పంపి నీ పార్టీ వారు నిన్ను విడుదల చేసుకోవటానికి జైలు పై కాల్పులు జరుపుతారు అన్న నెపం తో నల్లగొండకు ఆ తర్వాత హైదరాబాద్ జైలుకు పంపడం జరిగింది. 1952 జనవరి 11వ తారీఖున విడుదల అయ్యేంతవరకూ, జైల్లో అనారోగ్యానికి గురైనప్పుడు ఒంటరిగా హైదరాబాద్ చేరుకుని డాక్టర్ జై సూర్య (సరోజినీ దేవి కుమారుడు) వద్దకు వచ్చి జైల్లో భర్తను కలవడానికి అవకాశం ఇప్పించమని కోరింది. డాక్టర్ జై సూర్య స్వయంగా నాటి హోమ్ మినిస్టర్ వద్దకు తీసుకువెళ్లి మాట్లాడారు. రోజూ ఆబిడ్స్ లో ఉన్న జై సూర్య ఇంటి (గోల్డెన్ భవనం )నుండి ముషీరాబాద్ జైలు వరకు నడిచి వచ్చి భర్త ఆరోగ్యం వాకబు చేసుకునేది. ఆరోగ్యం బాగా అయిన తర్వాత తిరిగి ఇంటికి వెళ్లే సమయం లో మా నాన్న సూచన మేరకు హైదరాబాదులో పండిట్ జవహర్లాల్ నెహ్రూ హాజరవుతున్న బహిరంగ సభకు పద్మజా నాయుడుతో కలిసి (ఆనాడు ఆమె బెంగాల్ గవర్నర్‌గా ఉండేవారు) వెళ్ళింది. హుజూర్నగర్ నియోజకవర్గం నుండి పోటీ చేసిన జై సూర్య ఎన్నికల్లో తదనంతరం మగ్దుం ఎన్నికల్లో గుండాల దాడుల మధ్య ప్రచారం చేసింది. బొమ్మగాని ధర్మ బిక్షం, పాల్వాయి రామ్ కోటేశ్వరరావు, దొడ్డ నర్సయ్యలతో కలిసి పశ్యకన్నమ్మ కమ్యూనిస్టు పార్టీలో జిల్లా కౌన్సిల్ సభ్యురాలిగా అనేక సంవత్సరాలు కొనసాగింది. 1971 నుండి 1980 వ సంవత్సరం వరకు హుజూర్నగర్ గ్రామపంచాయతీ సభ్యురాలిగా, హుజూర్నగర్ పంచాయతీ సమితి కో–ఆప్షన్ సభ్యురాలుగా బాధ్యతలను నిర్వహించారు. ప్రాణానికి ప్రాణంగా ఉన్న అన్న దొంతి రెడ్డి శంభిరెడ్డి మరణం, ఆయన ప్రభావం కన్నమ్మపై తీవ్రంగా కొనసాగింది. ఇంట్లో అబద్ధం చెప్పి జగ్గయ్యపేటలో మాభూమి నాటకాన్ని చెల్లెలికి చూపెట్టాలన్న కోరికతో ఎడ్ల బండిని బాడుగకు కట్టమని అడుగుతున్నారు నాన్న అని దొంతి రెడ్డి అంతిరెడ్డి కి అబద్ధం చెప్పి ఎడ్ల బండిలో పశ్యకన్నమ్మను జగ్గయ్యపేట కు తీసుకు వెళ్ళాడు.చిలుకూరు లో జరిగిన 8 వ ఆంధ్ర మహాసభకు తన అన్నతో వెళ్లినట్లు పశ్యకన్నమ్మకి జ్ఞాపకం ఉంది.పశ్యరాంరెడ్డి చిన్నాయనల పిల్లలందరూ నాడు పార్టీలో కొనసాగారు. కన్నమ్మ చెల్లెలు భర్త చింతకుంట్ల వెంకటరెడ్డి పొనుగోడు ఏరియాలో దళ సభ్యుడు. దొంతి రెడ్డి శంబిరెడ్డి ఆశయ సాధనలో జీవితాంతం భర్త పశ్యరాంరెడ్డి గారి సహకారంతో కష్టజీవుల సమస్యల పరిష్కారానికి కదం తొక్కిన మహిళ నాయకురాలు పశ్యకన్నమ్మ.నిరుపేదలకు వృద్ధాప్య , వితంతు పెన్షన్ ఇప్పించడం లో, వారి భూమిని ఆక్రమించుకోవటానికి ప్రయత్నించిన సంఘవ్యతిరేక శక్తులను తరిమి కొట్టడంలో మడమ తిప్పని పోరాటం చేసిన నాయకురాలు. 1970 దశకం లోనే మహిళలకు కుట్టు మిషన్ సెంటర్ ను సంవత్సరాల తరబడి నిర్వహించి పదుల సంఖ్యలో మహిళలకు నైపుణ్యత ను పెంచి ఆర్థికంగా నిలపడానికి వారి ఇంట్లోనే ఒక గదిని కేటాయించి అనేక సంవత్సరాలు నిర్వహించారు. నిరుపేద పిల్లలకు బాల్వాడి సెంటర్ ను తన ఇంట్లోనే అనేక తన ఇంట్లో ఒక గదిలో సంవత్సరాలు నిర్వహించారు. మా ఇంటి ముందు ఉన్న హరిజన వాడ పిల్లలకు,ఇతర నిరుపేద కుటుంబాల పిల్లలకు పోషకాహార పదార్థాలు క్రమంగా అందించటంలో స్కూలు టీచర్, ఆయా తో కలిసి ఆ రోజుల్లోనే పనిచేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా మహిళా సమాఖ్య కన్వీనర్ గా, కార్యదర్శిగా,రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలి గా, భారత జాతీయ మహిళా సమాఖ్య జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా సుదీర్ఘకాలం ఆరుట్ల కమలాదేవి,గుజ్జుల సరళా దేవి, బ్రిజ్‌రాణి గౌర్ , ఎస్ .సుగుణమ్మ, చంద్ర రాజకుమారి, చలసాని రత్న కుమారి, పార్వతమ్మ, ప్రేమ్ పావని, కె. అరుణ అక్కినేని వనజ, అమీనా, గంగా భవాని,తదితరులతో ఉమ్మడి నల్గొండ జిల్లాలో కట్కూరి సుశీల దేవి,బి.శేష మ్మ (రామ శర్మ సతీమణి)దొడ్డ పద్మ,కే. సత్యవతి, కుందూరు వెంకమ్మ ఎ.సుగుణమ్మ , పశ్య కలమ్మ,జడ రుక్కినమ్మ, గినిరెడ్డిలచ్చమ్మ, బండారు లచ్చమ్మ,ఎల్లమ్మ ముసుకుల వీరమ్మ తదితరులతో కలిసి పనిచేశారు.

హుజూర్నగర్ ప్రాంతంలో మొదటిసారిగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన కుటుంబాలకు స్వాతంత్ర సమరయోధుల పెన్షన్లు 19 మందికి హుజూర్నగర్ పట్టణంలో మల్లారెడ్డిగూడెంలో కాల్పులకు గురైన కుటుంబాలకు ఇప్పించటంలో కన్నమ్మ గారు చేసిన ప్రయత్నం శ్లాఘనీయం. 1975 1985 అంతర్జాతీయ మహిళా దినోత్సవ దశాబ్దం ఐక్యరాజ్యసమితి ప్రకటించిన సమయంలో దేశవ్యాప్తంగా తంగా వయోజన పాఠశాలలను మహిళలకు నిర్వహించిన సందర్భంగా హుజూర్నగర్ పట్టణంలో అనేక వయోజన పాఠశాలలను నిర్వహించి మహిళలను అక్షరాస్యులను చేయటంలో విశ్రాంతి లేకుండా శ్రమించారు. తాను కూడా స్వయంగా అక్షరాలు నేర్చుకోవటానికి మూడు అక్షరాల పదాలను చదవటం వరకు చదువు నేర్చుకున్నారు. హుజూర్ నగర్ పట్టణంలో మహిళా మండలి భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని, జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చిన దగ్గర నుండి స్థలాన్ని సాధించేంత వరకు ప్రయత్నాన్ని కొనసాగించారు.

ప్రముఖ కమ్యూనిస్టు పార్లమెంటు సభ్యులు దాసరి నాగభూషణం రావు సహకారం, గ్రామ పెద్దల సహకారం,ప్రభుత్వ నిధులతో మహిళా మండలి భవనాన్ని నిర్మించి ప్రముఖ స్వాతంత్ర సమరయోధురాలు క్విట్ ఇండియా ఉద్యమ నేత అరుణా అసఫ్ అలీ పేరు పెట్టడం ఈ ప్రాంత మహిళలకు ఉత్తేజం .2004వ సంవత్సరం నుంచి నేటి వరకు వేల సంఖ్యలో యువ మహిళలకు మహిళలకు కంప్యూట ర్, జర్దోషి, కుట్టు మిషన్ సెంటర్ నిర్వహిస్తూ శిక్షణ ఇవ్వడం జరిగింది. కం ప్యూటర్ నేర్చుకున్న అమ్మాయిలు అనేకమంది ఉద్యోగాల్లో కొనసాగుతున్నా రు. ఇతర మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోగలిగారు.ఇటీవల తన సోదరుడు దొంతి రెడ్డి శంభిరెడ్డి స్మారక భవన నిర్మాణానికి హుజూర్ నగర్ పట్టణంలో శంకుస్థాపన చేశారు. మహిళా మండలి భవనంలోనే మొదటి అంతస్తులో పెద్ద హాలును తన సోదరుడు దొంతి రెడ్డి శంభిరెడ్డి పేరుతో నిర్మించి ప్రారంభించుకోవాలనుకున్నాం.ఈసమయంలో కన్నమ్మ మరణించారు.హుజూర్నగర్ ప్రాంతంలో మహిళా నాయకురాలుగా కమ్యూనిస్టు నాయకురాలు చిరస్మరణీయమైన పాత్రను నిర్వహించిన పశ్యకన్నమ్మమనందరికీ మార్గదర్శకం.

# సరిహద్దు రాష్ట్రాల్లో ప్రశాంతత

### జమ్ముకశ్మీర్, పంజాబ్, హర్యానాలో సాధారణ కార్యకలాపాలు కొనసాగించిన ప్రజలు

### హర్యానాలో బ్లాక్ అవుట్ ఉపసంహరణ



**న్యూఢిల్లీ :** దాదాపు వారం రోజుల పాటు కొనసాగిన తీవ్ర ఘర్షణల తర్వాత శనివారం రాత్రి జమ్ముకశ్మీర్, పంజాబ్ సరిహద్దుల్లో పరిస్థితులు కాస్త సాధారణమయ్యాయి. గత ఆరు రోజుల తరువాత ఆకాశంలో వింత శబ్దాలతో ఎగురుతూ కనిపించిన విమానాలు, క్షిపణులు, డ్రోన్లు లేని రాత్రిని నివాసితులు మొదటిసారి చూశారు. అయితే రాజస్థాన్‌లో సరిహద్దు ప్రాంతాల ప్రజలు మాత్రం బిక్కుబిక్కుమంటూనే కాలం గడిపారు. కాగా, శనివారం రాత్రి 11 గంటల తర్వాత కశ్మీర్‌లోని నియంత్రణ రేఖ (ఎల్ఒసి) వెంబడి ఏ సెక్టార్ నుండీ కాల్పుల విరమణ ఉల్లంఘన జరగలేదని అధికారులు నిర్ధారించారు. పాక్ దాడుల్లో దెబ్బతిన్న పూంచ్, రాజౌరి వంటి సరిహద్దు జిల్లాలతో పాటు జమ్ము ప్రాంతం అంతటా కూడా రాత్రి ఎటువంటి ఘటనలు జరగలేదు. దీంతో ప్రజలకు అవసరమైన ఉపశమనం కలిగింది. ఆదివారం ఉదయం యథావిధంగా తమ కార్యకలాపాలు సాగించారు. నియంత్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దు వెంబడి కాల్పుల విరమణను పాటించాలని భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన ఒప్పందం తర్వాత ప్రశాంతత నెలకొంది. శనివారం సాయంత్రం 5 గంటల నుండి అమలులోకి వచ్చేలా భూమి, గాలి, సముద్రంలో అన్ని కాల్పులు, సైనిక చర్యలను నిలిపివేయడానికి రెండు దేశాల డైరెక్టర్స్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డిజిఎంఒలు) అంగీకరించారని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి ప్రకటించారు. అమెరికా మధ్యవర్తిత్వం వహించిన చర్చల తర్వాత భారత్, పాకిస్తాన్ 'పూర్తి, తక్షణ కాల్పుల విరమణ'కు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కొద్దిసేపటికే ఈ ప్రకటన వెలువడింది. కాగా, కాల్పుల విరమణ ఒప్పందం ఉన్నప్పటికీ, ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ శనివారం సాయంత్రం కశ్మీర్ లోయపై డజన్ల కొద్దీ డ్రోన్లు ఎగురుతున్నట్లు సమాచారం. అయితే, రాత్రిపూట ఎటువంటి డ్రోన్ కార్యకలాపాలు జరగలేదని ధ్రువీకరించారు. కాల్పుల విరమణకు ముందు రోజుల్లో, జమ్ము నగరం, అంతర్జాతీయ సరిహద్దు సమీపంలోని ప్రాంతాలు సహా ఇతర ప్రధాన పట్టణాలలో వరుస పేలుళ్లు సంభవించాయి. దీంతో ఆ ప్రాంతంలో ఆందోళనను మరింత పెంచింది. శనివారం జరిగిన ఒప్పందంతో నాలుగు రోజుల పాటు జరిగిన తీవ్రమైన సరిహద్దు డ్రోన్, క్షిపణి దాడుల తర్వాత, పంజాబ్ అంతటా ఆదివారం ఉదయం ప్రశాంతత నెలకొంది. ముఖ్యంగా కాల్పుల విరమణ ప్రకటన తర్వాత సరిహద్దు ప్రాంతాలలో ప్రశాంతత నెలకొంది. నివాసితులు తమ సాధారణ సాధారణ కార్యకలాపాలు కొనసాగిస్తూ ప్రశాంతంగా ఉండాలని అధికారులు కోరారు. జలంధర్‌లో పరిస్థితి అదుపులోనే ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పనులు యథావిధిగా తిరిగి ప్రారంభించవచ్చని,డిప్యూటీ కమిషనర్ హిమాన్షు అగర్వాల్ అన్నారు. అయితే, పటాకులు పేల్చవద్దని, డ్రోన్లను ఎగరవేయవద్దని ఆయన పౌరులకు సూచించారు. పాకిస్తాన్‌తో 553 కిలోమీటర్ల సరిహద్దును పంచుకునే పంజాబ్‌లో అమృత్సర్, పఠాన్‌కోట్, ఫిరోజ్‌పూర్ వంటి సరిహద్దు జిల్లాల అంతటా ప్రజలు తమ దైనందిన కార్యకలాపాలను తిరిగి ప్రారంభించారు.

#### రాజస్థాన్‌లో భయాందోళనలు

ఇదిలా ఉండగా, భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన అన్ని సైనిక చర్యలను పొరుగు దేశం ఉల్లంఘించిన తర్వాత రాజస్థాన్ సరిహద్దు ప్రాంతాలలో శనివారం రాత్రి భయాందోళనలు చెలరేగాయి. అయితే, ఆదివారం ప్రజలు సాధారణ కార్యకలాపాలు ప్రారంభించారు. మార్కెట్లు తిరిగి ప్రారంభమయ్యాయి. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతల కారణంగా శనివారం పూర్తిగా లేదా పాక్షికంగా రద్దు చేయబడిన రైలు సేవలను నార్త్ వెస్ట్రన్ రైల్వే కూడా పునరుద్ధరించింది. జైసల్మేర్, బార్మెర్, ఇతర ప్రాంతాల నుండి డ్రోన్ కార్యకలాపాలు, పేలుళ్ల వంటి వార్తలు రావడంతో సరిహద్దు ప్రాంతంలో శనివారం రాత్రి బ్లాక్‌అవుట్ విధించారు. గత రెండు రాత్రులతో పోలిస్తే డ్రోన్ కార్యకలాపాల ఫ్రీక్వెన్సీ తక్కువగా ఉందని జైసల్మేర్ నివాసి రేవంత్ సింగ్ చెప్పారు. జైసల్మేర్, బార్మెర్‌లో గురువారం, శుక్రవారం రాత్రుల్లో పాకిస్తాన్ డ్రోన్ దాడులు చేసింది. భారత రక్షణ దళాలు డ్రోన్‌లను గాల్లోనే వాటిని నిర్వీర్యం చేశాయి. ఎటువంటి ప్రాణ నష్టం లేదా ఆస్తి నష్టం జరగలేదు. శనివారం వివిధ ప్రదేశాల నుండి డ్రోన్లు, క్షిపణి లాంటి వస్తువుల శిథిలాలు కనుగొన్నారు. కాగా, కాల్పుల విరమణ ఒప్పందం తరువాత ప్రజలకు కొంత ఉపశమనం కలిగించింది. జైసల్మేర్, బార్మెర్‌లోని మార్కెట్లు సాయంత్రం తిరిగి తెరుచుకున్నాయి. బార్మెర్‌లో బ్లాక్‌అవుట్‌ను ఉపసంహరించారు. జైసల్మేర్, జోధ్‌పూర్‌లలో కూడా బ్లాక్‌అవుట్ వ్యవధి తగ్గించారు.

# ఇప్పుడే ఇళ్లకు రావొద్దు


### సరిహద్దు గ్రామాల ప్రజలకు జమ్ముకశ్మీర్ పోలీసులు కీలక సూచనలు జారీ



**శ్రీనగర్ :** భారత్–పాక్ మధ్య శనివారం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన నేపథ్యంలో సరిహద్దు గ్రామాల ప్రజలకు జమ్ముకశ్మీర్ పోలీసులు కీలక సూచనలు జారీ చేశారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం పాకిస్థాన్ దుశ్చర్యల కారణంగా సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లిన సరిహద్దు గ్రామాల ప్రజలకు కీలక అడ్వైజరీ జారీ చేశారు. ప్రజలు అప్పుడే తిరిగి తమ ఇళ్లకు తిరిగి రావొద్దని.. సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని కోరారు. పాకిస్థాన్ ప్రయోగించిన ఫిరంగి గుండ్లు (షెల్స్) నుంచి ఈ ప్రాంతాలను గుర్తించి శానిటైజ్ చేయాల్సి ఉందని తెలిపారు. పాక్ దాడుల తీవ్రతకు అధికంగా నష్టపోయే అవకాశం ఉండటంతో బారాముల్లా, బందిపొరా, కుప్వారా జిల్లాల్లోని నియంత్రణ రేఖ సమీపంలోని గ్రామాలకు చెందిన దాదాపు 1.25 లక్షల మందికి పైగా ప్రజలను భద్రతా సిబ్బంది ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించిన విషయం తెలిసిందే. అయితే, సరిహద్దు ప్రాంతాల్లో తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలు ఇప్పుడే తమ నివాసాలకు వెళ్లొద్దని కోరుతున్నారు. దాడుల సమయంలో పాక్ ప్రయోగించిన షెల్స్ (ఫిరంగి గుండ్లు) చెల్లాచెదురుగా పడి ఉండటం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. ప్రభావిత ప్రాంతాలకు బాంబు నిర్వీర్య బృందాలను పంపి గ్రామాల్లో ప్రజల ప్రాణ నష్టానికి కారణమయ్యే ఫిరంగి గుండ్లను గుర్తించి, శానిటైజ్ చేస్తామని తెలిపారు. మరోవైపు, 2023లో ఎల్ఒసి సమీపంలో ఇలా మిగిలిపోయిన షెల్స్ పేలుడుతో 41మంది ప్రాణాలు కోల్పోవడం అప్పట్లో విషాదం నింపింది. అందువల్ల పౌరులు గ్రామాలకు ఇప్పుడే తిరిగి వెళ్లొద్దు అని అధికారులు సూచించారు.

# బ్రహ్మోస్ శక్తి గురించి పాకిస్థాన్‌ను అడగండి

### : యుపి సిఎం యోగి




**లక్నో :** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ లో భారత్ బ్రహ్మోస్ క్షిపణులను ఉపయోగించిందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. ఆ సమయంలోనే ఈ క్షిపణులకున్న శక్తి గురించి ప్రపంచ దేశాలకు తెలిసిందన్నారు. దీని ప్రభావం గురించి తెలియని వారెవరైనా ఉంటే.. పాకిస్థాన్‌ను అడిగి తెలుసుకోవాలని సూచించారు. భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం యుపిలోని లక్నో సిటీలో బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూజ్ క్షిపణి ఉత్పత్తి యూనిట్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. లక్నోలోని 'ఉత్తరప్రదేశ్ డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్'లో నిర్మించిన ఈ కేంద్రాన్ని రాజ్‌నాథ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్ పాల్గొని మాట్లాడారు. ఈ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం 200 ఎ కరాల భూమిని కేటాయించిందని సిఎం యోగి తె లిపారు. రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ యూనిట్‌లో ఏటా 80 నుంచి 100 క్షిపణులను తయారు చేయనున్నట్లు వెల్లడించారు. బ్రహ్మోస్ క్షిపణులు 290 నుంచి 400 కి.మీ పరిధిని, మాక్ 2.8 రెట్ల గరిష్ట వేగాన్ని కలిగి ఉంటాయని తెలిపారు. ఇక ఇదే కార్యక్రమంలో ఉగ్రవా దం గురించి కూడా సిఎం యోగి మాట్లాడారు. 'ఉగ్రవాదం కుక్కతోక లాంటిది. అది ఎప్పుడూ వంకరగానే ఉంటుంది. దాన్ని సరిచేయాలంటే వారి సొం త భాషలోనే బదులివ్వాలి' అని వ్యాఖ్యానించారు.

#### బ్రహ్మోస్ క్షిపణి గురించి..

భారత్, రష్యాల సంయుక్త వెంచర్ అయిన బ్రహ్మోస్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన ఈ బ్రహ్మోస్ క్షిపణి 290 నుంచి 400 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను చేధించగలదు. ఈ క్షిపణిని ఫైర్ అండ్ ఫర్గెట్ గైడెన్స్ సిస్టమ్‌తో భూ ఉపరితలం నుంచి, సముద్ర తలం నుంచి, గగనతలం నుంచి ప్రయోగించవచ్చు. కొత్తగా ప్రారంభమవుతున్న ఈ క్షిపణి తయారీ కేంద్రం నుంచి 100 నుంచి 150 కొత్త తరం బ్రహ్మోస్ క్షిపణులను తయారు చేయనున్నారు. ఈ కొత్త తరం బ్రహ్మోస్ క్షిపణులు ఏడాదిలోగా డెలివరీకి సిద్ధం కానున్నాయి. ఈ న్యూజనరేషన్ బ్రహ్మోస్ క్షిపణి పరిధి 300 కిలోమీటర్లు. దీని బరువును తగ్గించారు. ప్రస్తుత బ్రహ్మోస్ క్షిపణి బరువు 2900 కిలోలు కాగా, న్యూ బ్రహ్మోస్ క్షిపణి బరువు 1290 కిలోలు.

### కశ్మీర్ అంశంపై 'మూడవ పక్షం' మధ్యవర్తిత్వానికి...

# అమెరికా అంగీకరించిందా? లేదా?

### ఈ సమస్యను 'అంతర్జాతీయీకరణ చేసే ప్రయత్నం' అని మోదీ సర్కారుపై కాంగ్రెస్ ధ్వజం

### అన్ని రాజకీయ పార్టీల సమావేశం, పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్

న్యూఢిల్లీ : భారతదేశంపాకిస్థాన్ తరపున అమెరికా ప్రకటనలు చేసిన తర్వాత కశ్మీర్‌పై మూడవ పక్షం మధ్యవర్తిత్వానికి అంగీకరించిందా? లేదా? అన్న విషయమై ప్రభుత్వం సమాధానాలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ అంశాన్ని అంతర్జాతీయీకరణ చేసేందుకు చేసే ప్రయత్నమే అని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ ఆదివారం ఇక్కడి ఎఐసిసి హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాల్పుల విరమణ ప్రకటన ఆశ్చర్యంగా ఉన్నదని, భారత్‌పాకిస్థాన్ తరపున ఒక మూడవ దేశం ప్రకటనలు చేయడం ఇదే మొట్టమొదటిసారి అని కాంగ్రెస్‌పార్టీ తెలిపింది. అమెరికన్ల తరపున రెండు దేశాలను యుఎస్ ఆదేశించడమేమిటని ప్రశ్నించింది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన అన్ని రాజకీయ పార్టీల మరొక సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను తప్పకుండా అంగీకరించాలని సచిన్‌పైలట్ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పరిణామాలకు సంబంధించిన ఈ విషయాలపై చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. భారత్‌పాకిస్థాన్ విషయంలో గత 24గంటల్లో హఠాత్ సంఘటనలు చోటుచేసుకున్నాయని సచిన్ పైలట్ ఆశ్చర్యం వ్యక్త ంచేశారు. కాల్పుల విరమణ ప్రకటనను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేశారన్న విషయం సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని మేంఅం దరమూ ఆశ్చర్యపోయాం అని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'భారతదేశంపాకిస్థాన్ సమస్యలను అంతర్జాతీయీకరణ చేసే ప్రయత్నమే ఇది. ఇలా జరగడం ఇదే మొదటిసారి' అని ఆయన చెప్పారు.దేశానికి సంబంధించిన అన్ని రాజకీయ పార్టీలను విశ్వాసంలోకి తీసుకుని దీనిపై స్పష్ట త ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సచిన్‌పైలట్ అన్నారు. భూమి, గగనతలం, సముద్రంపై అన్ని రకాలు కాల్పులు. సైనిక చర్యలను నిలిపివేయాలని భారత్‌పాక్ ఒక అవగాహనకు వచ్చాయని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ శనివారం ప్రకటించిన విషయం తెలిసిందే. 'కశ్మీర్ అంశం ఒక ద్వైపాక్షిక సమస్య. దానిని అంతర్జాతీయీకరణ చేసే ప్రయత్నం సరి కాదు' అని సచిన్‌పైలట్ హితవు పలికారు. కొన్ని సంవత్సరాల క్రితం భారతదేశంపాకిస్థాన్ రెండూ ఒకే దేశం కింద ఉన్నాయని మర్చిపోయి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వేల సంవత్సరాల కాలం నుంచి పోరాడుతున్నామని తప్పుగా వ్యాఖ్యానించారని సచిన్ పైలట్ తప్పుపట్టారు. వాషింగ్టన్ నుంచి కాల్పుల విరమణ ప్రకటన సరిహద్దు వెంబడి జరుగుతోన్న దాడులకు సంబంధించిన అనేక ప్రశ్నలు, సందేహాలకు తావిస్తోందన్నారు.

# ఒప్పందం శాశ్వత ప్రభావం చూపుతుందని ఆశిస్తున్నా

శ్రీనగర్ : భారత్, పాకిస్తాన్ మధ్య పరస్పరం జరిగే అన్ని సైనిక చర్యలను నిలిపివేయడానికి కుదిరిన ఒప్పందం శాశ్వత ప్రభావాన్ని చూపుతుందని పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ ఆదివారం ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కాల్పుల విరమణ శాశ్వతంగా మారాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఎందుకంటే సంఘర్షణ జరిగితే అమాయక ప్రజలు తమ ప్రాణాలను, ఇళ్లను కోల్పోతారని బారాముల్లా సరిహద్దు గ్రామాల నుండి స్థానభ్రంశం చెందిన వారిని సందర్శించిన ముఫ్తీ ఇక్కడ విలేకరులతో అన్నారు. శనివారం సైనిక అవగాహన జరిగిన కొన్ని గంటల్లోనే పాక్ ఉల్లంఘనల గురించి అడిగినప్పుడు, రెండు దేశాల సైన్యాలు ఒకరినొకరు తమ బలాలను ప్రదర్శిస్తున్నప్పుడు పరిస్థితిని తగ్గించడానికి సమయం పడుతుందని ఆమె అన్నారు. ఉద్రిక్తతను తగ్గించడానికి సమయం పడుతుందని, ప్రతిదానిపైనా కోపంగా ఉండకూడదన్నారు. ప్రభుత్వం స్థానభ్రంశం చెందిన ప్రజలకు ఏర్పాట్లు చేయాలని, వారు తమ ఇళ్లను నిర్మించుకునేలా వారికి ఆర్థిక సహాయం అందించాలని ఆమె అన్నారు. 'ప్రజలు తమ ఇళ్లను కోల్పోయారు. వారు తమ ఇళ్లను పునర్నిర్మించుకునే స్థితిలో లేరు. వారికి వసతి కల్పించాలి. వారి ఇళ్ల పునర్నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాను' అని ఆమె అన్నారు. కశ్మీర్ సరిహద్దు జిల్లాల్లో పరిస్థితి దారుణంగా ఉందని, పూంచ్, రాజౌరి, జమ్ము జిల్లాల్లో కూడా పరిస్థితి మెరుగ్గా లేదని పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పిడిపి) చీఫ్ అన్నారు.

## బాల్యం నుండే జస్టిస్ లిటరసీ పరిజ్ఞానం అవసరం

ప్రజాపక్షం/కోదాడ: బాల్యం నుండే జస్టిస్ లిటరసీ పరిజ్ఞానం అవసరమని స్టేట్ రిసోర్స్ పర్సన్ సైన్స్ అధికారి ఎస్‌కె జాఫర్, ప్రముఖ న్యాయవాది మేకల వెంకట్రావు అన్నారు. ఆదివారం పట్టణంలో రైజింగ్ తెలంగాణ పాఠశాల విద్యాశాఖ, జన విజ్ఞాన వేదిక సారథ్యంలో పిఎం శ్రీ జడ్పీ బాయ్స్ హై స్కూల్‌లో బాల విజ్ఞాన సమ్మేళనం, వేసవి శిక్షణ శిబిరంను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు న్యాయ సంబంధమైన విషయాలు భారత రాజ్యాంగం ద్వారా కల్పించబడిన ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం, బాల కార్మిక నిరోధక చట్టం, జువైనల్ హోమ్, జువైనల్ కోర్టు, బాలికల సాధికారత టోల్ ఫ్రీ నెంబర్ల ద్వారా ఉచితంగా న్యాయ సహాయం పొందడం అంశాల జట్సిస్ లిట్రసి న్నయాయ అక్షరాస్యత విషయాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సలీం షరీఫ్, ఇన్‌చార్జ్ ఉపాధ్యాయులు డి మార్కండేయ, ఉపాధ్యాయులు ఎస్‌కె ఖజామీయా, బడుగుల సైదులు పాల్గొన్నారు.

## దంతెవాగు పూడ్చివేత

ప్రజాపక్షం/మునగాల: ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన వాగును కొందరు ఆక్రమించి జెసిబి సాయంతో మట్‌టితో పూడ్చివేసిన ఘటన తాడువాయి గ్రామ రెవెన్యూ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. దంతెల వాగు గణపవరం చెరువుకి వరద వాగుగా ప్రసిద్ధి, స ఉమారు 100 ఎకరాల్లో ఈ వాగు విస్తరించి ఉంది. కాలక్రమేణ కబ్జాలతో వాగు కనుమరుగువుతొంది. వర్షాకాలం వర్షాలు వచ్చే వరద ఈ వాగు గుండా వెళ్లి గణపవరం చెరువు నిండుతోందని రైతులు చెబుతున్నారు. అలాంటి చెరువు కొందరు ఆక్రమించి మట్టి పోసి చదును చేస్తున్నారు. గ్రామంలో రోజురోజుకు వాగులు, వంకలు కనుమరుగవు తున్నా యని రైతులు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా కబ్జా గురైన వాగులను సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## నేడు పశ్య కన్నమ్మ సంతాప సభ



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: స్వాతంత్ర సమర యోధురాలు, తెలంగాణ సాయుధ పోరాట వీర నారి కామ్రేడ్ పశ్య కన్నమ్మ సంతాప సభను హుజూర్ నగర్ సిపిఐ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లులు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ 30 అనారోగ్య కారణాలతో మృతి చెందిన కనకమ్మ సేవలను కొనియాడారు. సోమవారం పట్టణంలోని ప్రియ దర్శిని డిగ్రీ కళాశాలలో జరిగే సంతాప సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, రాష్ట్ర ప్రెస్ అకాడమి అధ్యక్షులు శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు సిపిఐ ప్రముఖ నాయకులు పాల్గొనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే కమ్యూనిష్టుల ఎజెండా



ప్రజాపక్షం/చిట్యాల: సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే కమ్యూనిష్టుల ఎజెండా అని సిపిఐ జిల్లా సమితి సభ్యులు బొడిగె సైదులు అన్నారు. ఈ నెల 16న జరిగే మండల మహాసభకు సంభం దించిన కరపత్రాన్ని ఆదివారం చిట్యాల మండల కేంద్రంలో సిపిఐ నాయకు లతో కలిసి విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిష్టు పార్టీ ఆవిర్భావం నుండి ప్రజలకు అండగా ఉంటూ ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తున్న పార్టీ అని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, ఇందిరమ్మ ఇండ్లను త్వరిత గతిన పూర్తి చేసేలా చూడాలని ఆయన కోరారు. గత ప్రభుత్వ పది సంవత్సరాల పాలనలో తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని విమర్శించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పి దాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేయకుండా ప్రజారంజక పాలనను అందించా లని సైదులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్య దర్శి జిల్లా సత్యం, నాయకులు దేశగోని బాలరాజు, గుండాల సత్తయ్య, బొల్గురి లింగయ్య, రావుల చినవెంకన్న, పానుగుల శివ పాల్గొన్నారు.

## ప్రజారోగ్యానికి పెద్దపీట

దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్



ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని దేవరకొండ శాసనసభ్యుడు నేనావత్ బాలు నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని అంగడిపేట గ్రామపంచాయతీ ఆవరణంలో బిగ్ టీవీ ఆధ్వర్యంలో మలక్ పేట యశోద ఆసుపత్రి వారి సౌజన్యంతో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్మటి సతీష్ రెడ్డి సహకారంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మండల ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారం భించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రులలో మెరుగైన వైద్యం అందిం చేందుకు కృషి చేస్తున్నామన్నారు.గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవ లందించడానికి ఉప కేంద్రాలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, మండల వర్కింగ్ ప్రెసి డెంట్ నెర్మటి సతీష్ రెడ్డి,బ్లాక్ అధ్యక్షుడు బోడియ నాయక్, మాజీ ఎంపీ పీలు వంగాల ప్రతాప్ రెడ్డి,తేరా సత్యం రెడ్డి, గోవిందు యాదవ్,ముక్కామల్ల వెంకటయ్య గౌడ్,డాక్టర్ పాల్వాయి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## నేడు సిపిఐ మండల మహాసభ




ప్రజాపక్షం/చండూరు: నేడు దోనిపాముల గ్రామంలో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ మండల 15వ మహాసభను జయ ప్రదం చేయాలని సిపిఐ చండూరు మండల కార్య దర్శి నల్పరాజు సతీష్ కుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన చండూరులో మాట్లాడుతూ మండలం లోని అన్ని గ్రామాలలో పార్టీ గ్రామశాఖ మహాసభలు నిర్వహించుకోవడం జరిగిందని తెలిపారు. నేడు సోమవారం మండలంలోని దోనిపాముల గ్రామంలో జరిగే సిపిఐ మండల 15వ మహాసభకు ముఖ్య అతిధులుగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు ,మాజీ ఎంఎల్ఏ పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం హాజరవుతున్నారని తెలిపారు. నేడు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే మండల మహసభలకు పార్టీ శ్రేణులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల పార్టీ సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు , మహాసభ ఆహ్వాన కమిటి అధ్యక్షుడు తిప్పర్తి రాములు తదితరులు పాల్గొన్నారు.

## డిఎంహెచ్‌ఒను సస్పెండ్ చేయాలి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్: జిల్లాలో అనుమతులు, అర్హత లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులపై అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మహర్షి డిగ్రీ కళాశాలలో పేద ప్రజల ఆరోగ్యం నకిలీ వైద్యులుప్రభుత్వ వైఖరి అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఏలాంటి అనుమతులు, అర్హత లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవడంలో జిల్లా వైద్యాధికారి పూర్తిగా విఫలమ య్యారని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డిఎంహెచ్‌ఓను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయ కులు బాసిపంగు సునీల్, పోరెళ్ళ విప్లవ్ కుమార్, అశోక్, కరీం, గట్ల రమా శంకర్, బంటు సందీప్, వెంకటేష్ నాయక్, సంతోష్ రెడ్డి, నాగేశ్వర్ రావు నాయక్, మహేందర్ పాల్గొన్నారు.

# నేడు సాగర్‌కు ప్రపంచ సుందరీమణులు

బుద్ధవనం,విజయ విహార్‌లో సర్వం సిద్ధం

కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు





ప్రజాపక్షం/నందికొండ: మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ వేదికైన సందర్భంగా శనివారం పోటీలకు సంబంధించిన ప్రారంభో త్సవ కార్య క్రమం హైదరాబాదులో అట్టహాసంగా ప్రారంభ మైంది.110 దేశాలకు చెందిన సుందరిమణులు నెల 10 నుంచి 31వరకుఈ పోటీలో పాల్గొం టున్న సందర్భంగా ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ ను నేడు సందర్శించను న్నారు.వీరి రాక సందర్భంగా సాగర్ లో పోలీసు లుకట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారువిజయ విహార్, బుద్ధ వనం అంతర్జాతీయ స్థాయిలో అన్ని హంగులను పూర్తి చేసుకుని వారి అతిథ్యానికి సర్వం సిద్ధమైంది భారతదేశం నుంచి మిస్ ఇండియా నందిని గుప్తా ఈ పోటీలలో పాల్గొన నున్నారు దీంతో నాగార్జున సాగర్లో విడిది చేయ డానికి అంతర్జాతీయ స్థాయి లో విజయవిహార్ లోని 38 గదులను ఐదు కోట్ల రూపాయలతో ఆధునీకరణ చేశారు.ఇది గ్లోబల్ ఈవెంట్ కావ డంతోపోలీసు శాఖ వారు హైదరాబాదులో బయ లుదేరి నాగార్జునసాగర్ చేరుకుని మళ్లీ తిరిగి హైదరాబాద్ వెళ్ళే వరకు ఎటువంటి అవాంత రాలు అవాంఛనీయ సంఘటనలు,జరగకుండా 1200 నుంచి 1500 మంది పోలీసులతో పూర్తి స్థాయి కట్టుదిట్టమైన రూట్ బందోబస్తును ఏర్పాటు చేసారు.నేడు ఈ బృందం 4 గంటలకు విజయ విహార్ అతిథి గృహానికి చెరుకుని అర గంట తరువాత ఇక్కడ నుండి బుద్ధ వనం చేరు కొని బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటిం చిన అనంతరం మహా స్తూపం ముందు భాగంలో టూరిజం వారు ఏర్పాటు చేసిన సాంప్రదాయ నృత్యాలను వీక్షిస్తారు. ఈ ప్రదేశంలోనే అను మతి ఉన్న మీడియా వారికి ఫొటోలు తీసుకునే అవకాశం ఉంటుంది. తరువాత మహాస్థూపం చేరుకొని అక్కడ ఉన్న బౌద్ధ శిల్పాలను సంద ర్శించి ధ్యాన మందిరంలో బౌద్ధ భిక్షులతో కలిసి ధ్యానం, చాటింగ్‌లో పాల్గొంటారు. ఆ తరువాత జాతక వనంలో ఏర్పాటు చేసిన లేజర్ లైటింగ్ షో, స్క్రీన్ పై నిర్వహించే డాక్యుమెంటరీని వీక్షి స్తారు. ఇక్కడే రాత్రి భోజనం చేసిన అనంతరం హైదరాబాద్ చేరుకుంటారు. ఈ కార్యక్రమం పూర్తి అయ్యేంతవరకు అనుమతి లేని వారికి ప్రవేశం లేకుండా కఠిన చర్యలు తీసుకున్నారు.

# అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గురిజ రామచంద్రం



ప్రజాపక్షం/మునుగోడు: అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకా లను అందించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురిజ రామచంద్రం కోరారు. శనివారం రాత్రి పలివెల గ్రామ శాఖ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు మొదటగా బస్టాండ్ సెంటర్లో గల పార్టీ పథకాన్ని ఆవిష్కరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం సిపిఐ పోరా డుతుందని అన్నారు. నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డులు పెన్షన్లు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. సంక్షేమ పథకాల ఎంపికలో అధికారులు అనర్హులను గుర్తిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువత గంజాయి, కొకైన్ లాంటి మత్తు మత్తుకు బానిస అవు తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు వీటిపై ప్రత్యేక చర్యలు చేప ట్టాలని కోరారు. ఈ సమావేశానికి నాతి నరసింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ జడ్పిటిసి గోస్కొండ లింగయ్య, మాజీ ఎంపీపీ మాధ గోని సాయిలు, గ్రామ శాఖ కార్యదర్శి గోస్కొండ కృష్ణయ్య,సహాయ కార్య దర్శి ఆనగంటి నరసింహ, వెంకన్న,మాధగోని మల్లయ్య, గోస్కొండ మల్లేష్,మోహన్ రెడ్డి,పంతంగి నరసింహ,యాదయ్య, కృష్ణయ్య, రాములు,



## నూతన పింఛన్లు మంజూరు చేయాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొల్గురి నరసింహ

ప్రజాపక్షం/మునుగోడు: ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అరులైన వారికి ఇస్తామన్న ఆసరా పింఛన్‌లను తక్షణమే మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్గురి నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రాత్రి మండలంలోని పులిపలుపుల గ్రామంలో ఆ గ్రామ శాఖమహా సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని మతోన్మాదాన్ని తరిమికొట్టాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమ లుపరచాలని గ్రామీణ ప్రాంతంలో ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారికి ఇవ్వా లని,రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ మండల కార్యదర్శి చాపల శీను మాట్లాడుతూ వృద్ధులకు వితంతువులకు వికలాంగు లకు ఒంటరి మహిళలకు కొత్త పెన్షన్లు ఇవ్వాలని అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొంపెల్లి రాములు అధ్యక్షతన జరిగిన ఈమహాసభలో మండల కార్యవర్గ సభ్యులు కాయితవెంకన్న, గ్రామ శాఖ కార్యదర్శి బొల్గురి ఎల్లయ్య, సహాయ కార్యదర్శి గుండెబోయిన భాస్కర్, సింగం యాదయ్య,పందుల యాదయ్య, మలికంటి వినీల్, మునుగోటి సత్య నారాయణ, జనగాం శంకరయ్య,దొటి రమేష్, సిలువేరు సైదులు, పగిళ్ల యాదయ్య,పగిళ్ల బిక్షం, సింగం నాగయ్య పాల్గొన్నారు.

## ప్రజా పోరాటాలు నిర్వహించాలి



ప్రజాపక్షం/మర్రిగూడ: ఓట్లు, సీట్లతో సంబంధం లేకుండా ప్రజా సమస్య లపై నిత్యం ప్రజా పోరా టాలు నిర్వహించాలని మండల కార్యదర్శి ఈదుల బిక్షం రెడ్డి పిలు పునిచ్చారు. మండల పరి ధిలోని కొట్టాల గ్రామ శాఖ మహాసభలో బిక్షం రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని అన్నా రు. సిపిఐ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని అన్నారు. గ్రామంలో అర్హులైన ప్రతి పేదకుటుంబానికి ఇంది రమ్మ ఇల్లు మంజూరు చేయాలని, అదే విధంగా నూతన రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ పార్టీ మండల కార్యవర్గ సభ్యులు బుర్ర శేఖర్,గంట వెంకటేష్, ఉబ్బు అంజయ్య,ఉబ్బు రాములు ,బుర్ర బాలయ్య, గంట రాజు, బుర్ర రాము,బుర్ర నరసింహ, వెంకటయ్య,ఉబ్బు లింగయ్య పాల్గొన్నారు.

## ఇఎపిసిఇటి ఫలితాల్లో జయ విద్యార్థుల ప్రభంజనం



ప్రజాపక్షం/సూర్యాపేట: ఇంజనీ రింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసి కామన్ ఎంట్రెన్స్ టెస్టులో జిల్లా కేంద్రంలో జయ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రభంజనం సృష్టిం చారు. ఆదివారం 60ఫీట్ల రోడ్డులోని కళాశాలలో ఉత్తమ ర్యాంకులు సాధిం చిన విద్యార్థులను కళాశాల కరస్పాం డెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్‌లు బింగి జ్యోతి, జెల్లా పద్మలు అభినందిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈఎపి సిఈటి ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన కె ఉజ్వన్ 141 ర్యాంకు, ఇజ తేజశ్రీ 266 ర్యాంకు, సిహెచ్ హన్సితశ్రీ 695, టి అమూల్య 913, బి లాస్య 917, పి అమిత్ సూర్య1948, బి శివమణి 2270 ర్యాంకు, డి జగదీష్ రాజు 2935 ర్యాంకు, వై ప్రదీప్ 3364 ర్యాంకు, కె సాయినందన్ 3977, జి నవదీప్ 4003 ర్యాంకు, సిహెచ్ కుషల్ రాజ్ 5044, సిహెచ్ అక్షయభారతి 5583, కె యామిని 5823, హన్సిని 5843 ర్యాంకు, వి బింధుమాధవి 6002 ర్యాంకు, ఎస్ నక్షత్ర 6630 ర్యాంకు స ఆధించినట్లు తెలిపారు. విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచేలా కృషి చేసిన అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో కొర్రీలు పెట్టొద్దు

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయ నాయుడు



ప్రజాపక్షం/నేరేడుచర్ల: ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ప్రభుత్వం కొర్రీలు పెట్టడం సరైంది కాదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం అభ్యర్థుల ఎంపికలో అనేక నిబంధ నలు పెడుతున్నారన్నారు. 400 నుండి 600 చదరపు అడు గుల మేరకే ఇంటి నిర్మాణం జరపాలని అంతకుమించి స్థలం ఉంటే ఇందిరమ్మ ఇళ్లుకు అనర్హులని నిబంధన పెట్ట డాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇంది రమ్మ ఇండ్ల నిర్మాణంలో ప్రభుత్వం రాజకీయ జోక్యం చేసు కోవడం సరైంది కాదన్నారు. లబ్దిదారుల నుండి మండలం లోని పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రూ. 3వేల నుండి 5వేల వరకు వసూళ్లకు పాల్పడుతున్నారని చెప్పారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చిలకరాజు శ్రీను, ఎఐ టియుసి మండల అధ్యక్షులు ఊదర వెంకన్న, యువజన నాయకులు కమ్రరాజు వెంకట్ పాల్గొన్నారు.

## ఇపిసెట్ ఫలితాలలో ప్రగతి జూనియర్ కళాశాల అగ్రగామి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: ఈఏపీసెట్ 2025 ఫలితాలలో నల్లగొండ పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి నల్లగొండ జిల్లాలో మరి ఏ ఇతర కళాశాల సాధించలేని విధంగా ర్యాంకులు సాధించి జిల్లా చరిత్రను తిరగరా శారు. కళాశాలకు చెందిన కె. ఉజ్వల 314 ర్యాంకును సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. అదే విధంగా ఎం. షైని 1306, అరిబా తబ స్సుమ్ 1363, పి సింధు 1847, నబీహ మహీన్ 2812, బి.భహని 3755,ఉజ్వల 314 ర్యాంకును సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. అదే విధంగా ఎం. షైని 1306, అరిబా తబ స్సుమ్ 1363, పి. సింధు 1847, నబీహ మహీన్ 2812, బి. 3755, అమాతుల్. షెజాన్ 4294,ఎస్ చరణ్ 4768,కె సమీర్ 5075,ఎస్ యశ్వంత్, 5728,సుహాస పిర్దో స్ 5960ర్యాం కులతో, 15 వేల లోపు ర్యాంకులు మొత్తం 72 మంది విద్యార్థులు , 25 వేల లోపు ర్యాంకులు 153 మంది విద్యార్థులు సాధించి ప్రగతి జూని యర్ కళాశాల ను జిల్లాలో అగ్రగామి కళాశా లగా నిలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాశాల విద్యార్థులను వారి తల్లిదం డ్రులను అందుకు సహకరించిన అధ్యాపక బృందానికి కళాశాల చైర్మన్ చందాకృష్ణమూర్తి, మరియు డైరెక్టర్లు ఎ. నరేందర్ బాబు, ఎన్. శశి ధర్రావు, చందా శ్రీనివాస్, పైళ్ళ రమేష్ రెడ్డి అభి నందనలు తెలిపారు. పట్టుదల, క్రమశిక్షణతో కూడిన ప్రణాళికబద్ధమైన విద్యాబోధన, అంకిత భావం కలిగిన యాజమాన్యం మరియు అధ్యాప కబృందం కృషివలన ఉత్తమ ఫలితాలు సాధిం చడం జరిగిందని ప్రిన్సిపల్ తెలియజేశారు.

## ఇఎపిసిఇటి ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన‘ ప్రతిభ’ కళాశాల విద్యార్థిని



ప్రజాపక్షం/సూర్యాపేట: ఈఎపిసిఈటి 2025 ఇంజ నీరింగ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసి కామన్ ఎంట్రెన్స్ టెస్టు ఫలితాల్లో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యా ర్థిని అచ్యుత రాష్ట్ర స్థాయిలో 2799 ర్యాంకును సాధించి తన ప్రతిభను చాటింది. మరో 9మంది విద్యార్థులు 10వేల లోపు ర్యాంకులను సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్, డైరెక్టర్ కందిమళ్ళ వెంకట్ రెడ్డి, ప్రిన్సిపల్ అండ్ డైరెక్టర్ కర్రోజు సత్యంబాబులు పుష్పగుచ్చం అందజేసి అభినందించారు. మిఠాయిలు పంపిణీ చేసి బాణా సంచ కాల్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి సాధారణమైన ఫీజులతో గ్రామీణ విద్యార్థులను బోధన చేసి రాష్ట్ర స్థాయిలో ఇంటర్, ఈఎపి సిఈటి ఫలితాలో కూడా ర్యాంకులు సాధించడం జరిగిందన్నారు. ఇందుకు కారకులైన అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులను కృతజ్ఞతలు తెలిపారు.

## అస్తిత్వ సాహిత్య ఉద్యమాల పుట్టినిల్లు నల్లగొండ




ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: తెలుగు సాహిత్యంలో అస్తిత్వ ఉద్యమాలకు నల్లగొండ కేంద్ర బిందువుగా నిలి చిందని ప్రముఖ సాహితీవేత్త మునాసు వెంకట్ అన్నారు. నల్లగొండకు చెందిన ప్రముఖ కవి శీలం భద్రయ్య రచించిన ముస్తాదు కవిత్వ సంపుటి ఆవిష్క రణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిం చారు. సృజన సాహితీ ఆధ్వర్యంలో పెరుమాళ్ళ ఆనంద్ అధ్యక్షతన యుటిఎఫ్ భవన్ లో జరిగిన ఈ సభలో మునాస్ వెంకట్ మాట్లాడుతూ శీలం భద్రయ్య చక్కని భావనా శక్తితో శిల్ప సౌందర్యం కలిగిన కవితలు రాసారని అభినందించారు. ప్రముఖ సాహితీవేత్త మోత్కూరు నరహరి మాట్లాడుతూ చక్కని మాండలికం, చిక్కని కవిత్వం భద్రయ్య ప్రత్యేకత అన్నారు. రామన్న పేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. సృజన సాహితీ కార్యదర్శి డాక్టర్ సాగర్ల సత్తయ్య పుస్తకాన్ని సమీక్షించారు. కట్టంగూరు కు చెందిన కవి పొడి చేటి శంకర్ మోకు ముస్తాదులతో సభకు హాజరై అందర్నీ ఆకట్టుకున్నారు. నల్లగొండకు చెందిన యోగా గురువు మాదగాని శంకరయ్య తొలి ప్రతి స్వీక రించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారులు బొల్లెద్దు కిషోర్ కుమార్ కవులు పగిడిపాటి నరసింహ, అరుణ జ్యోతి, కనకటి రామకృష్ణ, యాద గిరి,రమేష్, గంటెకంపు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## కెఎల్‌ఎన్ విద్యార్థుల ప్రతిభ



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలోని కేఎల్‌ఎన్ కళా శాల విద్యార్థులు ఆదివారం వెలువడిన ఎఫ్‌సెట్ ఫలి తాల్లో ప్రతిభ చాటి ర్యాంకులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ కిర ణ్‌కుమార్ తెలిపారు. ఇంజనీ రింగ్ విభాగంలో సంద్రాల పావని 5068వ ర్యాంకు, ఎస్.అశ్విత 10389, పి.నిత్యా 12618, ఎం.హాసిత 18397, అగ్రిక ల్చర్ విభాగంలో జుహా అంజుమ్ 3315వ ర్యాంకు, అంజుమ్ 11748వ ర్యాంకు సాధించగా 30వేల లోపు ర్యాంకులు 20 మంది సాధించినట్లు తెలి పారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు పీఎల్‌ఎన్.రెడ్డి, నరేంద ర్‌రెడ్డి, టి.హనుమంతరెడ్డి, చైతన్య ఆనంద్‌లు అభినందించారు.

## షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/దమ్మపేట:**స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం ఉదయం దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో తన క్యాంప్ కార్యాలయం(ఆఫీస్)లో షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు అందజేయడం జరిగింది. ఒక్కరికి 1,00,116/ రూపాయలు చొప్పున 28 మంది లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కూడా ప్రజల సంక్షేమం కోసం పని చేస్తుందని, ఆకాశంలో సగం కాదు.. "ఆమె" ఆకాశం సంక్షేమంలో సగం కాదు..''ఆమె" అగ్రభాగం, మహిళా సంక్షేమంలో.. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పాలన యావత్ భారత దేశానికే ఆదర్శం, అప్పుడే పుట్టిన ఆడబిడ్డ నుంచి ఆరు పదులు దాటిన అవ్వల వరకు అందరినీ కంటికి రెప్పలా కాపాడింది మనసున్న మన రేవంతన్న కాంగ్రెస్ సర్కార్ అని పేర్కొన్నారు. డిప్యూటీ తహశీల్దార్ టి వాణి, ఆర్ఐ వీరాస్వామి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, చెక్కుల లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటికి సిపిఐ వినతి...

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:**తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ,గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఖమ్మంరూరల్ మండల పర్యటనలో భాగంగా పెద్దతండలో ఓ వివాహ వేడుకకు హాజరైన మంత్రిని సిపిఐ జిల్లా సమితి సభ్యుడు చెరుకుపల్లి భాస్కర్, మండల సమితి సభ్యుడు దండి రంగారావు కలిశారు. ఏదులాపురం మున్సిపాలిటీలో పని చేస్తున్న ఎఐటియుసి అనుబంధ సంఘం వర్కర్లకు ఎల్1 లిస్టులో అర్హత వచ్చినప్పటికీ, అధికారులు క్యాన్సల్ చేసినట్టుగా తెలిపారు. కార్మికులుగా పని చేస్తున్నారే తప్ప వారంతా కడు నిరుపేదలని, ఎ ల్1లో వచ్చిన అర్హత ప్రకారమే ఇందిరమ్మ ఇళ్లను కే టాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రి పరిశీలన చేస్తా మని హామీ ఇచ్చినట్లుగా తెలిపారు సిపిఐ మండల నాయకుడు పొన్నెకంటి రామకృష్ణ,ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు , సభ్యులు పాల్గొన్నారు.



## ఎంసెట్ ఫలితాలలో 'బ్రిలియంట్' విద్యార్థుల విజయకేతనం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:**స్థానిక సారపాక బ్రిలియంట్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు ఆదివారం ప్రకటించిన తెలంగాణ ఎంసెట్ ఫలితాలలో మరొకసారి విజయకేతనం ఎగర వేశారు. ఇంజనీరింగ్ విభాగంలో ఏ రస్మితరెడ్డి 8688 ర్యాంకుతో 1వ ర్యాంకు సాధించగా, ఆర్ వినయ్ శరణ్ చౌదరి 11522వ ర్యాంకుతో 2వ ర్యాంకు సాధించారు. అగ్రికల్చరల్, ఫార్మసీ విభాగంలో సిహెచ్ స్వాతిక 20143వ ర్యాంకుతో 1వ ర్యాంకు సాధించగా, మరో నలుగురు విద్యార్థులు ఇంజనీరింగ్ విభాగంలో 25000లోపు ర్యాంకులన సాధించగా, అగ్రికల్చరల్, ఫార్మసీ విభాగంలో కూడా ముగ్గురు విద్యార్థులు 27000లోపు ర్యాంకులను సాధించి బ్రిలియంట్ విద్యార్థులు మరొక సారి సారపాక కీర్తి కిరీటాన్ని రాష్ట్ర స్థాయిలో నిలిపారు. ఈసందర్భంగా బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బిఎన్ఆర్ మాట్లాడుతూ99శాతం ఉత్తీర్ణత సాధించినందుకు మాకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. మొదటి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మెమెంటో ఇచ్చి బిఎన్ఆర్ అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో బ్రిలియంట్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ బిఎన్ఆర్ అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'హార్వెస్ట్'కు అగ్రశ్రేణి ర్యాంకులు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాల్లో హార్వెస్ట్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి అగ్రశ్రేణి ర్యాంకులు సాధించినట్లు హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ సంస్థల యాజమాన్యం తెలిపింది. ఆదివారం ప్రకటించిన ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసి విభాగాలకు సంబంధించి తమ కళాశాల నుండి ఇంజనీరింగ్ విద్యకు 200 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా బి. సాయిచరణ్ 77వ ర్యాంకు సాధించి అగ్రస్థానంలో నిలిచారని తెలిపారు. బి. సిద్దార్థ్ 193, ఎన్. రాఘవేంద్ర నవనీత్ 265, డి. శ్రీనివాస్ గౌతమ్ రెడ్డి 336, ఎం. నాగయశ్వంత్ 448, ఆర్. వెంకట సాయి వర్షిత్ 724, ఎన్‌సిహెచ్ యశ్వంత్ సాయి 958 ర్యాంకు సాధించారని వారు తెలిపారు. ఎంపిసి విభాగంలో ఐదువేల లోపు 20 మంది, 10వేల లోపు 26 మంది, 20వేల లోపు 50 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు. వివిధ కేటగిరీలలో 30వేల లోపు ర్యాంకులు సాధించి 69 మంది టాప్ కళాశాలల్లో సీట్లు సాధించే అవకాశం ఉందన్నారు. బైపిసి విభాగంలో జి. రాణి ఉమా అలైఖ్య 120వ ర్యాంకు సాధించి అగ్రస్థానంలో నిలిచారన్నారు. టిడివిఎస్ఎస్ నయమంజరి 161, బి. భార్గవి 202, ఎండి అనిష ముష్కాన్ 232, సరోజ్ రాజ్ పురోహిత్ 384వ ర్యాంకు సాధించారని తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను హార్వెస్ట్ విద్యా సంస్థల కరస్పాండెంట్ , ప్రిన్సిపాల్ , అధ్యాపక బృందం అభినందించారు.

## రెజొనెన్స్ విజయభేరి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఇంజనీరింగ్ ఫలితాల్లో రెజొనెన్స్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి విజయభేరీ మ్రోగించారు. ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో ఎ. జాహ్నవి 961, టి. బిందు 1364, బి. హన్సిక 1842, కె. జశ్వంత్ 2135, ఎం. సుమంత్ 2615, ఎ. నంద 3016, ఎం. ప్రేమ్‌సాయి 4500, డి. హన్సిక 5005, బి. ఈశ్వర్ వెంకట్ 5034, బి. మాధవి 5855, ఐ. మణిదీప్ 6632, బి. ప్రసాద్ 7851, బి. భగత్ 8185, డి. ఉషశ్రీ 8268, జే. స్వాతి 8328 వంటి ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు ఆర్‌వి నాగేంద్రకుమార్, కె. శ్రీధర్‌రావు, ప్రిన్సిపాల్ సతీష్, భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

## శ్రీచైతన్య ప్రభంజనం




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎప్‌సెట్ పరీక్షా ఫలితాల్లో ఖమ్మం శ్రీచైతన్య విద్యార్థులు ఇంజనీరింగ్, అగ్రికల్చర్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారు. శ్రీచైతన్య కళా శాల విద్యార్థి వి. కుషాల్ రాష్ట్ర స్థాయి 28వ ర్యాంకు, వై. నిషాంత్ రాష్ట్ర స్థాయి 61వ ర్యాంకు సాధించారు. అదేవిధంగా శ్రీచైతన్య విద్యార్థులు డి. దుర్గ గుజిరి 222, ఎ. సాయితేజ 253, కె. శివాణి వాగ్దేవి 301, బి. రిషిత 321, ఆర్. జ్యోత్స్నవ్ కుమార్ 334, కె. సాయి విద్యావర్షిత 423, జి. సాయిప్రణవి 491, కె. హాసిని 575, వి. ప్రణతి 653, కె. తేజస్విని 653, బి. ఈశ్వర్ గుప్తా 855, యు. వశిష్ట్ 908, బి. మణిశేషు 968, డి. శ్రీలేఖ 1195, పి. స్మైలికారెడ్డి 1262, కె.నిషాంత్ రెడ్డి 1394, ఎల్. మనోహర్ 1422, జి. అక్షయ 1482 వంటి ఉత్తమ ర్యాంకులు సాధించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారు. రాష్ట్ర స్థాయిలో 100 లోపు రెండు, 500 లోపు తొమ్మిది, 1000 లోపు ర్యాంకులు 15, 2000లోపు 24 ర్యాంకులు, 5000 లోపు 57, 10వేల లోపు 144 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారు.

## రేపు పాలీసెట్ పరీక్ష ఏర్పాట్లు పూర్తి

**ప్రజాపక్షం/భద్రాచలం:** ఈనెల 13వ తేదిన నిర్వహించనున్న పాలీసెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ జాన్‌మిల్టన్ ఆదివారం ఆయన "ప్రజాపక్షం" తో మాట్లాడుతూ మంగళవారం మొత్తం 719 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. ఉదయం 11 గం. నుండి మధ్యాహ్నం 1 గం. వరకు జరిగే ఈ పరీక్షకు విద్యార్థులను 1 గం. ముందునుండే పరీక్షా కేంద్రానికి అనుమతిస్తామని చెప్పారు. కానీ ఒక్క నిమిషం ఆలస్యమైనా సెంటర్లోకి అనుమతి లేదన్నారు. హాల్‌టిక్కెట్, హెచ్‌బి పెన్సిల్, బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్నులు మాత్రమే తీసుకురావాలని, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావడం నిషేదం అన్నారు. హాల్‌టిక్కెట్‌పై ఫోటు సరిగా లేని విద్యార్థులు గెజిటెడ్ ఆఫీసర్ ద్వారా ఫొటోను ధృవీకరించుకోవాలని ఆయన చెప్పారు.

# కొత్త తరహా ఇందిరమ్మఇండ్లు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:**ఇల్లు కట్టాలంటే మామూలు ప్రయాస కాదు. సిమెంట్, ఇనుము, కూలీల ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ క్రమంలో ఇంటి నిర్మాణ ధరలు సామాన్యునికి అందుబాటులో లేవు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షలు ఇస్తున్నప్పటికీ ప్రస్తుత ముడిసరుకు రేట్లతో ఆ డబ్బులతో ఇంటిని నిర్మించ లేక పోతున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలు సరిపోవడం లేదని, మరికొంత పెంచాలని ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నారు. దీంతో ప్రభుత్వం ఒక డుగు ముందుకేసి షేర్‌వెల్ టెక్నాలజీ నూతన పద్దతుల్లో అదే ధరకు ఇందిరమ్మ ఇంటిని సరి కొత్తతరహాలో నిర్మించి ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.



**కొత్తతరహాలో ఇందిరమ్మఇండ్లు:**పేదలకు గూడు కల్పించాలనే సంకల్పంతో కొత్తతరహాలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో నూతన షేర్‌వెల్ టెక్నాలజీతో కూడినఇండ్లను పైలెట్ ప్రాజెక్టు క్రింద నిర్మించారు. ఈ ఇళ్లను లబ్ధిదారులకు చూపించి ఈ తరహా ఇండ్లుతమ ఇష్టపూర్తిగా నిర్మించుకుంటే నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెబుతున్నట్లు తెలుస్తోంది. కాగా ఈ తరహా ఇంటిని కేవలం 15 రోజుల్లోనే పూర్తి చేసి అందిస్తారు. 30 ఏళ్ల వరకు మన్నిక ఉంటుంది. పెద్దపెద్ద అపార్ట్‌మెంట్లు, విల్లాలు, బహుళ అంతస్థుల భవనాలు దేశవ్యాప్తంగా ఇదే తరహాలో నిర్మాణాలు చేపడుతున్నారు.

**ఇటుకలు, ఇనుము లేకుండా:** కొత్తపద్దతుల్లో నూతన ఇళ్లు ఇటుకలు, ఇనుము లేకుండా నిర్మిస్తారు. షేర్‌వెల్ టెక్నాలజీ ద్వారా అల్యూమిలియం ఫ్రేమ్‌లు సిద్ధం చేసి వాటిలో కాంక్రీట్ నింపి గోడలు సిద్ధం చేస్తారు. దీంతో ఇటుకలు వాడే పని తగ్గుతుంది. మరో ప్రక్క ఇనుము పెద్దగా ఖర్చు కాదు. అదే విధంగా స్లాబ్ విషయంలో ఇదే తరహా పద్దతిని పాటిస్తారు. స్లాబ్ లెవల్లో రూఫ్‌కి షీట్ అమర్చి దానిపై ఇనుముతో మామూలు స్లాబ్ వేసేలా నిర్మాణాన్ని చేస్తారు. ఆ తరువాత 6 అంగులాల మందంలో కాంక్రిట్ వేసి స్లాబ్ పూర్తి చేస్తారు. ఇంటిలో పలి భాగంగా గోడలు నున్నగా ఉండేలా సిద్ధం చేశారు. యూపివిసి గడపలు,తలుపులు,కిటికిలతో సిద్ధం చేస్తారు. దీనికి ప్రభుత్వం ఇచ్చే రూ. 5 లక్షల సరిపోయే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. కాగా ప్రభుత్వం నిబంధనల ప్రకారం 400 నుండి 600 గజాల్లోనే ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకోవాలని ప్రభుత్వం చెబుతుండటంతో ఈ కొత్త టెక్నాలజీ అందుకు అనుగుణంగాఉంటుందని పలువురు నిపుణులు వాదన.

**ఆసక్తిచూపుతున్న జనం :** షేర్‌వెల్ టెక్నాలజీలో ఇంటిని నిర్మించుకునేందుకు ఆయా జిల్లాల్లో జనం ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఎక్కువ విస్తీర్ణంలో అప్పులు చేసి ఇంటిని నిర్మించుకున్నా ప్రభుత్వం నిధులు విడుదల చేయమంటూ తేల్చి చెప్పడంతో తక్కువ సమయంలో అయిపోయే ఇలాంటి ఇంటిని కట్టుకుంటే మేలని అంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వం షేర్‌వెలె టెక్నాలజీ ఇళ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పైలెట్ ప్రాజెక్టు క్రింద నాలుగు జిల్లాల్లో ప్రవేశపెట్టగా ప్రజల నుండి పెద్ద ఎత్తున స్పందన వస్తుండటంతో రాష్ట్రమంతా దీనిని అమలు చేసేందుకు చూస్తున్నారు. ఆసక్తిఉన్న వారు షేర్ వెల్ టెక్నాలజీ ఇంటిని కట్టుకుంటే ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా నిధులు విడుదల చేస్తుందని హౌసింగ్ కార్పోరేషన్ చెబుతోంది.



**తీరనున్న సొంతింటి కల:**పక్కా గృహాన్ని నిర్మించుకోవాలనే పేద కోరిక కొత్తరక టెక్నాలజీతో తీరేలా ఉంది. నెలలకు నెలలు ఇంటిని కట్టే పనిలో ఉండకుండా, ఎక్కువ డబ్బులు ఖర్చు చేయకుండా ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే ఇల్లు పూర్తి కానుండటంతో పేదల సొంతింటి కల తీరుతుందని పలువురు నిర్మాణరంగ నిపుణులు అంటున్నారు. దేశంలో బహుళ అతస్తుభవనాలన్నీ ఇదే పద్దతిలో కదుతున్నట్లు చెబుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండటంతో త్వరలో షేర్ వెట్ టెక్నాలజీతో కూడిన ఇళ్లను నిర్మించేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

## ఎప్‌సెట్ ఫలితాల్లో న్యూవిజన్‌దే అగ్రస్థానం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎప్‌సెట్ 2025 ప్రవేశాల కొరకు తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పరీక్షల్లో ఖమ్మం నగరంలోని న్యూవిజన్ జూనియర్ కళాశాల రాష్ట్ర స్థాయిలో ర్యాంకుల ప్రభంజనాన్ని సృష్టించి నెంబర్ వన్‌గా నిలిచిందని కళాశాలచైర్మన్ సిహెచ్‌జికె ప్రసాద్ తెలిపారు. ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో 102, 109, 110, 168, 171, 210, 311, 456, 492, 525, 534, 583 వంటి ఉత్తమ ర్యాంకులు తమ కళాశాల విద్యార్థులు సాధించారని ఆయన తెలిపారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్ విభాగంలో టి. సంహిత 102, ఎం. ఆకాంక్ష 109, ఆర్. సీతల్ 110, పి. ప్రణవ్ 168, ఆర్. షణ్ముకప్రియ 171, డి. అనన్య 210, ఎ. రోషిక్ మణిదీపక్ 311, ఎం. రోహన్ శ్రీహరి 456, జి. కార్తీక్‌సాయి 492, ఎం. వైష్ణవి 525, ఎస్. స్రవంత్ 534, పి. భవిష్య 583, పి. రోహిత్ 586, మిన్‌హాజ్ ఆరా 719, కె. జశ్వంత్ రామ్ 755, ఎన్. భార్గవ్ సాయి 844, ఎస్. మానాస్విక్ 1046, సిహెచ్ సాయికృష్ణ 1076, ఆర్. గుణదీప్ 1185, కె. మధుర హాసిని 1230, బి. పీయూష్ వర్ధన్ రాథోడ్ 1270, ఆర్. కౌషిక్ 1340, జి. లలని చౌదరి 1383, డి. నరసింహ లక్ష్మి నివాస్ 1430, ఈ. వేద సంహిత 1461, ఎం. విశ్వక్ 1514, షేక్ అంజుమ్ 1622, డి.ప్రణీత 1751, జి.అనుప్రియ 1756, సిహెచ్ శ్రీహస్ 1757, ఎం. చరణ్ వెంకట్ 1840, వి. జయకాంత్ 1849, ఎం.శ్రీహిత 1860 వంటి ఉత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్ విభాగం నుండి 616 మంది పరీక్షకు హాజరు కాగా వారిలో ఐదువేల లోపు 131 మంది విద్యార్థులు 10వేల లోపు 184 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు. జెఇఇమెయిన్స్ ఫలితాల్లో ఆలిండియా ఓపెన్‌కేటగిరిలో1765,కేటగిరీలో5వర్యాంకు,99.8 924843, 99 పైన 21 మంది విద్యార్థులు ఉత్తమ పర్సంటైల్‌తో ఆలిండియా ర్యాంకులను కైవసం చేసుకున్నారు.ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను చైర్మన్ , డైరెక్టర్ , అకాడమిక్ డైరెక్టర్ తదితరులు అభినందించారు.

## వృద్ధులపైకి దూసుకెళ్లిన కారు..

### డ్రైవర్ నిద్రమత్తు ప్రమాదానికి కారణం..



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**మండల పరిధిలోని బుగ్గపా డు గ్రామంలో ఆదివారం ఎర్టిగా కారు బీభ త్సం సృష్టించింది. ఇంటి బయట కూర్చుని మాట్లాడుకుంటున్న ఇద్దరు వృద్ధులపైకి కారు దూసుకెళ్ళటంతో తీవ్రగాయాల పాలయ్యారు వృద్ధులు. డ్రై వర్ నిద్రమత్తు ప్రమాదానికి కారణంగా తెలిసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... భద్రాచ లం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, చింతలపూడి మ ండలం, లింగగూడెం గ్రామానికి నూతన దంపతులతో వెళ్ళుతున్న ఎర్టికా కారు బుగ్గపాడు గ్రా మంలో ఇంటి బయట కూర్చున్న తాటి వీరమ్మ (65), గెద్దం చెన్నప్ప (70) అనే ఇద్దరు వృద్ధుల పైకి దూసుకెళ్ళిందని దీంతో, ఇద్దరు వృద్ధులకి తీ వ్ర గాయాలు అయ్యాయన్నారు. చెన్నప్పకు రెం డు కాళ్ళు విరగ్గా, వీరమ్మకు తీవ్ర గాయాలయ్యాయని తీవ్రంగా గాయపడిన ఇద్దరు వృద్ధులను హు టాహుటిన 108 వాహనంలో హా స్పటల్‌కు తరలి ంచారు. ప్రమాదానికి కారణం డ్రై వర్ నిద్రమత్తుతో ఉండటమేనని, డ్రైవర్ నిద్రలోకి జారుకోవటంతో ఒక్కసారిగా కార్ రోడ్ పక్క కు దూసుకెళ్లి ఇంటి ముందు కూర్చున్న వారిని ఢీ కొ ట్టటంతో ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిపా రు.

## ధాన్యం కొనుగోళ్లలో ఆందోళన వద్దు



**ప్రజాపక్షం/ చింతకాని :** ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని తడిసిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు మొక్కా శేఖర్‌గౌడ్ తెలిపారు. ఆదివారం జగన్నాథపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలను రైతులకు , ప్రజలకు వివరించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సబ్సిడీపై రైతులకు ట్రాక్టర్లు, పనిముట్లను ప్రభుత్వం అందించనుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమంటేనే రైతు ప్రభుత్వమని ఆయన తెలిపారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాను సస్యశ్యామలం చేయడమే కాంగ్రెస్, మంత్రుల లక్ష్యమన్నారు. బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ప్రైవేటు పరం చేయాలని చూస్తుందని చాలా సంస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. బిజెపి, బిఆర్ఎస్ రెండు ఒకటేనన్నారు. కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొప్పుల గోవిందరావు, ఆత్మ కమిటీ డైరెక్టర్ తోటకూరి ప్రగతి, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో స్నేహ సంబంధాలు మరింత మెరుగు

### బహుమతులు ప్రదానం చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:**క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని, శరీర ధృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కెసాబీర్ పాషా అన్నారు. మేడే సందర్భంగా సిపిఐ యూత్ ఆధ్వర్యంలో మల్కపురి శేఖర్ స్మారకార్ధకంగా నిర్వహించిన రెండు మండలాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రదానంలో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి గెలుపొందిన ఆళ్లపల్లి ఆరిఫ్ ఎలెవన్ టీంకు 20000రూపాయలు, షీల్డ్, ద్వితీయ బహుమతి గెలుపొందిన సంపత్ నగర్ టీంకు 15000రూపాయలు, షీల్డ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌లు క్రీడాకారులకు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఐ పార్టీ, యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో 38 జట్లు పాల్గొని స్నేహపూర్వకంగా ఆటలు ఆడారని వారందరికీ, మొదటి బహుమతి పొందిన ఆళ్లపల్లి టీంకు, ద్వితీయ బహుమతి పొందిన సంపత్‌నగర్ టీంకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. వ్యాపారస్తులు , సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ వైస్ ఎంపిపిరేసు ఎల్లయ్య, సిపిఐ గుండాల మ ండల కార్యదర్శి , ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి షాహిద్, సిపిఐ మ ండల సహాయ కార్యదర్శుడు కొమరం హనుమంతరావు, ఎఐటియుసి మండల అధ్యక్షుడు కుంట సహదేవ్, మండల నాయకుడు , క్రికెట్ మేనేజ్మెంట్ సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలు, ప్రజా పోరాటాలకు దిక్సూచి ఎర్ర జెండా

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి. అయోధ్య



**ప్రజాపక్షం/మణుగూరు:**పేద ప్రజలకు అండగా ఎర్ర జెండా నిరంతరం పని చేస్తుందని, వారి హక్కుల కోసం సిపిఐ పోరాడుతుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య అన్నారు. ఆదివారం ఉదయం సమితి సింగారం పంచాయతీ పరిధిలో మాదాడి సురేష్ ప్రాంగణంలో వేర్పుల నరేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బి.అయోధ్య హాజరై మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా నిత్యంసిపిఐ పోరాటాలు కొనసాగించామని, మణుగూరు అభివృధి లోసిపిఐ పాత్ర మరువలేనిదన్నారు. పేద ప్రజల కోసం ఎవరు పట్టించుకోరని, అధికారంలో వున్నా లేకున్నా పేద ప్రజల కోసంసీపీఐ పార్టీ గా పని చేస్తున్నమన్నారు. ఎన్నికల ముందు మాయ మాటలు చెప్పే నాయకుల మాటలు నమ్మవద్దని వారు హితవు పలికారు. సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జంగం మోహన్ రావు మాట్లాడుతూ ఎందరో త్యాగ మూర్తులు పార్టీ కోసం ఉన్న ఆస్తులను, భూములను త్యాగం చేశారని, పార్టీ కోసం నిలబడి జీవితాలను త్యాగం చేశారని, కాంగ్రెస్ పార్టీ కర్షకుల పక్షాన కార్మికుల పక్షాన పేదవారి గల పక్షాన నిరంతరం పోరాట కొనసాగిస్తూనే ఉంటుందని అలాంటి పార్టీలో పని చేయడం సంతోషమని ప్రజలు దీనిని ఆదరించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, రైతు సంఘం జిల్లా నాయకులు మంగి వీరయ్య, జిల్లా సమితి సభ్యులు ఎస్కే సర్వర్, సోందే కుటుంబరావు, మాజీ ఎంపిపిఎదారి రమేష్, సిపిఐ సీనియర్ నాయకులు రుద్ర నాగరాజు, మహిళా సమైక్య మండల అధ్యక్షు కార్యదర్శులు , మాజీ వార్డు మెంబర్లు , ఎఐటియుసి కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**మాతృ సంస్థలో చేరిన పోడుతూరి రాములు...** సిపిఐ పార్టీలో గతంలో పని చేసి కొన్ని కారణాల వల్ల బయటకు వెళ్లిన పోడుతూరి రాములు తిరిగి సమితి సింగారం జనరల్ బాడీ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు అయోధ్య సమక్షంలో ఆదివారం తిరిగి పార్టీలో చేరారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎంపి వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు



**ప్రజాపక్షం/ఇల్లెందు:**మండలంలోని దాసుతండాలో నూతన వధూవరులు మౌనికవినోద్, మాధవిసంతోశ్‌కుమార్‌లను రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవి చంద్ర, ఎమ్మెల్సీ తాతామధు, భద్రాద్రికొత్తగూడెం జిల్లా మాజీ గ్రంథాలయ ఛైర్మన్ దిండిగాల రాజేందర్ ప్రముఖులతో కలిసి హాజరై ఆశీర్వదించారు. మాజీ ఎమ్మెల్యే బాణోత్ హరిప్రియ భర్త హరిసింగ్ సోదరుడు పూల్‌సింగ్ కుమార్తెల వివాహవిందుకు వారి ఆహ్వానం మేరకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు అందజేశారు.

## అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలి

### సిపిఐ నేత ముత్యాల విశ్వనాథం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :**గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు తమవంతుగా సహకరించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. ఆదివారం సిపిఐ ప్రతినిధి బృంధం పాల్వంచ మండలంలోని దంతెలబోర, దంతెలబోర ఎస్సీ కాలనీ, సంగం, ఒడ్డుగూడెం, నారాయణరావుపేట, నాగారం, జగన్నాధపురం, బసవతారక కాలనీ, సోములగూడెం, లక్ష్మీ దేవిపల్లి, రేగులగూడెం,తుమ్మలగూడెం, ఉల్వనూరు, మందెరకలపాడు, మొండికట్ట, కిన్నెరసాని, యానంబైలు, పునుకుల, పుల్లాయిగూడెం, ప్రభాత్‌నగర్, పాండురంగాపురం, సురారం తదితర గ్రామాల్లో పర్యటించి సిసి రోడ్లు, డ్రైన్లు, మంచినీటి పైప్‌లైన్లు, వాటర్ ట్యాంక్‌లు తదితర అభివృద్ధి పనులను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ముత్యాల విశ్వనాధం మాట్లాడుతూ ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు చొరవతో ప్రభుత్వం అతిపెద్ద మొత్తంలో కొత్తగూడెం నియోజకవర్గానికి అభివృద్ధి నిధులు మంజూరు చేస్తోందని చెప్పారు. గ్రామాల్లో నెలకొన్ని సమస్యలపై ప్రజలు తమకు తెలియజేస్తే వాటిపై కూడా ఎంఎల్‌కు వివరించి నింధులు మంజూరు చేయించుకుందామని, రాబోయే నాలుగేళ్లలో నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్క మౌళిక సమస్య లేకుండా తీర్చుకుందామని చెప్పారు. జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యంగా నాణ్యత ప్రమాణాలు పాటిస్తునానార లేదా అనే దానిపై పర్యవేక్షణ చేయాలని, ఎక్కడి ఎలాంటి అవకతవకలు చోటు చేసుకున్నా వెంటనే ఫిర్యాదులు చేయాలని స్పష్టం చేశారు.సిపిఐ నాయకులు వీసంశెట్టి పూర్ణ చంద్రరావు, ఇట్టి వెంకట్రావు, రాంబాబుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## జంకు భయం లేని వీరోచిత వ్యక్తి మధుసూధన్‌రావు




**ప్రజాపక్షం/కొణిజర్ల :**శారీరకంగా బలహీనంగా మనకు కనిపించే వ్యక్తి సైద్ధాంతికంగా ఎంతో గొ ప్ప పట్టుదల కలిగిన మనిషి పోరాటాల్లో జంకు, భయం లేకుండా వీరోచింతంగా పోరాటం చేయగలిగి ధైర్యసాహసం ప్రదర్శించగలిన వ్యక్తి సంక్రాంతి మధుసూధన్‌రావు అని సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. మండల పరిదిలోని లాలాపురంలో సిపిఎం సీనియర్ నాయకులు సంక్రాంత్రి మధుసూధన్‌రావు సంస్మరణ సభ ఆదివారం సిపిఎం జిల్లా నాయకులు భూక్యా వీరభద్రం అధ్యక్షతన జరిగింది. ఈసభకు ముఖ్య అతిధిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. ఉద్యమాల్లో ఉన్న మనం ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని అటువంటి స్ఫూర్తికలిగిన కొంత మందిని కొత్తగా వ్యక్తులను మనం తయారు చేసుకొని ఉద్యమంలోకి తీసుకురావడం ఇప్పుడు మనం నిర్వహించాల్సిన కర్తవ్యం అని తెలిపారు. ఎన్ని సమస్యలు ఎన్ని ఉపద్రవాలు ఎన్ని అవాంతరాలు, అడ్డంకులు వచ్చినా కమ్యూనిస్టుపార్టీ సిద్ధాంతానికి కట్టుబడి పార్టీ అభివృద్ధికోసం మధుసూదన్ రావు కృషిచేశాడని కొనియాడారు. కాలపరిస్థితులు బా గలేకపోయినా వాటిని ఎదిరించి పోరాడ టం అ నేది కమ్యూనిస్టు లక్ష్యం అని అన్నారు. కార్యక్రమ ంలో సిపిఎం కేంద్రకమిటి స భ్యులు , కాంగ్రెస్‌పా ర్టీ పార్లమె ంట్ సభ్యులు , వైరా మాజీ శాసన స భ్యులు , సిపిఎం నాయకులు ,సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలు అందుకోవాలి

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ఏజెన్సీలో విద్య కుసుమాలు విద్యార్థులు పట్టుదలతో చదువుకొని ఉన్నత శిఖరాలు అందుకోవాలని మండల విద్యాధికారి వజ్జ తిరుపతి అన్నారు. మండలంలోని రాయినిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏజెన్సీలోని అంకన్నగూడెం, జెగ్గన్నగూడెం సర్వాపూర్, పెగడపల్లి కొత్తూరు, యాపలగడ్డ, పంచోతుక్కులపల్లి గ్రామాల్లోని టెన్త్, ఇంటర్ మెరిట్ విద్యార్థులను సిపిఎం ఏజెన్సీ కమిటీ కార్యదర్శి గుండెబోయిన రవి గౌడ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి వజ్జ తిరుపతి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ ఎవరు దోచుకొని ఆస్థి ఒక చదువు మాత్రమేనని అన్నారు. 20 మంది మెరిట్ విద్యార్థులను ఎం ఇఒ ఆత్మీయ సన్మానం చేయడం జరిగింది. విద్యావంతుల వేదిక నాయకులు వజ్జ రాజు, సిపిఎం నాయకులు కొర్ర రాజు, తవిటి నారాయణ, కల్తీ నవీన్, ప్రజా సంఘాల నాయకులు గుండెమీది వెంకటేశ్వర్లు, గొంది సాం బయ్య, వివో సంఘం అధ్యక్షురాలు వంక ఐశ్వరయ్య, తవిటి లక్ష్మి, ఉప సర్పంచ్ తవిటి విజయ, పావని, శ్రీలతతో పాటు 40 మంది పాల్గొన్నారు.

## నేటి ప్రజావాణి కార్యక్రమం తాత్కాలిక రద్దు

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** జిల్లా యంత్రాంగం కాళేశ్వరం లో జరిగే సరస్వతి పుష్కరాల విధుల నిర్వహణలో నిమగ్నమై ఉన్నందున జిల్లా ఐడిఓసి కార్యాలయంలో సోమవారం నిర్వహించబోయే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించి ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు ఇవ్వడానికి కలెక్టరేట్ కు రావొద్దని ఆయన సూచించారు.

## బాధిత కుటుంబాలకు మంత్రి సీతక్క పరామర్శ



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ములుగు మండలం పందికుంట కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుండ యాదగిరి తండ్రి ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని, అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాతతతయకులు నల్ల కోమల్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనను, ములుగు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రవీందర్‌రావు తండ్రి ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పరామర్శించి ఆర్థికసాయం అందించారు.జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్‌లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,పాల్గొన్నారు.

## కస్తూర్బా స్కూల్లో దొంగల హల్‌చల్

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** మండల కేంద్రంలోని గ్రామశివారులో కస్తూరిభా గాంధీ పాఠశాలలో రాత్రి గుర్తు తెలియని దొంగలు విలువైన వస్తువులను దొంగిలించుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీదేవి తెలిపిన వివరాల ప్రకారం కస్తూర్బా గాంధీ పాఠశాలలో తాళాలు పగులగొటి సిసి కెమెరా, మానిటర్, హార్డ్ డిస్క్ దింగిలించుకుపోయారన్నారు. వాటి విలువ సుమారు రూ.2లక్షల 60వేల విలువ ఉంటుందన్నారు. కెజిబివి పాఠశాల ప్రిన్సిపల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ శ్రీదేవి తెలిపారు.

## క్షణికావేశంలో యువకుడి ఆత్మహత్య

**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన బట్టు అజయ్ 21సంవత్సరాలు క్షణికావేశంలో ఉరేసుకుని మృతి చెందాడని ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బట్టు అజయ్ తల్లిదండ్రులు చిన్నతనంలోనే మృతి చెందగా అతని పాలన పెంపకం నానమ్మ తాతయ్యలు చూసుకునేవారు. అజయ్ సుతారి పని చేస్తూ ఉండేవాడు. శనివారం సా:6:30 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చిన అజయ్ ని ఎక్కడ తిరిగి వస్తున్నావు అనడంతో నాకు ఈ మా త్రం స్వేచ్ఛ లేదా అంటూ క్షణికావేశంలో ఇంట్లోకి వెళ్లి చీర మీద కట్టుకొని ఉరి వేసుకొని మృతి చెందినట్లు మృతుడు అజయ్ అక్క బట్టు శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుంనామని ఎస్సై మహేందర్ తెలిపారు.

## ఎన్‌సిసి క్యాంపులో బాలాజీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం / నర్సంపేట :** ఎన్.సి.సి తెలంగాణ పదవ బెటాలియన్ ఆధ్వర్యంలో అన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ 01మే నుండి 10మే వరకు హసన్ పర్తి లోని గ్రీన్ వుడ్ హై స్కూల్లో నిర్వహించడం జరిగింది. ఈ క్యాంపులో బాలాజీ స్కూల్ విద్యార్థులు 41 మంది పాల్గొని వారి ప్రతిభను ప్రదర్శించడం జరిగింది. క్యాంపులో డ్రిల్, ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, లీడర్షిప్ , మోటివేషన్ ఆక్టివిటీస్, కల్చరల్ ఆక్టివిటీస్, స్పోర్ట్స్ తదితర అంశాల్లో బాలాజీ స్కూల్ విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను కనబరిచారు. ఎన్‌సిసి వరంగల్ గ్రూప్ కమాండర్ సచిన్ నింబాల్కర్ వీర్ చక్ర చేతుల మీదగా టి.ఆధ్య క్యాంపులో బెస్ట్ మోటివేటర్‌గా సర్టిఫికెట్ అందుకున్నారు. అన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ కమాండెంట్ కల్నల్ సంథిల్ రామదురై, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ రవి సున్హరే, క్యాంప్ అడ్జిడెంట్ లెఫ్టినెంట్ విష్ణువర్ధన్ రెడ్డి, ఫస్ట్ ఆఫీసర్ రాధాకృష్ణన్, థర్డ్ ఆఫీసర్ రియాజుద్దీన్, ధనుంజయ్, కృష్ణ, సజీని, భవాని తదితర ఆఫీసర్లు ప్రతిభ చూపించిన కాడేట్స్‌ను అభినందించారు. బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ రెడ్డి , ట్రెజరర్ వనజ, సెక్రెటరీ రాజేశ్వర్ రెడ్డి, బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ పి.రాజేంద్ర ప్రసాద్ ప్రతిభ చూపిన ఎన్.సి.సి కాడేట్ లను, బాలాజీ టెక్నో స్కూల్ ఎన్.సి.సి థర్డ్ ఆఫీసర్ ఎం.డి రియాజుద్దీన్ ను అభినందించారు.

## ప్రభుత్వాన్ని వాడుకుంటే చర్యలు



**ప్రజాపక్షం/మంగపేట:** మండలంలో మంత్రి సీతక్క పేరు తో ఎవరైనా అధికారుల వద్ద వాడుకుంటే తప్పకుండ చర్యలు తీసుకోవాలి అని జిల్లా ఎస్‌పిని ఆదేశించిన మంత్రి సీతక్క గిరిజన సొసైటీలపై ఇసుక కాంట్రాక్టర్లు ఒత్తిడి లేకుండా పద్ధతి ప్రకారం నడుచుకోవాలి. రూల్ టూ రూల్ కచ్చితంగా కాంట్రాక్టర్లు నడుచుకోవాలి. మంత్రి సీతక్క ఎదుగుదల సీతక్కకు రోజు రోజుకి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక కావాలనే కొంతమంది విషం చిమ్ముతున్నారు. జిల్లాలో గిరిజన సొసైటీలు వారికి అనుగుణంగా ఉండే రైజింగ్ కాంట్రాక్టర్లతో పని చేయించుకుంటారు. అంతే కానీ మంత్రి చెప్పారు అని మేము మంత్రి మనుషులం అని జిల్లా లో ఎక్కడ అయినా మంత్రి సీతక్క పేరు వాడుకోవాలి అని చూస్తే ఉపేక్షించేది లేదు అని తెలియజేస్తూ ఎవరైనా మంత్రి సీతక్క పేరు గాని జిల్లా అధ్యక్షులు అశోక్ పేరు గాని మా యువనాయకుడు సూర్య పేరు ఏ కాంట్రాక్టర్ అయి నా అధికారుల వద్ద ఉపయోగించాలి అని చుసిన అధికారుల వద్ద వాడిన వెంటనే వారి పై చట్టపరమైన కేసులు నమోదు చేయాలి అని ఇది వరకే జిల్లా ఎస్పిని అదేశించడం జరిగింది. కనుక ఏ ఊరిలోనైనా గిరిజనుల ఉ పాధి కోసం ఏర్పాటు కాబోయే గిరిజన సోసైటీలపై ఎవరి పెత్తనం లేకుండా స్వేచ్ఛగా వారి ఇష్టం మేరకే సొసైటీ లు నడవాలి ఇసుక కాంట్రాక్టర్లు చట్టపరమైన పద్ధతి గా నడుచుకోవాలని జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ కర్రీ నాగేంద్రబాబు ఓ ప్రకటన లో తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో నృసింహ జయంతి

**ప్రజాపక్షం/నెక్కొండ:** ఆదివారం నృసింహ జయంతి పురస్కరించుకొని వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని పలు గ్రామాలలో గల లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ప్రార్థన చేశారు. గీసుకొండ మండలంలోని కొమ్మాల పుణ్యక్షేత్రాం లో జరిగే హోమాలకు భక్తులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ముదిగొండ గ్రామానికి చెందిన నవీన్ శాస్త్ర మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారు మనసు ప్రశాంతత కోసం ప్రతినిత్యం లక్ష్మీ నరసింహ స్వామి స్తోత్రం ఉగ్రం వీరం మహా విష్ణుం జ్వలంతం సర్వతో ముఖం నరసింహం బిషణం భద్రం మృత్యోం మృత్యుం నమామ్యహం, అని ప్రతినిత్యం పఠించాలని ఆయన అన్నారు.

# స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** భూపాలపల్లి కోల్ బెల్ట్ ప్రాంత యువత స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా ఇచ్చే శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. ఆదివారం భూపాలపల్లిలోని సింగరేణి ఏరియా వర్క్ షాప్ ఎదురుగా ఉన్న ఎస్‌డిటిసి ఆవరణలో ఎమ్మెల్యే జీఎస్సార్ ప్రత్యేక చొరవతో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ భూపాలపల్లి ఏరియా వారి సహకారంతో స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్‌ను సింగరేణి సిఅండ్‌ఎండి ఎన్.బలరాం తో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభా వేదికలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, సిఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోపే నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ట్రైనింగ్ సెంటర్ ద్వారా చదువుకున్న నిరుద్యోగ యువతకు శిక్షణను ఇస్తున్నట్టు తెలిపారు. ఈ ట్రైనింగ్ సెంటర్ లో మొత్తం 38 రకాల కోర్సుల్లో అభ్యర్థులకు శిక్షణ ఉంటుందని, శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ సమస్యను ఎదుర్కొనేందుకు యువతకు వివిధ రంగాల్లో స్కిల్ యూనివర్సిటీ శిక్షణ ఇస్తుందని, స్కిల్ డెవలప్మెంట్‌కి సీఎం రేవంత్ రెడ్డి అధికంగా ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. దేశంలో నిరుద్యోగమే పెద్ద సమస్యగా మారిందని, ఉద్యోగాలు లేక యువత మాదక ద్రవ్యాలకు బానిస అవుతుందని అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కష్టపడి చదివి డిగ్రీ పట్టాలు పొంది బయటకు వచ్చిన యువతకు సరైన స్కిల్స్ ఉండటం లేదని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు.ఈ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా యువత ఉద్యోగాలకి అవసరమైన నైపుణ్యాలను నేర్చుకుని ఉద్యోగాల్లో స్థిరపడాలని కోరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేకు సింగరేణి అధికారులు శాలువా కప్పి సన్మానం చేశారు. అంతకు ముందు స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ప్రాంగణంలో ఎమ్మెల్యే మొక్క నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఏరియా జిఎం ఏ.రాజేశ్వర్ రెడ్డి, సింగరేణి గుర్తింపు సంఘం ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, ఐఎన్‌టియుసి నాయకులు పసినూటి రాజేందర్, జోగబుచ్చయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పిప్పాల రాజేందర్, బుర్ర కొమురయ్య, అప్పం కిషన్, మాజీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, శిరుప అనిల్, సింగరేణి అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పుష్కరాల భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయాలి:ఎమ్మెల్యే గండ్ర

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ఈ నెల 15 నుండి 27 వరకు కాలేశ్వరం లో నిర్వహించే సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. ఆదివారం భూపాలపల్లి మండలం కమలాపూర్ క్రాస్ వద్ద భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులు, నాయకులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలేశ్వరంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా భూపాలపల్లి మండలం కమలాపుర్ క్రాస్ వద్ద సరస్వతి పుష్కరాలకి విచ్చేయుచున్న భక్తులకి అన్నదానం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. స్థానిక నాయకులు ఆర్టిఏ మెంబర్ సుంకరి రామచంద్రయ్య, భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్, నాయకులు బుర్ర కొమురయ్య, తోట సంతోష్, రంజిత్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## కమ్యూనిస్టు ఉద్యమం బలోపేతం కావాలి

### పార్టీ సీనియర్ నాయకులు నేదునూరి రాజమౌళి



**ప్రజాపక్షం/హసన్ పర్తి :** దేశంలో ప్రజాస్వామ్యం లౌకికవాదం రక్షింపబడి సామాజిక న్యాయం అందరికీ అందాలంటే బలమైన కమ్యూనిస్టు ఉద్యమం బలోపేతం కావాల్సిన ఆవశ్యకత ఉందని సిపిఐ సీనియర్ నాయకులు నేదునూరి రాజమౌళి తెలిపారు.ఆదివారం హసన్ పర్తి మండలం సుబ్బయ్య పల్లె గ్రామంలో వస్కుల భరత్ అధ్యక్షతన సిపిఐ శాఖ మహాసభ జరిగింది. ఈ మహాసభ కు ముఖ్యఅతిథిగా సిపిఐ సీనియర్ నాయకులు నేదునూరి రాజమౌళి హాజరై మాట్లాడుతూ మే 26న హసన్ పర్తి హై స్కూల్ ఆవరణంలో సిపిఐ జిల్లా మహాసభల సందర్భంగా గొప్ప బహిరంగ సభ జరుగుతుందని, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే మే 27న శుభమస్తు గార్డెన్ లో మహాసభ 300 మంది ప్రతినిధులతో జరుగుతుందని తెలిపారు.ఈ సభలలో హనుమకొండ జిల్లా సమగ్ర అభివృద్ధి కొరకు పోరాట రూపకల్పన చేయడం,నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా హాసన్ పర్తిని శాసనసభ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో హసన్ పర్తి శాసనసభ నియోజకవర్గంగా ఉండేదని పాలకుల స్వార్థంతో నియోజకవర్గాన్ని మార్చారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్యారెంటీలు ఆటో కార్మికులకు సంవత్సరానికి 15000, విద్యార్థినీలకు స్కూటీలు, ఆడపిల్లల పెండ్లికి తులం బంగారం, సన్న వడ్లకు 500 బోనస్, వృద్ధులకు, వికలాంగులకు వితంతువులకు డబుల్ పింఛన్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల ఐకెపి కేంద్రాల్లో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేయాలన్నారు. సిపిఐ హాసన్ పర్తి మండల కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ బలమైన శాఖల నిర్మాణం ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు.సమావేశానికి ముందు పుట్ట రాజు జండా ఆవిష్కరణ చేశారు.నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవడం జరిగింది. సుబ్బయ్య పల్లి గ్రామ శాఖ కార్యదర్శిగా పుట్ట రాజు, కమిటీ సభ్యులుగా పుట్ట ప్రశాంత్ శేఖర్, పుట్ట లక్ష్మ ణ్, పుట్ట మనోజ్, రాళ్ల బండి రాజు, సుంచు బన్నీ, పుట్ట రవీందర్, చుంచు కొమురయ్య, పుట్ట తిరుపతి ఎన్నుకొనడం జరిగింది.

## చదువు, కళలు కేరాఫ్ అడ్రస్ ప్రభుత్వ బడులు

### జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** చదువు, కళలు కేరాఫ్ అడ్రస్ ప్రభుత్వ బడులు నిలిచాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లోను విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు వ్యక్తిత్వాన్ని మెరుగుపరుచాలని ప్రభుత్వం వేసవి శిక్షణా శిబిరాలకు శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాలోని కెజిబివి చౌడారంలో మే 5వ తేదీన ప్రారంభమై నివాస వేసవి కాల శిబిరం 15రోజుల పాటు జరుగుతుందన్నారు.15 రోజుల పాటు నృత్యం, సంగీతం, క్రీడలు, యోగా, స్పీడ్ మ్యాథ్స్, స్పోకెన్ ఇంగ్లీష్ వంటి కార్యచరణల్లో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణకి హాజరవుతున్న విద్యార్థులకు స్నాక్స్ కూడా అందిస్తున్నామన్నారు.

## అర్హులైన వారందరికీ ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలి

### బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు

**ప్రజాపక్షం / వరంగల్ ప్రతినిధి :** రాష్ట్రంలో ఆసరా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికీ వెంటనే మంజూరు చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భర్తలు చనిపోయిన వితంతువులు, ఒంటరి మహిళలు, 57 సంవత్సరాలు నిండిన వృద్ధులు, వికలాంగులు, చేనేత, కల్లుగీత, బీడీకార్మికులు లక్షలాదిమంది ఆసరా పెన్షన్ల కోసం దరఖాస్తులు పెట్టుకొని సంవత్సరాల తరబడి ఆఫీసుల చుట్టూ తిరుగుతూ అధికారుల వద్ద మొరపెట్టుకున్న చెవిటివాని ముందు శంఖం వూదినట్లే ఉందన్నారు. పెన్షన్లు మంజూరి కాక అనేక ఆర్థిక ఇబ్బందులతో వారు పడుతున్న బాధలు వర్ణణతీతం అన్నారు. పెన్షన్ రాకముందే చాలా ఉంది చనిపోతున్న సంఘటనలు జరుగుతునాయన్నారు శాసనసభ ఎన్నికల ముందు సామాన్య ప్రజలకు, పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఎఫ్ సెట్ ఫలితాలలో షైన్ విజయకేతనం



**ప్రజాపక్షం/హనుమకొండ :** ఎఫ్‌సెట్ 2025 ఎంట్రన్స్ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో 181, 277, 1279 ర్యాంకులను సాధించి కార్పొరేట్ విద్యా సంస్థలకు సమానంగా ఫలితాలను అందజేయడం జరిగిందని షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్, డైరెక్టర్లు మూగల రమ, మూగల రమేష్ సంయుక్తంగా తెలియజేశారు. ఆదివారం విడుదల చేసిన ఎఫ్ సెట్ 2025 ఎంట్రన్స్ ఫలితాలలో షైన్ జూనియర్ కాలేజి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడం చాలా సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. షైన్ విద్యాసంస్థలు మొదటి నుండి జెఇఇ. మెయిన్స్, ఎఫ్‌సెట్, నీట్‌లలో అత్యుత్తమమైనటువంటి శిక్షణను వరంగల్‌లో అందించడం జరుగుతుందని వారు తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులను సైతం చక్కటి అకాడమిక్ ప్రోగ్రామింగ్, ప్రణాళికల ద్వారా అద్భుతమైన ఆణిముత్యాలుగా తయారు చేసి రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ కేటగిరిలో 181 ర్యాంకు సాధించిన డి.ఇందు, 277 ర్యాంకు సాధించిన కె.సహస్ర,227 ర్యాంకు సాధించిన బి.సంధ్య, 2963 ర్యాంకు సాధించిన ఎం. రమ్య, 4879 ర్యాంకు ఇ .సాహితి, ఇంజనీరింగ్ క్యాటగిరిలో 1279 ర్యాంకు సాధించిన పి. శ్రీమహేష్. ఎమ్. వరుణ్ సందేశ్ 3153 , సిహెచ్ సిరి సహస్ర 4133 ర్యాంకు, కె. కస్తూరి 5741 ర్యా,కు, కె.చాణక్య 5962, కె.విష్ణు 6915 , జి.నిగమ 7009, ఎస్ శ్రీ చైతన్య 8162, ఎం.సుశాంత్ 8795 ర్యాంకు సాధించడం జరిగిందన్నారు. వీరితోపాటుగా అగ్రికల్చర్ కేటగిరిలో 23 మంది విద్యార్థులు 20 వేలకు లోపు ర్యాంకులు, ఇంజనీరింగ్ కేటగిరిలో 31 మంది విద్యార్థులు 20వేలకు లోపుర్యాంకులు సాధించారని చైర్మన్ మూగల కుమార్ యాదవ్ తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నిరంతర పర్యవేక్షణ, మోటివేషన్‌తో మామూలు విద్యార్థులను కూడా మెళికలు తిరిగిన విద్యార్థులుగా తీర్చిదిద్దడం జరుగుతుందని, ప్రతి విద్యార్థిపైన వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవడం వలనే ఈ విజయాలు సాధించారని వారు పేర్కొన్నారు. ఈ విజయాలకు తోడ్పడిన తమ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో షైన్ విద్యా సంస్థల కళాశాలల ప్రిన్సిపాల్స్ మారబోయిన రాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సంధ్య, ప్రశాంత్, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎస్‌ఆర్ ప్రభంజనం



**ప్రజాపక్షం/హనుమకొండ :** ఆదివారం వెలువడిన టిజి ఎఫ్‌సెట్ 2025 ఫలితాలలో ఎస్‌ఆర్ విద్యాసంస్థలకు చెందిన వి.నాగసిద్దార్థ, ఎంపిసి విభాగంలో రాష్ట్ర స్తాయి లో 32వ ర్యాంకు సాధించి రాష్ట్రం లో ఎస్‌ఆర్ విజయ పథాన్ని ఎగురవేసారు. అదే విధంగా మేడ కా ర్తీక్ ఎంపిసి విభాగంలో రాష్ట్ర స్థాయిలో 234 ర్యాంకు, జోగు అధిరామ్ ఎంపిసి విభాగంలో రాష్ట్ర స్థాయిలో 471 ర్యాంకు, ఎం.వినయ్ బైపిసి విభాగంలో రాష్ట్ర స్థాయిలో 149 ర్యాంకు, ఎండి అబ్దుల్లా మోయినొద్దిన్ బైపిసి విభాగంలో రాష్ట్ర స్తాయిలో 162 ర్యాంకు సాదించి రాష్ట్రంలో ఎస్ ఆర్ విజయపథాన్ని ఎగురవేసారు. ప్రస్తుత పరిస్థితులలో విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటిని ఆచరణ పరుస్తూ తమ విద్యార్థులకు చక్కటి సృజనాత్మకతతో కూడిన విద్యను అందిస్తున్నామని ఈ సందర్భంగా ఎస్‌ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి తెలిపారు. టిజి ఎఫ్‌సెట్ లో విద్యార్థులు సాధించిన ఈ విజయాలకు సంతోషాన్ని తెలియజేస్తూ ఎస్‌ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్ రెడ్డి,సంతోష్ రెడ్డి, భవిష్యత్లో మరింత అత్యుత్తమైన ర్యాంకులు సాధించేలా తీర్చిదిద్దుతామని ఆశాభావా న్ని వ్యక్తీకరించారు. గత 50 సంవత్సరాలలో పటిష్టమైన ప్రణాళికలతో హై స్కూల్, జూనియర్ కాలేజీ, ఎంసెట్, ఐఐటీలలో విద్యనందిస్తూ ప్రతి సంవత్సరం రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. జేఈఈ మేయిన్ 2025లో జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించారని, ఈ ఫలితాలు విద్యార్థులందరికి స్పూర్తిదాయకం కావాలని ఆకాంక్షించారు.

## ఎఫ్‌సెట్ ఫలితాలలో 'శివాని' విశ్వరూపం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఆదివారం ప్రకటించిన టిజి ఎఫ్‌సెట్ 2025 ఫలితాలలో శివాని కళాశాల విశ్వరూపం ప్రదర్శించింది.కళాశాలలో చదువుతున్న అరికెల నిసి 1309, ఆరె హాసిని 1352, కోరె ఓమ్ చందర్ 2592, పాడి శ్రీవాణి 2785, గుగులోతు తరుణ్ 3299, గుగులోతు రమేష్ 3988, సల్మా 4527, వారం లక్ష్మ ణ్ 4533, చంద్రశేఖర్ 6680, దాడి నవ్య 6779, వై.సింధు 8189, వి.ఆదిత్య 8697, జి.చందన 8981, బి.సింధు 9016,కె.వర్ష 9297, ఎల్ జీవన్ 9971, వి.అనూష్న 10223, పి.హర్షవర్ధన్ 10409 ర్యాంకులు సాధించారని శివాని విద్యార్థిని విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ టి స్వామి తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా పలితాలను సాధిస్తూ ఆదివారం ప్రకటించిన టిజి ఎఫ్‌సెట్ 2025 ఫలితాలలో మరోసారి చరిత్రను తిరగరాస్తూ విభాగాలలో మంచి మార్కులు సాధించిన శివాని విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ టి. స్వామి, ప్రిన్సిపల్స్ జి. సురేందర్ రెడ్డి, వి. చంద్రమోహన్, డైరెక్టర్లు టి. రాజు, ఎస్.రమేష్, ఎ. మురళీధర్, వి. సురేష్, ఎస్. సంతోష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ విజయానికి సహకరించిన కళాశాల అధ్యాపకులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలియజేశారు.


## ఘనంగా శ్రీకంఠ మహేశ్వరస్వామి ఉత్సవాలు

**ప్రజాపక్షం/ఖానాపూర్:** మండల కేంద్రంలో ఖానాపురం గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కంఠ మహేశ్వర స్వామి సురమాంబ దేవి, శ్రీ రేణుక ఎల్లమ్మ, వనం మైసమ్మ, పండగ ఉత్సవాలు రెండవ రోజు ఘనంగా కొనసాగాయి. గౌడ్స్ తెల్లని పంచె, తెల్లని బనియన్, తెల్ల కండువాలను ధరించి జల బిందెను ఎత్తుకొని మహిళలు నూతన పసుపు పచ్చని చీరెలు ధరించి మంగళహారతులతో డప్పు వాయిద్యాల నడుమ ఆటపాటలతో తాటివనంలోని శ్రీ కంఠ మహేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. పూజారి నరేష్ ఆధ్వర్యంలో గౌడ దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించి కంఠ మహేశ్వర స్వామి సురమాంబ, రేణుక ఎల్లమ్మ, వనం మైసమ్మ, నాగదేవత ఆలయంలో విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు. మూడవ రోజు సోమవారం గౌడ కుల ఆరాధ్యదైవం శ్రీ కంఠ మహేశ్వర స్వామికి బోనం రెండవ బోనం శ్రీ రేణుక ఎల్లమ్మకు సమర్పించనున్నారు. మత్త గొలుపుట, గావు పట్టుట, బలి వేయుట, పట్నం వేయుట, ఎల్లమ్మ వేషాధారణ మహాఘట్టం కొనసాగనుందని గౌడ సంఘం కమిటీ బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం కమిటీ అధ్యక్షులు గంగాపురం రమేష్ గౌడ్, కోశాధికారి బుడిగె మనోహర్ గౌడ్, రవిగౌడ్, వేముల సారయ్య, కత్తి శ్రీను, పుల్లూరి ఎల్లగౌడ్, గుండ్లపెల్లి రాజ్‌కుమార్, బండి క్రిష్టగౌడ్, మచ్చిక సదానందం గౌడ్, బుడిగె మల్లేష్‌గౌడ్, రావుల సాంబయ్య గౌడ్, బుడిగె మల్లేష్ గౌడ్, రావుల సాంబయ్య, మేరుగు రవీందర్ గౌడ్, మేరుగు గంగాధర్, కుటుంబ సమేతంగా గౌడ బాంధవులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం

## భయపెడుతున్న రాబిస్

మైన జూనోటిక్ వైరల్ వ్యాధి. రాబిస్ సోకకుండా జాగ్రత్త పడడమే మంచిది. ఒకసారి లక్షణాలు కనిపించిన తర్వాత, ప్రాణాలు కాపాడే అవకాశాలు దాదాపు ఉండవు.



అయితే,లక్షణాలు కనిపించకముందే సకాలంలో వైద్య సంరక్షణ అందిస్తే రేబిస్‌ను 100 శాతం నివారించవచ్చు. ఈ వైరస్ సోకిన జంతువుల (కుక్కలు, గబ్బిలాలు, రకూన్లు, నక్కలు) లాలాజలంలో ఉంటుంది. కాటు, గీతలు లేదా తెరిచిన గాయాలు లేదా శ్లేష్మ పొరలను నొక్కడం ద్వారా మానవ శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఈ వైరస్ నరాల ద్వారా మెదడుకు చేరుకుంటుంది, మెదడు వాపును (ఎన్సెఫాలిటిస్) ప్రేరేపిస్తుంది, తీవ్రమైన నాడీ సంబంధిత సమస్యలకు దారితీస్తుంది. మరణానికి కారణమవుతుంది. ప్రపంచ వ్యాప్తంగా రేబిస్ మరణాలలోభారతదేశం వాటా 36 శాతంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. కాగా, యాంటీ రాబిస్ టీకాలు వేసినప్పటికీ ముగ్గురు మృతి చెందడం ఈ వ్యాధి మరింత శక్తిని పొంది, విజృంభించే ప్రమాదం ఉందనే అనుమానాలకు కారణమవుతున్నది.

కేరళలో టీకాలు వేసినప్పటికీ, ముగ్గురు పిల్లలు రాబిస్ వ్యాధి సోకి మృతి చెందడం ఆందోళన కలిగిస్తున్నది. సరైన మోతాదులో టీకాలు వేసినప్పటికీ, ఈ ఘోరం చోటు చేసుకోవడంతో, కారణాలను కనిపెట్టడంలో వైద్యులు నిమగ్నమయ్యారు. కుక్కలు కరవడంతో, బాధితుల తల, చేతులకు లోతైన గాయాలు అయినట్టు తెలుస్తోంది. దట్టమైన నరాల నెట్‌వర్క్‌లు ఉన్న ప్రాంతాల్లో గాయాలు కావడంతో, రాబిస్ వైరస్ నాడీ వ్యవస్థలోకి వేగంగా ప్రవేశించిందని వైద్య నిపుణులు నిర్ధారించారు. రాబిస్ వైరస్ నరాల ద్వారా కేంద్ర నాడీ వ్యవస్థకు సోకుతుంది. సున్నితమైన ప్రాంతాలలో కుక్క కాటు టీకాల ప్రభావం తగ్గుతుందని అభిప్రాయపడుతున్నారు. అదే విధంగా ఏదైనా జంతువు కరచిన లేదా పాము కాటు వేసిన వెంటనే గాయాలను సబ్బుతో కడగాలి. కనీసం నీటితోనైనా శుభ్రపరచాలి. ఇలాంటి చర్యలు వైరస్ వ్యాప్తి ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. కానీ, కేరళలో చోటు చేసుకున్న ఘనటల్లో ఎక్కడా బాధితుల గాయాలను శుభ్రపరచిన దాఖలాలు లేవు. దీనితో రాబిస్ వైరస్ వేగంగా వ్యాపించింది. రాబిస్ అనేది మానవులతో సహా క్షీరదాల కేంద్ర నాడీ వ్యవస్థను ప్రభావితం చేసే ప్రాణాంతక

## హెన్యోలో జన్యుపరమైన అనుసరణలు



దక్షిణ కొరియాలోని జెజు ద్వీపానికి చెందిన మహిళా డైవర్ల బృందాన్ని హేన్యోగా వ్యవహరిస్తారు. వారి ప్రత్యేకమైన డైవింగ్ పద్ధతులకు సంబంధించిన జన్యుపరమైన అనుసరణలు మరియు శారీరక మార్పులు రెండింటినీ ప్రదర్శిస్తున్నట్లు శాస్త్రవేత్తలు ఇటీవల గుర్తించారు. దీర్ఘకాలిక డైవింగ్ అభ్యాసంతోపాటు సహజ ఎంపిక బ్రాడీకార్డియా (హృదయ స్పందన రేటు మందగించడం), రక్తపోటు నియంత్రణ, చలిని తట్టుకోవడం వంటి లక్షణాలు వారిలో ఉన్నట్టు నిర్ధారించారు. హేన్యో బృందం సభ్యులు ఆక్సిజన్ మాస్క్‌లు ఉపయోగించకుండా, అబలోన్, సముద్రపు అర్చిన్‌ల వంటి షెల్ఫిష్‌లను పట్టుకోవడానికి 10 మీటర్ల వరకు నీటి అడుగున డైవ్ చేస్తారు. వారి సంస్కృతిని 2016 నుండి యునెస్కో అగోచర సాంస్కృతిక వారసత్వంలో భాగంగా గుర్తించింది. కాగా జెజు ద్వీపం దక్షిణ కొరియాలోని ఒక అగ్నిపర్వత ద్వీపం (బసాల్ట్ మరియు లావాతో తయారు చేయబడింది), దేశంలోని ఎత్తైన పర్వతం హల్లాసన్ (నిద్రాణమైన అగ్నిపర్వతం, 1,950 మీటర్లు)కు నిలయం. జెజు అగ్నిపర్వత ద్వీపం, లావా ట్యూబ్‌లు యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం, ఇవి ప్రత్యేకమైన భూగర్భ శాస్త్రం, ప్రధాన అగ్నిపర్వతం చుట్టూ 360 అనుబంధ అగ్నిపర్వతాలకు ప్రసిద్ధి చెందాయి.




## ప్రపంచాన్ని వణికిస్తున్న మలేరియా



ఎన్నో తరుణ వ్యాధులను సమర్థంగా అడ్డుకోగలిగినప్పటికీ, మలేరియా మాత్రం దశాబ్దాలుగా ప్రపంచ దేశాలను వణిస్తునే ఉంది. మలేరియా బారిన పడని మనిషి లేనడం అతిశయోక్తి కాదు. మలేరియా అనేది ప్లాస్మోడియం పరాన్నజీవి వల్ల కలిగే ప్రాణాంతక వ్యాధి. ఇది సోకిన ఆడ అనాఫిలిస్ దోమలు కుట్టడం ద్వారా మానుషులకు వ్యాపిస్తుంది. ఇది ఉపసహారా ఆఫ్రికా, ఆగ్నేయాసియా, దక్షిణ అమెరికా వంటి ప్రపంచంలోని ఉష్ణమండల, ఉపఉష్ణమండల ప్రాంతాలలో సాధారణం. మానవులలో మలేరియాకు కారణమయ్యే 5 ప్లాస్మోడియం జాతులు ఉన్నాయి. వీటిలో పి. ఫాల్సిపరం అత్యంత ప్రాణాంతకమైనది కాగా , పి. వైవాక్స్ అత్యంత విస్తృతంగా వ్యాపించింది. ఇతర జాతులు పి. మలేరియా , పి. ఓవలే, పి. నోలేసి. మలేరియా పరాన్నజీవులు సోకిన వ్యక్తిని కుట్టిన తర్వాత దోమకు సోకుతుంది. ఆ తర్వాత దోమ కుట్టిన తదుపరి వ్యక్తి రక్తప్రవాహంలోకి మలేరియా పరాన్నజీవులు ప్రవేశిస్తాయి. పరాన్నజీవులు కాలేయానికి ప్రయాణించి, పరిణితి చెంది, ఆపై ఎర్ర రక్త కణాలకు సోకుతాయి. మలేరియా సోకినప్పుడు జ్వరం, చలి, తలనొప్పి, అలసట వంటి లక్షణాలు ఉంటాయి. తీవ్రమైన కేసులు అవయవ వైఫల్యం లేదా మరణానికి దారితీయవచ్చు. అయితే, సరైన వైద్యంతో మలేరియాను నయం చేయవచ్చు. ప్రపంచ మలేరియా నివేదిక 2024 ప్రకారం, భారతదేశంలో, 2015, 2023 మధ్య, మలేరియా కేసులు 11.69 లక్షల నుండి 2.27 లక్షలకు, అదే విధంగా మరణాలు 384 నుండి 83కి తగ్గాయి. ఇది రెండు సూచికలలో 80 శాతం క్షీణతను సూచిస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) ప్రకటించిన 'హై బర్డెన్ టు హై ఇంపాక్ట్' (హెచ్‌బిహెచ్‌ఐ) జాబితా నుంచి భారత్‌కు 2024లో విముక్తి లభించింది. ఇది మలేరియా నిర్మూలనలో ఒక ప్రధాన మైలురాయి. అయితే ఇప్పటికీ మలేరియా కేసులు నమోదవుతునే ఉన్నాయి. 2030 నాటికి మలేరియా రహిత స్థితిని సాధించడమే లక్ష్యంగా ఎంచుకున్నారు. కాగా, ప్రపంచవ్యాప్తంగా, మలేరియా ఒక ప్రధాన ఆరోగ్య సవాలుగా మిగిలిపోయింది. ఇది 263 మిలియన్ల మందిని ప్రభావితం చేస్తున్నది. ఏటా 600,000 మందికి పైగా మరణాలకు కారణమవుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా నమోదవుతున్న మలేరియా కేసుల్లో 94 నుంచి 95 కేసులు కేవలం ఆఫ్రికా ఖండంలోని దేశాల నుంచే ఉండడం ఆందోళన కలిగిస్తున్న విషయం. క్లోరోక్విన్, ఆర్టెమిసినిన్ వంటి ప్రభావవంతమైన మందులతో మలేరియాను నయం చేయవచ్చు. దోమల నివారణకు కూడా పలు మార్గాలు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. డబ్ల్యుహెచ్‌ఒ ఆమోదించిన ఆర్‌టిఎస్, ఎస్/ఎఎస్01 (మాస్క్విరిక్స్) టీకా, 5 నెలల కంటే ఎక్కువ వయస్సు ఉన్న పిల్లలకు మొదటి మలేరియా వ్యాక్సిన్. ఆర్21/మాట్రిక్స్‌ఎంను సురక్షితమైన, ప్రభావవంతమైన రెండవ వ్యాక్సిన్‌గా ఆమోదించారు. కీమోప్రొఫిలాక్సిస్ విధానంలో, అంటువ్యాధిని నివారించడానికి స్థానిక ప్రాంతాలకు ప్రయాణించే ముందు, ప్రయాణ సమయంలో, తరువాత యాంటీమలేరియల్ మందులను తీసుకోవడం ఇందులో ఉంటుంది. ప్రివెంటివ్ కీమోథెరపీలో అధికప్రమాదకర కాలాల్లో దుర్బల సమూహాలకు (పిల్లలు, గర్భిణులు) యాంటీమలేరియల్స్ లక్ష్య నిర్వహణ ప్రధానంగా ఉంటుంది. మలేరియా నియంత్రణకు అనుసరించే కీలక వ్యూహాలలో సీజనల్ మలేరియా కెమోప్రెవెన్షన్ (ఎస్‌ఎంసి), పెరెన్నియల్ మలేరియా కెమోప్రెవెన్షన్ (పిఎంసి), ఇంటర్మిటెంట్ ప్రివెంటివ్ ట్రీట్మెంట్ ఇన్ ప్రెగ్నెన్సీ (ఐపిటిపి), మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎండిఎ) మొదలైనవి ఉన్నాయి. గర్భధారణ సమయంలో , మలేరియా వ్యాప్తి మధ్యస్థం నుండి అధిక స్థాయిలో ఉన్న ప్రాంతాలలో, సంక్రమణను నివారించడానికి, రెండవ త్రైమాసికం నుండి ప్రారంభించి, ప్రతి షెడ్యూల్ చేయబడిన యాంటెనటల్ కేర్ సందర్శనలో సల్ఫాడాక్సిన్‌పైరిమెథమైన్ (ఐపిటిపిఎస్‌పి) తో అడపాదడపా నివారణ చికిత్స సిఫార్సు చేశారు.

## మళ్లీ తెరపైకి నిపా వైరస్!



నిపా వైరస్ విస్తరిస్తున్నదన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో, దీనిపై చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. నిపా వైరస్‌ఒక ప్రమాదకరమైన వైరల్ వ్యాధి. ఇది మనుషులకి, మృగాలలోకి వ్యాపించగలదు. ముఖ్యంగా ఇది గబ్బిళాల ద్వారా వ్యాప్తి చెందుతుంది. వైరస్ సోకిన 414 రోజుల్లో లక్షణాలు కనిపించడం ప్రారంభమవుతాయి. తలనొప్పి, జ్వరం, కఫం, గొంతు నొప్పి, అలసట, మూర్ఛ, శ్వాస సంబంధిత సమస్యలు వేధిస్తాయి. మెదడు బొబ్బలిక (Encephalitis) లక్షణాలు విజృంభించినప్పుడు చికిత్స అవసరం అవుతుంది. కొన్నిసార్లు మూర్ఛ వచ్చి, కోమా స్థితికి కూడా దారి తీస్తుంది. గబ్బిళాలు మోసే ఫలాల ద్వారా (దీని మీద పీచుకట్టిన ఫలాలు తినడం ద్వారా), పందులు లేదా ఇతర మృగాల ద్వారా, బాధిత మనిషి నుండి ఇతర వ్యక్తికి (ప్రత్యక్ష సంబంధం, రక్తం, శ్వాస తడిసిన చుక్కల ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుంది. వైరస్ నుంచి మనల్ని మనం కాపాడుకోవడానికి కొన్ని చర్యలు అవసరం. ముందుగా హైజీన్ పాటించాలి. చేతులు తరచూ శుభ్రంగా కడుక్కోవాలి. పండ్లను కూడా శుభ్రపరచుకొని తినాలి. గబ్బిళాలు తిన్న ఫలాలు (జామపండు, మామిడి మొదలైనవి) వాడకపోవడం మంచిది. బాధిత వ్యక్తుల దగ్గర జాగ్రత్తగా ఉండాలి. రోగులను చూసేటప్పుడు మాస్క్‌లు, గ్లోవ్స్ వాడాలి. జంతువుల నుండి దూరంగా ఉండాలి. పందులు లేదా అనారోగ్యంగా ఉన్న జంతువుల దగ్గరకు వెళ్లడం మంచిదికాదు. పూర్తి రక్షణ పరికరాలు (పిపిఇ) వాడాలి. 2024 చివరలో కేరళ రాష్ట్రంలో నిపా వైరస్ కేసులు నమోదయ్యాయి. కానీ, తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో పెద్ద పరిమితిలో వ్యాప్తి ఆగిపోయింది. ఎప్పటికప్పుడు ఆరోగ్య శాఖల నుంచి వచ్చిన సూచనలు అనుసరించడం చాలా ముఖ్యం. ప్రస్తుతం నిపా వైరస్‌కు ప్రత్యేకమైన వ్యాక్సిన్ లేదా ప్రత్యక్ష చికిత్స లేదు. లక్షణాల ప్రాతిపదికన చికిత్స చేస్తారు. ఉదాహరణకి: శ్వాసకోశ సమస్యలు, అలసట తగ్గించేందుకు మందులు వాడతారు. అవసరమైతే ఐసియులో చేర్చి, ఆక్సిజన్ పెట్టి చికిత్స కొనసాగిస్తారు.

**ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి**

# 4వ తరగతి ఉద్యోగులుగా హమాలీ కార్మికులు

### రాష్ట్ర సివిల్ సప్లయ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు డిమాండ్

**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** హమాలీ కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయి హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయి హమాలీ వర్కర్స్ యూనియన్ వరంగల్ జిల్లా మూడవ మహాసభలు ఏనుమాముల మార్కెట్ ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద ఆదివారం ప్రారంభమయ్యాయి. మహాసభలను ప్రారంభించి అనంతరం బాల్‌రాజు మాట్లాడుతూ సివిల్ సప్లయిస్ గోదాములలో పనిచేస్తున్న హమాలీ కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి, పిఎఫ్, ఇఎస్‌ఐ అమలు చేయాలని, పని చేసే వయో పరిమితి 57 సంవత్సరాలను నుండి 61 సంవత్సరాలకు పెంచాలని, నెలకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సివిల్ సప్లయిస్ మండల పాయింట్ల వద్ద సొంత గోదాములు నిర్మించాలన్నారు. కార్మికుల రిటైర్‌మెంట్ సమయంలో రూ.10 లక్షలు రిటైర్డ్ బెనిఫిట్ ఇవ్వాలని, కార్మికులకు ప్రమాదాలు జరిగిన మరణించిన అంగవైకల్యం చెందిన రూ.10లక్షలు పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎఐటియుసి ఆధ్వర్యంలో 1980 సంవత్సరంలో కార్మికులను రాష్ట్ర వ్యాప్తంగా సంఘటిత పరిచి సంఘాన్ని ఏర్పాటు చేసి అనేక సమరశీల పోరాటాలు నిర్వహించి, ప్రస్తుతం అమలు చేస్తున్న హక్కులను సాధించుకున్నామన్నారు. సంఘం స్థాపించిన నాడు కూలీ రేటు 30 పైసలు ఉంటే నేడు 29 రూపాయలకు పెంచుకోవడం జరిగిందని, ప్రతి హమాలీకి సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్‌లు, కుట్టు కూలీ రేట్లు 1300 రూపాయలు, బోనస్ సంవత్సరానికి 7,500, హమాలీ కార్మికుడు చనిపోతే దహన సంస్కారాల ఖర్చులకోసం 20వేల రూపాయలు, ప్రతి దసరాకు 800 రూపాయలు, స్వీటు తదితర హక్కులను సాధించుకున్నామన్నారు. నూతన గోదాములను రాష్ట్రవ్యాప్తంగా నిర్మించేలా ప్రభుత్వంపై పోరాటాలు చేస్తున్నామన్నారు. తద్వార స్థానికులకు ఉపాధి లభిస్తుందన్నారు. హమాలీ కార్మికులు పనిచేసే గోదాముల వద్ద మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. మహాసభలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్. భాషుమియా, పనాస ప్రసాద్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, జిల్లా అధ్యక్షులు చెన్నకేశవులు, సివిల్ సప్లయిస్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మునిశ్వర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు లక్ష్మణ్ పాల్గొన్నారు. మహాసభలో 13 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దెవనభోయిన రాంబాబు, ఉపాధ్యక్షుడిగా జలగం బిక్షపతి. కోశాధికారిగా కొత్తగటు నర్సింగం, ప్రధాన కార్యదర్శి గుపెల్లి మునీశ్వర్, సహాయ కార్యదర్శులుగా జలగం రవి, గర్రకోట చంద్రమౌళి, కోశాధికారిగా మిట్టపెల్లి మహేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.




# కార్మిక వ్యతిరేక విధానాలపై సమ్మె

### ఎఐటియుసి మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు

**ప్రజాపక్షం/మందమర్రి :** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి మేకల దాసు పిలుపునిచ్చారు. స్థానిక సిఇఆర్ క్లబ్‌లో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జిల్లా సమితి సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎండి అక్బర్ అలీ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మేకల దాసు మాట్లాడుతూ సంపద సృష్టికర్తలు కార్మికవర్గమని, ఆ కార్మికవర్గానికి హక్కులు లేకుండా చేసే కార్మిక చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడ్‌లను అమలు చేయడం కార్మిక వర్గానికి హక్కులు లేకుండా కేవలం కార్పొరేట్ వ్యాపార వర్గాలకు అనుకూలంగా కార్మిక చట్ట సవరణ చేయడమేనన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా సమ్మె జరగబోతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, నాలుగు కోడ్‌లను రద్దు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మిట్టపల్లి పౌలు, ముస్కె సమ్మయ్య, కళిందర్ అలీ ఖాన్, తోకల సరస్వతి, దాగం మల్లేష్, శైలేంద్ర సత్యనారాయణ, భీమనాదని సుదర్శన్, దేనబోయిన బాపు, జాడిపోచం శంకర్ తదితరులు పాల్గొన్నారు.




# పేదలకు సేవలందించేది కమ్యూనిస్టులే







### సిపిఐ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా అన్నారు. ఆదివారం పట్టణంలోని రామవరం సెంటర్లో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కార్మికవర్గానికి, పేదప్రజలకు అనునిత్యం సేవలందించేది కమ్యూనిస్టులే అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రజలకు అందించిన సేవల ఫలితంగా రోజురోజుకు పార్టీకి జనాదరణ పెరుగుతుందన్నారు. కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ఎమ్మెల్యే కూనంనేని కృషితో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో నాయకులు కంచర్ల జమలయ్య, జి.వీరాస్వామి, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీను, ఎస్‌కె ఫహీమ్, పాటి మోహన్, మాతంగి లింగయ్య, మాటేటి గోపాల్, గురుమూర్తి, గోపి, తూముల శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్, ఖయూమ్, నగేష్, అంకూస్, సింగిరాల రమేష్, దాసు, జలీల్, రణధీర్, మర్రి కృష్ణ, విజయలక్ష్మి, దార లక్ష్మి, శంకర్, దాట్ల శ్రవణ్, అలీం, అనీఫ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

### స్వార్థం లేనిది తల్లి ప్రేమ

స్వార్థం లేనిది తల్లి ప్రేమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. పట్టణంలోని రామవరం సెంటర్‌లో మదర్స్ డే సందర్భంగా జంజర్ల కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరి జీవితంలో తల్లి మొదటి స్నేహితురాలిని, మొదటి గురువని పేర్కొన్నారు. మాతృ శక్తి లేనిదే సమాజం లేదన్నారు. మహిళా శక్తి లేకుండా దేశ అభివృద్ధి జరగదన్నారు. తల్లుల అభివృద్ధే కుటుంబాల అభివృద్ధి అని, అదే దేశ అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. కనిపెంచిన తల్లిదండ్రులను మరువవద్దని, వారిని కడదాకా కంటికిరెప్పలా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాపు సీతాలక్ష్మి, కంచర్ల జమలయ్య, జి.వీరాస్వామి, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీను, ఎస్‌కె ఫహీమ్, పాటి మోహన్, మాతంగి లింగయ్య, మాటేటి గోపాల్, గురుమూర్తి, గోపి, తూముల శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్, ఖయూమ్, నగేష్, అంకూస్, సింగిరాల రమేష్, దాసు, జలీల్, రణధీర్, మర్రి కృష్ణ, విజయలక్ష్మి, దార లక్ష్మి, శంకర్, దాట్ల శ్రవణ్, అలీం, అనీఫ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# దోపిడీ రహిత సమాజ నిర్మాణానికి నిరంతరం పోరాటాలు

### వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ
### సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి




**ప్రజాపక్షం/గన్నేరువరం :** నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తూ దోపిడీ రహిత సమాజ నిర్మాణానికి భారత కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు నిర్వహిస్తుందని, వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అని పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పేర్కొన్నారు. గన్నేరువరం మండల కేంద్రంలోని ముదిరాజ్‌ల భవన్‌లో సిపిఐ మండల 3వ మహాసభ చొక్కల శ్రీశైలం అధ్యక్షతన ఆదివారం జరిగింది. మహాసభ ప్రారంభ సూచికగా సిపిఐ జెండాను మర్రి వెంకటస్వామి ఆవిష్కరించారు. మహాసభలో మూడు సంవత్సరాల కాలంలో పార్టీ నిర్వహించిన కార్యక్రమాల నివేదికను కాంతాల రాజిరెడ్డి ప్రవేశపెట్టారు. మహాసభకు ముఖ్య అతిధిగా హాజరైన మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు గడుస్తున్నా పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. నరేంద్ర మోడీ పరిపాలనలో కార్పోరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు మేలు కలిగించే విధానాలకు పాల్పడుతున్నారన్నారు. ఏటా కోటి ఉద్యోగాల మాట నీటిమూటలై నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. బడా పెట్టుబడిదారులకు రాయితీలు కల్పిస్తూ పేదలకు అన్యాయం చేస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలో సిపిఐ సహకారంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు పరచాల్సిన బాధ్యత రేవంత్‌రెడ్డి సర్కారుపై ఉందన్నారు. సంక్షేమ పథకాల అమలులో అర్హులైన పేదలకు ఇండ్ల, ఇళ్లస్థలాలు, సంక్షేమ పథకాలు అందించాలన్నారు. పూర్తిస్థాయిలో రైతులకు రుణమాఫీ చేసి, భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. దేశంలో భూసంస్కరణ చట్టం, సమాచారహక్కు చట్టం, రాజభరణాల రద్దు, గ్రామీణ ఉపాధి హామీ పథకం లాంటి ప్రజోపయోగకర పథకాలు తీసుకురావడానికి సిపిఐ కృషి చేసిందన్నారు. మండలంలో పార్టీని బలోపేతం చేయడం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేయడంతో పాటు సర్పంచులుగా, ఎంపిటిసిలుగా పోటీ చేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మహాసభలో ఎఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బోనగిరి మహేందర్, మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి, సహాయ కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శులు బోయిని మల్లయ్య, పిప్పల కనుకయ్య, కోతి సంపత్, చెరుకు ఆంజనేయులు, బోయిని తిరుపతి, గాజుల లక్ష్మణ్, నాగయ్య, కూన మల్లయ్య, ఘర్షకుర్తి శ్రీనివాస్, బొమ్మకంటి ఆంజనేయులు, రాపోలు రాజమల్లు, బొమ్మకంటి సదానందం, బుర్ర శ్రీను, మడికె సంతోష్, తాళ్లపల్లి సంపత్, సదానందం తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## క్రీడలలో గెలుపు ఓటములు సహజం



**ప్రజాపక్షం/నేరడిగొండ:** నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న వడూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టౌర్నమెంట్ ఫైనల్లో గెలుపొందిన జట్లకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్,చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.గెలుపొందిన జట్లకు బహుమతిగా సొంత డబ్బులు రూ.35,000/ అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గెలుపోటములు సహజమని క్రీడా పోటీలు దేహదారుధ్యానికి శరీర ఆకృతికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## 13న పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163, అమలు:సిపి సాయిచైతన్య

**ప్రజాపక్షం/నిజామాబాద్అర్బన్:** 13న పాలిటెక్నిక్ ఎంట్రెన్స పరీక్ష 2025 సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద అండర్ సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని సిపి సాయిచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం కమీషనర్ కార్యాలయం నుండి వెలువడిన ప్రకటనలో పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ పరీక్ష 2025 ప్రవేశం కోసం జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 13న ఉదయం 11 గంటల నుండి 1.30 గంటల వరకు 16 పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అండర్ సెక్షన్ 163 బిఎన్ఎస్ అమలులో ఉంటుందని తెలిపారు. అండర్ సెక్షన్ బిఎన్ఎస్ఎస్ ప్రకారం ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు పరీక్ష కేంద్రాల వద్ద గుమికూడరాదు, నిషేధిత వస్తువులతో పరీక్ష కేంద్రాల వద్ద తిరగవద్దు, అన్ని పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలోని అన్ని జిరాక్స్ సెంటర్లను ఈనెల 13న ఉదయం 7 గంటల నుండి 3 గంటల వరకు మూసివేయాలని పై నిషేధిత ఉత్తర్వులు 13 అమలులో ఉంటాయని కావున ప్రజలు గమనించాలని అతిక్రమించే వారికి శిక్ష అర్హులగుదురని తెలిపారు.

## మన సైనిక శక్తి సత్తా ప్రపంచానికి చాటాలి: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/బైంసా:** పాకిస్తాన్ దుష్టశక్తుల్ని తరమికొట్టేలా భారత సైన్యానికి మరింత శక్తిని ప్రసాదించాలని కోరుతూ ఆదివారం బైంసా పట్టణంలోని గట్టు మైసమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ పూజలు నిర్వహించారు. అమ్మవారికి హారతి చేసి శక్తిని ఇవ్వాలని మొక్కులు మొక్కుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్‌లో ఉగ్ర మూకలను భారత సైన్యం మట్టి కరిపించి, మన సైనిక శక్తి సత్తా ప్రపంచానికి చాటామని చెప్పారు.ఆపరేషన్ సింధూర్ కు ఇద్దరు మహిళలు నాయకత్వం వహించడం వారి ఆధ్వర్యంలో పాకిస్తాన్ లోని,ఉగ్రస్థావరాలను,వైమానిక స్థావరాలను ధ్వంసం చేయడంతో శత్రుదేశం తోకముడవల్సి వచ్చిందన్నారు.భారత సైన్య ధాటిని తట్టుకోలేక ప్రపంచ దేశాలకు శరణు వేడుకోవాల్సిన పరిస్థితి పాకిస్తాన్ కు వచ్చిందన్నారు.సైన్యం తెగింపు,యుద్ధంలో వ్యూహాన్ని చూసి ప్రపంచ దేశాలే నివ్వెర పోయాయంటే మన సైన్యం గర్వ కారణంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు రావుల రాము, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎనుపోతుల మల్లేష్, పిఎసిఎస్ డైరెక్టర్ వడ్నప్ శ్రీనివాస్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ తోట లింగురాం, నాయకులు రావుల పోశెట్టి, తుమోల్ల దత్తాత్రి, గాలి రాజు, బండారి దిలీప్, పండిల్ రావ్, కాసరోళ్ల ప్రవీణ్, గోపాల్ సూత్రవే, కోర్వ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు



**ప్రజాపక్షం/నేరడిగొండ :** నేరడిగొండ మండలంలోని రోల్ మామడ టోల్ ప్లాజా వద్ద అదిలాబాద్ నుండి నిర్మల్ కు వెళ్తున్న కారు ఆగి ఉన్న లారీని ఢీకొన్న సంఘటనలో నిర్మల్ కు చెందిన వెంకటేష్ కత్తూరి,(35)మృతి చెందగా అన్వేష్,అనే వ్యక్తి తీవ్ర గాయలు అయ్యాయని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.క్షతగాత్రులను నిర్మల్ ప్రభుత్వాసుపత్రికి పంపడం జరిగిందని సంఘటనకు సంబంధించి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## ద్విచక్ర వాహనాలు ఢీ: ఒకరు మృతి



**ప్రజాపక్షం/పాపన్నపేట:** ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కుర్తివాడ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన కర్రోళ్ల శేఖర్ (62) స్థానిక హనుమాన్ ఆలయంలో పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం మందులు తెచ్చుకునేందుకు తన టీవీఎస్ ఎక్సెల్ పై పాపన్నపేటకు బయలు దేరాడు. గ్రామ గేటు వద్దకు రాగానే మిన్ పూర్ వైపు నుండి మెదక్ వైపు వెళ్లే బైక్ వేగంగా ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదైందని ఎస్సై పేర్కొన్నారు.

## ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా: ఒకరి మృతి



**ప్రజాపక్షం/తానూర్:** మండలంలోని బేలతరోడ గ్రామ సమీపంలోని సబ్ స్టేషన్ వద్ద కుంటాల మండలం లింబా(బి) గ్రామానికి చెందిన ఉమాజీ సంజు(35)మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది ట్రైన్ ఎస్సై నవనీత్ రెడ్డి తెలిపిన వివరాలు.ప్రకారం...తానూర్ మండల బెంబర్లో గ్రామంలో తన బంధువు చనిపోవడం తో అంత్యక్రియాలకు వచ్చి తిరుగు ప్రయాణంలో వేళ్తు ఉండగా బెల్తారోడ గ్రామ సమీపాన సబ్ స్టేషన్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి మృతి చెందాడు.సంఘటన స్థలానికి తానూర్ ట్రైని ఏసై నవనీత్ రెడ్డి చేరుకుని చుడగా అప్పటికి సంజు చనిపోవడం జరిగింది.మృతుడికి భార్య,కుమారుడు ఉన్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అయన తెలిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సజావుగా నిర్వహించాలి

### కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి:** ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలను నడిపించాలని సూచించారు. రైతులకు సమస్యలు ఎదురైతే వెంటనే 9182958858 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని తెలియజేశారు. ఇప్పటివరకు జిల్లాలో జరిగిన ధాన్యం కొనుగోలు వివరాలను అధికారులతో సమీక్షించిన కలెక్టర, కొనుగోలు ప్రక్రియను మరింత వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలని, కొనుగోలు అనంతరం ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. ఈ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఎం సివిల్ సప్లయిస్ సుధాకర్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీసీఓ రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం



**ప్రజాపక్షం/నిజాంపేట్:** నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో ఆర్ఎంపి, పి.ఎం.పి, బిగ్ టీవీ, శ్రీకార హాస్పిటల్ కొంపల్లి వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా ఆరోగ్య శిబిరాన్ని ఆదివారం జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, రాచకొండ కమిషనరేట్ అడిషనల్ డిసిపి ఎస్ఓటి డాక్టర్ నంద్యాల నరసింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామాలలో నిరుపేదలకు ఆరోగ్య సేవలు అందించడం గొప్ప విషయం అన్నారు. ఈ ఉచిత ఆరోగ్య శిబిరాలను గ్రామస్తులు సద్వినియం చేసుకోవాలని, ఈ కార్యక్రమాన్ని ముందుండి ఆర్ఎంపి, పిఎంపి, బిగ్ టీవీ, శ్రీకార హాస్పిటల్ కొంపల్లి వారిని అభినందించారు. ఈ శిబిరంలో సుమారు 300 మంది మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎస్ఐలు సృజన, నారాయణ, ఏఎస్ఐ జైపాల్ రెడ్డి, గ్రామస్తులు ముత్యం రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ అక్క పల్లి రామ్ రెడ్డి, బాజా రమేష్, శ్రీకర హాస్పిటల్ జనరల్ మేనేజర్ రవికుమార్, డిఎంఓ డాక్టర్ లతా, డాక్టర్ తేజ, డాక్టర్ తేజస్విని, డాక్టర్ రమేష్ ఆర్ఎంపీ, పీఎంపీల అధ్యక్షులు బైరవరెడ్డి, కార్యవర్గ సభ్యులు, బాలరాజ్,శేఖర్, రాజు, కిషన్, అంజిరెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## గాలి వాన బీభత్సం..



**ప్రజాపక్షం/తానూర్ :** మండలంలోని కోలూరు గ్రామంలో ఆదివారం గాలి వాన బీభత్సం సృష్టించింది.బలమైన ఈదుకు గాలులకు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి.అదేవిధంగా గాలి బీభత్సంలో వృక్షం నేలకు ఒరిగింది.మండలంలోని పలు గ్రామాల్లో బలమైన ఈదురుగాలితో పాటు వర్షం సైతం కురిసింది.ఒక్కసారిగా ఈదురు గాలులు వీయడంతో పాటు వర్షం కురవడంతో వాతావరణంలో మార్పు వచ్చింది.విపరీతమైన ఎండలు పెరిగిపోవడంతో ఉక్కపోత భరించలేక ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారు.ఎండ వేడిమి నుండి ఉపశమనం పొందేందుకు కూలర్లను వాడడంతో పాటు చల్లటి పానీయాలను సేవిస్తున్నారు.ఈదురు గాలులు వీయడంతోపాటు మార్పు వచ్చి చల్లటి గాలులతో ప్రజలు ఉపశమనం పొందారు.అయితే విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.విద్యుత్ శాఖ సిబ్బంది స్పందించి యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.వాతావరణ శాఖ సైతం పలు ప్రాంతాల్లో బలమైన గాలులతో పాటు వర్షాలు కురుస్తాయని ప్రకటించింది.

## పెన్షన్ ప్రభుత్వం ఇచ్చే భిక్షకాదు ఉద్యోగ హక్కు



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** పెన్షన్ అనేది ప్రభుత్వం ఇచ్చే బిక్ష కాదని, ఉద్యోగుల హక్కు అని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ నాశెట్టి సుమన్ అన్నారు. ఆదివారం ఎంప్లాయిస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో పెన్షనర్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ భవన్‌లో సదస్సును స్టడీ సర్కిల్ జిల్లా కన్వీనర్ కె.రామ్మోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ప్రజా కళాకారులు సిర్ప లింగయ్య, శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యోగి తన యవ్వనాన్ని జీవితాన్ని పూర్తిగా ప్రభుత్వం కోసం ప్రజల కోసం, పని చేసిన తర్వాత వారి చరమాంకంలో ఆర్థికంగా ఆదుకోవటానికి ప్రభుత్వాలు కల్పించే ఒక ఆసరా పెన్షన్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈపీఎస్ పెన్షన్ అని, న్యూ పెన్షన్ స్కీం అని, యునిఫైడ్ పెన్షన్ స్కీమ్ అని, కొత్త పెన్షనర్లు, పాత పెన్షనర్లంటూ వర్గీకరించి ఉద్యోగుల పెన్షన్‌ను ఎత్తివేసే ప్రయత్నం చేస్తుందన్నారు. ఉద్యోగులు, కార్మికవర్గంతో కలిసి ఐక్యంగా పోరాడినప్పుడు మాత్రమే పెన్షన్‌ను కాపాడుకోగలుగుతామన్నారు. పెన్షనర్లు తమ హక్కులు చట్టాలను కాపాడుకునేందుకు దేశవ్యాప్తంగా ఉద్యోగులు కార్మికులు ఇతర ప్రజానీకమంతా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నాయని దాంట్లో భాగంగానే 20న దేశవ్యాప్త సమ్మెకు పూనుకున్నాయని సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ ఇన్సూరెన్స్ ఉద్యోగుల నాయకులు తిరుపతయ్య, బ్యాంకు ఉద్యోగుల నాయకులు వెంకటేష్, బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల నాయకులు నారాయణ, శేఖర్, శ్రీనివాసరావు, విజయానందరావు, స్టడీ సర్కిల్ బాధ్యులు శ్రీధర్, మదన్‌మోహన్ పాల్గొన్నారు.

## రక్తదానం చేసిన కాంగ్రెస్ నేత పివిఆర్

**ప్రజాపక్షం / ఆర్మూర్:** జక్రాన్‌పల్లి వాసి జగడం నారాయణకు బి నెగిటివ్ రక్తం అవసరం ఉండగా అత్యవసర సమయంలో సామాన్య మానవుడి తరహాలో ఒకరి ప్రాణాన్ని నిలబెట్టేందుకు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి రక్తదానం చేసి అపద్బాంధవుడు అయ్యాడు. సోషల్ మీడియాలో రక్తం అవసరం ఉందన్న సమాచారం మేరకు వెంటనే స్పందించి హైదరాబాదులోని మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రికి వెళ్ళి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. రక్తదానం పట్ల ఆర్మూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురకంటి చిన్నారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, పట్టణ ప్రముఖులు వినయ్ కుమార్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ప్రాణాపాయ స్తితిలో రక్తమందించి ఆర్మూర్ ప్రాంతంలో పలువురికి వినయ్ రెడ్డి ఆదర్శంగా నిలిచారని వారు కొనియాడారు.

## దళితుల సంక్షేమం, అభివృద్ధికి మరింత కృషి



**ప్రజాపక్షం/నిజామాబాద్ప్రతినిధి:** దళితుల సంక్షేమం, అభివృద్ధి కోసం మరింత కృషి చేయాలని, దళితరత్న అవార్డుతో బాధ్యత మరింత పెరిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. ఆదివారం సీపీఐ పార్టీ కార్యాలయంలో దళిత హక్కుల పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దళిత రత్న సక్కి సురేష్‌కు నగర కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్, నాయకులు భూమయ్య, ఓమయ్య మాట్లాడుతూ దళితరత్న అవార్డు గ్రహి సక్కి సురేష్ దళితు లకోసం, బహుజనుల కోసం మరింత కృషి చేయాలని, దళిత సామాజిక వర్గానికి చెందిన సబ్‌ప్లాన్ నిధులు ప్రభుత్వంతో పోరాడి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం పని చేయాలన్నారు. 33వ డివిజన్ ప్రజా సమస్యలపై పోరాడాలని తెలిపారు. కార్యక్రమంలో ఐహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు రాజన్న, ఫిరోజ్, అలీ, హన్మాండ్లు గంగాధర్ పాల్గొన్నారు.

## ఇఎపిసెట్ ఆల్ఫోర్స్ విద్యార్థులకు ర్యాంకులు







**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం రోజు విడుదల చేసిన ఐఏపిసెట్ 2025 ఫలితాల్లో నిర్మ్ అల్ఫోర్స్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి తెలియజేశారు. ముఖ్యంగా అల్ఫోర్స్ నిర్మల్ విద్యార్థులు బైపిసి ఇఏపిసెట్ విభాగంలో సనైటా 1617, దీప్తి షైనీ 2535, యండి, ముసాదీక్ 2619, సుమయ్య ఖానమ్ 6887, యం.ప్రీతి 8497, మిస్బా తహరీమ్ 9202 రాష్ట్ర స్థాయి ఉత్తమ ర్యాంకులు సాధించగా. ఎంపీసీ ఇఏపిసెట్ విభాగంలో పుష్పాంజలి 10528, శ్రీభావన 17684, సాహితీ 29017 ర్యాంకులు సాధించారని తెలిపారు. ఇంటర్మీడియట్లో రెండు సంవత్సరాలు కష్టపడి చదివి ఇఏపిసెట్ లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ నరేందర్ రెడ్డి అభినందించారు.మా వెన్నంటే ఉండి మమ్మల్ని నిరంతరం ప్రోత్సహిస్తున్న పోషకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## పకడ్బందీగా శిక్షణ కార్యక్రమాలు





**ప్రజాపక్షం/మంచిర్యాల:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ చౌదరి తెలిపారు. జిల్లా విద్యాధికారి యాదయ్య ఆదేశాల మేరకు మంగళవారం నుండి శిక్షణ నిర్వహిస్తున్న ఎస్‌జిటి, డిర్‌పిలు, స్కూల్ అసిస్టెంట్ గణితం, ఆంగ్లం, సాంఘిక శాస్త్రం డిఆర్‌పిలతో నిర్వహించిన శిక్షణ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చౌదరి మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు శిక్షణను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకునేలా రిసోర్స్ పర్సన్లు ప్రముఖ పాత్ర పోషించాలని సూచించారు. అన్ని రకాల వనరులను సమీకరించుకుని శిక్షణను సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అన్ని విభాగాలకు చెందిన 1811 మంది స్కూల్ అసిస్టెంట్లు, 1130 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు శిక్షణ పొందుతారని ఆయన తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు వీలైనంత మంచి వసతులు కల్పించబడతాయని, శిక్షణ కార్యక్రమాలు సద్వినియోగం అయ్యేలా కోర్సు కోఆర్డినేటర్లు సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌పిలతోపాటు క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శ్రీ రాథోడ్ రమేష్, వై వామనుమూర్తి, జి రామన్న, కెవి సత్యనారాయణ పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్ డిస్పెన్సరీల్లో మందుల కొరత

### కార్మిక సంఘం ఆగ్రహం

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:** శ్రీరాంపూర్ ఏరియాలోని డిస్పెన్సరీల్లో మందుల కొరత ఏర్పడటంపై తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆర్‌కె 8, నస్పూర్ డిస్పెన్సరీల్లో దీర్ఘకాలిక వ్యాధులైన బిపి, షుగర్, హృదయ సంబంధిత, మూత్రపిండాల సంబంధిత, శ్వాసకోశ, పెరాలసిస్ టిబి వ్యాధులకు సంబంధించిన మందులు, వాటి టీకాలు నెలవారీగా ఇచ్చేవారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం ఐదు లేదా ఆరు రోజులకు సరిపడా మాత్రమే ఇస్తుండటంతో సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సంఘం పేర్కొంది. సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల సంక్షేమం మరియు ఆరోగ్యాన్ని పూర్తిగా విస్మరించినట్లు ఈ పరిస్థితి స్పష్టం చేస్తోందని సంఘం విమర్శించింది. సింగరేణి నిధులను సింగరేణితో సంబంధం లేని సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు లక్షలాది రూపాయలు వెచ్చించడం, స్థానికంగా ఉన్న ఉద్యోగుల ఆరోగ్యానికి సంబంధించిన మందులు సమకూర్చడంలో విఫలం చెందడం బాధాకరమని పేర్కొంది. కావున పాత పద్ధతిలోనే సరఫరా చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం డిమాండ్ చేసింది. అలా చేయని పక్షంలో ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆసుపత్రుల వద్ద పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, లక్ష్మ ణ్, రమేష్, సత్తయ్య, పొగాకు రమేష్, అన్వేష్ రెడ్డి, ఎండి లాల, ముత్యాల రమేష్, గోనె స్వామి, గోపి నాయక్ పాల్గొన్నారు.

## మండల సరిహద్దులు దాటుతున్న నల్లమట్టి

### యథేచ్ఛగా అధికారుల అండదండలతో అక్రమ రవాణా



**ప్రజాపక్షం/నందిపేట్ :** నందిపేట్ మండలంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరివాహక ప్రాంతం గోదావరి బేసిన్ నుంచి మట్టి వ్యాపారులు యథేచ్ఛగా నల్లమట్టి తవ్వకాలు జరిపి ఇతర ప్రాంతాలకు అధికారుల అండదండలతో అక్రమ రవాణా జరుపుతు వ్యాపారులు లక్షల రూపాయలు జేబులు నింపుకుంటున్నారు. ఇక్కడి నుండి మట్టిని ఒక్కొక్క ట్రిప్పర్ ఏడు నుంచి పది వేల రూపాయలు వ్యాపారులు వసూలు చేస్తున్నారు. మాక్లూర్, ఆర్మూర్, ఆలూరు మండలాలు దాటుకుంటు మట్టి తరలుతుంది. ప్రాజెక్టు అధికారులు రైతుల ప్రయోజనాల కోసం అంటు చప్పుడు చేయడం లేదు. గ్రామాల అభివృద్ధి కమిటి కొంత వసూలు చేసుకోవడంతో గుట్టుచప్పుడు కాకుండా నల్లమట్టి వ్యాపారులు, కొందరు ప్రజా ప్రతినిధులను, పాత్రికేయులను మచ్చిక చేసుకొని చడిచప్పుడు కాకుండా వ్యాపారం సాగుతుంది. ఈ ప్రాజెక్టు నల్లమట్టికి విపరీతంగా డిమాండ్ ఉంది. సారవంతమైన మట్టి కావడంతో రైతుల నుంచి వ్యాపారులు ఎక్కువ వసూలు చేస్తున్నారు. పెంట కుప్పలు కొని పొలాలకు, తోటలకు తరలించి పంట భూములు రైతులు కాపాడుకొనేవారు. ప్రస్తుతం ఇవి తగ్గిపోయి నల్లమట్టికి డిమాండ్ పెరిగింది. మండలంలో కొండూరు, బాద్గుణ, దొంకేశ్వర్, నికాల్పూర్, గాదేపల్లి, అన్నారం, సిర్పూర్ గ్రామాలు గోదావరి పరివాహక ప్రాంతాలు. ఈ ప్రాంతాల నుంచి వ్యాపారులు జేసిబి, ప్రోక్లైన్ యంత్రాలు పెట్టి లోతుగా తవ్వుతు అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గ్రామ కమిటిలకు కొంత డబ్బు ఇచ్చి మూడు పువ్వులు ఆరు కాయలుగా తమ వ్యాపారం చేస్తున్నారు. అధికారులకు ఆశలు చూపి ఎలాంటి అవరోధాలు రాకుండా మట్టి వ్యాపారం యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఈ విషయంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులు పట్టించుకోకపోవడం ఆశ్చర్యకరం. ప్రభుత్వం త్వరలో ఏకో టూరిజం ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి. పరివాహక ప్రాంతాలలో లోతుగా గుంతలు తీయడం వల్ల పర్యాటకులకు, పశు పక్షాదులకు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉంది. అటవీశాఖ అధికారులు సైతం పట్టించుకోకపోవడం బాధాకరం. రోజువందలాది టిప్పర్లు మట్టిని వేరే మండలాలకు తరలిస్తున్నారు. చాలా మంది రైతులు పాడిగేదెలు అమ్ముకోవడంతో పెంట కుప్పలు కనిపించడం లేదు. అందుకే నల్లమట్టి పోయించుకొని భూములు సారవంతం చేసుకుంటు మంచి దిగుబడులు రైతులు సాధిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు దర, బోనస్ ఉపయోగించుకుంటు లాభాలు సాధిస్తున్నారు. మట్టి తరలింపు వల్ల లక్షలు ఖర్చుచేసి రోడ్లు వేస్తే చెడిపోతున్నాయి. జిల్లా కలెక్టర్ స్పందించి మట్టి తరలింపు ఆపివేయించాలని గ్రామ ప్రజలు రైతులు కోరుతున్నారు. మట్టి తరలింపు గురించి ఆర్మూర్ అటవీశాఖ అధికారులు, మండల రెవెన్యూ అధికారులు తమకు సంబంధం లేదని అన్ని ప్రాజెక్టు అధికారులకే తెలుసునని సమాధానం ఇస్తున్నారు.

# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ఎప్‌సెట్‌లో రాణించిన ముత్తారం మండల విద్యార్థులు



ప్రజాపక్ష/ముత్తారం : తెలంగాణ ఎప్‌సెట్–2025 ఫలితాల్లో ముత్తారం మండలానికి చెందిన విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన ద్యాగాటీ కీర్తన ఎఫ్ సెట్ ఫలితాల్లో 53 మార్కులతో 28,788 ర్యాంకు సాధించగా, కేషనపల్లి గ్రామానికి చెందిన అశ్విత 22,246 ర్యాంకు సాధి ంచారు. వీరితో పాటు మరో ఇద్దరు విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. అనం తరం విద్యార్థులను పలువురు అభినందించారు.

## మహేష్ కుటుంబానికి అండగా కెటిఆర్

* సొంత ఖర్చులతో భారత్‌కు రప్పిస్తానని భరోసా



ప్రజాపక్షం/ రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : మాజీ మంత్రి బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ ఆదివారం సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించి పలు శుభకార్యాలకు హాజరయ్యారు. దీనిలో భాగంగా జీవనోపాది కోసం గల్ఫ్(సౌదీ) వెళ్లిన మండెపల్లి గ్రామానికి చెందిన మహే ష్ కంపెనీ బస్సులో పనికి వెళ్తుండగా తీవ్రమైన రోడ్డు ప్రమాదం సంభవించగా ప్రమాదంలో 9మంది ప్రాణాలు కోల్పోయారు. మహేష్ ప్రాణాపాయ స్థితి నుండి బయటపడి తీవ్రగా యాలతో బాధపడుతూ సౌదీ జుబెయిల్ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. డబ్బులు లేక సరైన వైద్యం అందక, మహేష్ పరిస్థితి విషమంగా మారుతుండగా, ఈ విషయం తెలుసుకున్న కేటిఆర్, సిరిసిల్ల నియోజకవర్గం మండెపల్లిలోని మహేష్ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబానికి భరోసా కల్పించారు. మహేష్‌కు అండగా ఉంటానని, బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. సౌదీలో చికిత్స పొందుతున్న మహేష్‌తో వీడియో కాల్ ద్వారా చికిత్స పొందుతున్న మహేష్‌తో కేటిఆర్ మాట్లాడారు. అధైర్యపడవద్దని నాలుగైదు రోజుల్లోనే సొంత ఖర్చులతో నిన్ను స్వస్థలానికి తీసుకువస్తానని భరోసా ఇచ్చారు. వెంటనే సౌదీలో ఉన్న పార్టీ ప్రతినిధులు, తెలిసిన వారిని జుబెయిల్ ఆసుపత్రికి పంపించి మహేష్‌కు అండగా ఉండేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. చికిత్సకు అవసరమైన వైద్యు ఖర్చులు, విమాన ప్రయాణ ఖర్చులు తానే భరిస్తానని, ఆ కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటానని తెలిపారు. సౌదీలో ఉన్న పార్టీ ప్రతినిధులు, పరిచయాలు ఉన్న వారిని వెంటనే మహేష్ వద్దకు పంపించినట్లు తెలిపారు.

## వాకర్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాపక్షం/చొప్పదండి : చొప్పదండి పట్టణంలోని బాలుర మైదానంలో వాకర్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తాటిపల్లి అంజయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు గుర్రం సంజీవరెడ్డి, వైద్యుల రాజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎలిగేటి సురేష్, మహేశుని మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా దండె లింగన్న, జాయింట్ సెక్రటరీగా దండె సత్యానందం, సిరుపురం తిరుపతి, రమేష్, కోశాధికారిగా దూస రాము, ప్రచార కార్యదర్శిగా బొద్దుల కిషన్, కార్యవర్గ సభ్యులను, ముఖ్య సలహాదారులను ఎన్ను కున్నట్లు తెలిపారు.

## శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు



ప్రజాపక్షం/గంగాధర : భారత్ పాకిస్తాన్ మధ్య జరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో గంగాధర మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఇన్‌చార్జి ఎస్సై కె.స్వాతి ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. హిందూ ముస్లిం మతపెద్దలతో సమావేశం నిర్వహించి ఎలాంటి అవాంచణీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. పరిస్థితిని ఆరా చేసుకుని సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రకటనలు చేసే వారు, శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపట్ల అత్యంత కఠినంగా వ్యవహరిస్తా మన్నారు. తప్పుడు సమాచారం వ్యాప్తి జరగకుండా, ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇరు మతాల పెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ఆపే ప్రయత్నంలో బాలుడి మృతి



ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మైదంబండ గ్రామంలోని కొనుగోలు కేంద్రం వద్ద ట్రాక్టర్ లో వరి ధాన్యం లోడ్ చేస్తున్న క్రమంలో ట్రాక్టర్ కదలగా.. అక్కడే ఉన్న పందుల మహేందర్ (17) సంవత్సరాలు గల యువకుడు ఆపే ప్రయత్నం చేశాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు జారీ కింద పడ్డాడు. దీంతో అతనిపై నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు శ్రావణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముత్తారం ఎస్ఐ గోపతి నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అడ్డుకున్నా ఆగని చెరువు మట్టిదందా..!

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రా మానికి అనుకొని ఉన్న చెరువులో మట్టి దందాను అడ్డుకున్నప్పటికీ ఆగకుండా యథేచ్చగా అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది.జేసీబీలతో అయితే రాత్రి పగలు తేడా లేకుండా యథేచ్చగా చెరువుల్లో మట్టి తవ్వకాలు చేపడుతుండటంతో భారీ గుంతలు ఏర్పడి చెరువులు ప్రమాదకరంగా మారుతున్నాయి. ముత్తారం మండలంఅడవి శ్రీరాంపూర్, అమ్రాబాద్, ఊర చెరువు తో పాటు ఇంకా ఎన్నో చెరువుల్లో అక్రమంగా మట్టిని తరలిస్తు న్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి తరలింపు జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో చెరువుల్లో పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. వర్షాకాలంలో వర్షాలు కురిసి చెరువులు నిండితే ఈ గుంతల్లో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. కొంతమంది గ్రామస్తులు అడ్డుపడ్డప్పటికీ యథేచ్చగా చెరువుల్లోని మట్టిని తవ్వుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేకుండా దళారులు మట్టి దందాకు పాల్ప డుతున్నా పట్టించుకున్న వారే లేకుండా పోయారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.రెవెన్యూ, నీటి పారుదల శాఖ, భూగర్భ జలవనరులు, భూగర్భగనుల శాఖ అధికార బృందం తమకే మి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ దందా నిర్వహించేవారు ఒక్కో ట్రాక్టర్ మట్టిని రూ. ఎనిమిది వందల వరకు విక్రయిస్తున్నారు. అక్రమ వ్యాపారులు ఏ పార్టీ అధికారంలో ఉంటే అందులో చేరుతున్నారు. ఆయా శాఖల అధికారులతో పరిచయాలు పెంచుకొని మట్టి దందాలు కొనసాగిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ చెరువు మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.

## ఎప్‌సెట్ ఫలితాలలో 'ఆల్ఫోర్స్'

# చరిత్రాత్మక విజయం



### ఆల్ఫోర్స్ కీర్తి ప్రతిష్టలను దశదిశలు చాటిన విద్యార్థులు

### ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి

### ఐఐటి మెయిన్ ఫలితాలలోనూ అద్భుతఫలితాలు



ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి: ప్రభుత్వం ప్రకటించిన ఎప్‌సెట్ 2025 ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఫలితాలలో ఆల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచిఉత్తమ ర్యాంకులు సాధించారు. బి.వర్షిత్ 203, ఆదిబా ఫిర్దోజ్ 206, యం.ప్రణీత్ 250, కె.మనో జ్‌కుమార్ 286, బి.శ్రీ నిత్య 296, జి.కౌషల్ ప్రియ 339, జి.రిషిత 438, జె.అనూష 447. కె.అర్చన 485, యండి అబ్దుల్ జిషాన్ 551, సిహెచ్ శ్రీనిధి 567, కె.వీరేంద్ర ప్రసాద్ 572, యం.రోహిత్‌రెడ్డి 606, అబ్దుల్ మేర్ 614, హాస్న హవీష్ 639, పి.శ్రీనిత్య రెడ్డి 704, కె.శ్రీరాంచరణ్ 732, కె.హాసిని 735, రాంసకోరిన్ 738, డి.సుమగ్జయ 752, ఎల్.శరణ్య765, జి.సింధు763, బి.అభిజ్ఞ801, జె.వామిక 807, వి.అక్షయ్ 831, డి.హరిశంకర్ 838, బి.భువనకృతి 839,ఎ.శశిప్రీతమ్ 853, కె.సాయిశ్రేయాన్స్‌రెడ్డి 908, వి.హృషికేష్ 920, మహ్మద్ సఫ్రోజ్ 927, కె.గాయత్రి 992, ఎ.శ్రీనిజరెడ్డి 997వ ర్యాంకు సాధించారు. 33 మంది విద్యార్థులు వెయ్యిలోపు సాధించడం విశేషం, 72మంది విద్యార్థులు 2వేల లోపు ర్యాంకులు, 105 మంది విద్యార్థులు 3 వేల లోపు, 192 మంది విద్యార్థులు 5 వేల లోపు ర్యాంకులు సాధించి ఆల్ఫోర్స్ కీర్తి ప్రతిష్టలను దశదిశలా చాటారని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. తక్కువ మంది విద్యార్థులతో అత్యధిక ర్యాంకులు సాధించడం అల్ఫోర్స్‌కు మాత్రమే సాధ్యమని పేర్కొన్నారు. ఇటీవల ప్రకటించబడిన ఐఐటి మెయిన్ ఫలితాలలోనూ ఆల్ఫోర్స్ చరిత్రాత్మక విజయం సాధించిందని తెలిపారు. 461 మంది విద్యార్థులు ఐఐటి అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించడం మరో సంచలనమని, పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల కృషితో అల్ఫోర్స్ ఇంతటి ఘన విజయాలు సాధించగలుగుతుందని తెలిపారు. రాబోయే ఐఐటి అడ్వాన్స్‌డ్,నీట్ ఫలితాలోనూ ఆల్ఫోర్స్ మహోన్నత ర్యాంకులతో ముందంజలో ఉంటుందని విశ్వసించారు.ఎప్‌సెట్2025 ఫలితాలలో ర్యాంకులు సాధించిన ఆల్ఫోర్స్ చిన్నారులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. విజయానికి తోడ్పడిన అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.



## మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలి

ఐదవ మహాసభల కరపత్రాలను ఆవిష్కరించిన పౌర హక్కుల సంఘం నేతలు



ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి : పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఐదవ మహా సభలు 14వ తేదీ బుధవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటలు వరకు ఫిల్మ్‌భవన్ కరీంనగర్‌లో జరుగుతాయని పౌర హక్కుల సంఘం నేతలు తెలిపారు. ఆది వారం తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద మహాసభ కరపత్రం ఆవిష్కరించారు.ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభలో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలి అనే అంశంపై పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మ ణ్,వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్‌పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి ఎన్.నారాయణరావు పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాధన కుమా రస్వామీలు ప్రసంగిస్తారని, ఈ సభకు రాజగోపాల్ అధ్యక్షతన, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ అధ్యక్షత వహిస్తారని తె లిపారు. రెండు నెలలుగా దేశవ్యాప్తంగా మేధావులు ప్రజాస్వామ్యవాదులు హక్కుల సంఘాలు,కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీతో శాంతిచర్చలు జరపాలని విజ్ఞప్తి చేస్తున్నాయని, మావోయిస్టు పార్టీ రెండు లేఖల ద్వారా యూట్యూబ్ ఇంటర్వ్యూ ద్వారా శాంతి చర్చలకు తాము సిద్ధమని ఆరు నెలల వరకు కాల్పుల విరమణ పాటిస్తామని తెలిపారన్నారు. ఇదే సమయంలో ప్రభుత్వం, ప్రతిపక్ష బిఆర్‌ఎస్ కెసిఆర్‌లు చర్చలకు సమ్మతమని కేంద్రానికి లేఖరాస్తామన్నారని, దేశంలోని వామ పక్షాలు ప్రతిపక్షాలు కేం ద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి కగార్ ఆపరేషన్ నిలిపివేసి శాంతి చర్చలు మావోయిస్టు పార్టీతో జరిపాలనే అంశంపై కరీంనగర్ లో పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఐదవ మహాసభలలో ప్రజాస్వామి కవా దులు మేధావులు విద్యార్థులు ప్రజలు పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని విజ్ఞ ప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మా దన కుమారస్వామి, పుల్ల సుచరిత, నార వినోద్, బి లక్ష్మ ణ్, బండారి రాజలింగయ్య, నక్క సత్యనారాయణ, బాలసాని రాజయ్య, గుమ్మడి కొమురయ్య, టి.సత్యనారాయణ, పులిపాక రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు జీవన్‌రెడ్డి పెద్దదిక్కు

మంత్రి దామోదర రాజనర్సింహ



ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి : కాంగ్రెస్‌లో మా జీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి సీనియర్ నాయకులు, కాంగ్రెస్‌కి ఆయన పెద్ద దిక్కు అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సి ంహా వ్యాఖ్యానించారు.రెండు రోజుల జగిత్యాల జిల్లా పర్యటన నిమిత్తం శని వారం రాత్రి ధర్మపురి విచ్చేసిన మంత్రి రాజనర్సింహ ఆదివారం ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వా మిని దర్శించుకుని జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వైద్య సేవలు, ఆసుపత్రుల బలోపేతంపై అధికారులతో సమీ క్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మా జీ మంత్రి జీవన్‌రెడ్డి ఇంటికి ప్రభుత్వ విప్‌లు అడ్లూరిలక్ష్మ ణ్ కుమార్, ఆది శ్రీనివాస్‌లతో కలిసి మంత్రి రాజానర్సింహ చేరుకొని కొంత సేపు ముచ్చటించారు.ఈ సందర్భంగా విలేకరులు జగి త్యాలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్, తాజా మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిల మధ్య వార్ నడుస్తుందన్న ప్రశ్నలకు మంత్రి రాజానర్సింహ సమాధానమి స్తూ మేము జీవన్‌రెడ్డి శిష్యులమని, ఆయన కాంగ్రెస్‌కి పెద్ద దిక్కు, పెద్ద అసెట్ అంటూ చెప్పారు.అసలు, సిసలైన కాంగ్రెస్ మేము ఆయన శ్రేయోభిలాషులమన్నారు. పార్టీలో అందరికంటే సీనియర్ నాయకులు, పార్టీకి మంచి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. జీవన్‌రెడ్డి గురించి పార్టీ ఆలోచిస్తుందని, ఆయనకు మంచి జరుగాలానే ప్రయత్నం చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నందయ్యా, కొత్త మోహన్, దుర్గయ్య, నక్క జీవన్, రఘువిర్ గౌడ్, గుండా మధు, గిరిధర్, బొల్లి శే ఖర్, నాగరాజు, నేహాల్, భారీ, తదితరులు పాల్గొన్నారు.

## పవర్ లిఫ్టింగ్‌లో ఐశ్వర్యకు బంగారు పతకం



ప్రజాపక్షం/ధర్మపురి: ఏషియన్ పవర్ లిఫ్టింగ్ యూనివర్సిటీ ఛాంపియన్ షిప్ పోటీల్లో ధర్మపురి విద్యార్థినిలు అదిరే ప్రదర్శనతో పతకాలు కొల్లగొట్టారు. ఉత్తరాఖండ్‌లోని డెహ్రా డూన్‌లో జరుగుతున్న ఏషియన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో ఆదివారం 52కిలోల కేటగిరిలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ ధర్మపురి పట్టణానికి చెందిన శ్యాం రావు ఐశ్వర్య గోల్డ్ మెడల్ సాధించింది. అదే విధంగా ఇదే ఛాంపియన్ షిప్ పోటీలలో 76 కేజిల విభాగంలో పోటీపడ్డ మండలంలోని కమలాపూర్‌కు చెందిన కుమ్మరి పూజిత రజత పతకం సాధించింది. ఎస్ఆర్ఎల్ కాలేజిలో పూజిత బీకాం సెకండ్ ఇయర్ చదువుతుంది. ధర్మపురి మండలంలోని మగ్గిడి ఆదర్శ పాఠశాల పూర్వ విద్యార్థినిలైన వీరిని కళాశాల ప్రిన్సిపాల్ పద్మ, పీడి తమ్మిడి రాజేందర్ అభినందించారు.

## ఆసుపత్రులలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

* వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ




ప్రజాపక్షం/ధర్మపురి : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో మెడికల్, నర్సింగ్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పనతో పాటు సిబ్బంది ఖాళీలను భర్తీ చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంలో ఆదివారం శ్రీ లక్ష్మి నృసింహ జయంతి వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో మాట్లా డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఏడాదిన్నర కాలంలో అన్ని శాఖల్లో కలిపి 56వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన అవసరం మేరకు ఆసుపత్రులను ఏర్పాటు చేస్తున్నామని గోల్డెన్ అవర్‌లో రోగిని ఆసుపత్రికి చేర్చేలా సౌకర్యాలు మెరుగు పరుస్తున్నామన్నారు. రాష్ట్రంలో మొదటి దశలో 24ట్రామా సెంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. విప్ లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మపురిలోని మాతాశిశు సంక్షేమ ఆసుపత్రి ని ర్మాణానికి పూర్తి స్థాయిలో నిధులు కేటాయింపు, సిబ్బంది నియామకం జరపకపోవడంతో ఆ సుపత్రిలో వైద్య సేవలు ప్రజలకు అందుబాటు లో కి రాలేదన్నారు. ఈవిషయాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి మాతా శిశు ఆసు పత్రి సమస్యలు తీసుకెళ్లానని మంత్రి వెంటనే స్పందించి రూ.లు కోటి 50లక్షలు నిధులు మం జూరు చేయడంతో పాటు సిబ్బంది నియామకం చేపట్టి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకోచ్చేలా చర్యలు చేపట్టారని తెలిపారు.పాశిగామ సమీపంలో 200 ఎకరాల్లో ట్రామా సెంటర్ ఏర్పాటుకు మంత్రిని కోరానని లక్ష్మ ణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయ కులు ఎస్. దినేష్, జువ్వాడి కృష్ణారావు, వేముల రాజేష్, చిలుముల లక్ష్మ ణ్, చీపిరిశెట్టి రాజేష్, జక్కు రవీందర్, జె. సుముఖ్, ఎస్. ప్రసాద్, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అధైర్య పడొద్దు..అండగా ఉంటా

రంగు మారినా, తడిసిన ధాన్యాన్ని కొంటాం

కేంద్రాల్లో అందుబాటులో టార్పాలిన్ కవర్లు

పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్ : అకాల వర్షాల వల్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిన రైతులు అధైర్యపడవద్దని అండగా నేనుంటానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు భరోసా ఇచ్చారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్లో వర్షం వల్ల తడిసిన ధాన్యాన్ని ఎమ్మెల్యే విజయ రమణారావు ఆదివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వర్షం వల్ల ధాన్యం అనుకోకుండా తడిస్తే రైతులు చిన్న చిట్కా పాటించాలని సూచించారు.తడిసిన ధాన్యంపై ఉప్పు నీళ్లు చల్లితే ధాన్యం రంగు మారకుండా, గింజ నలుపురంగులోకి మార కుండా ఉంటుందని, రైతులు ఈ చిట్కా పాటించాలని కోరారు. పెద్దపల్లి వ్యవసాయ మా ర్కెట్, గౌరెడ్డిపేట కేంద్రాల్లో వర్షం వల్ల కొంతమేర ధాన్యం తడిసిందన్నారు. తడిసిన ధాన్యం, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు కొనుగోలు చేయి స్తా నని, తూకం వేసిన తరువాత ఆ బస్తాలను వేరుగా ఉంచితే రైస్ మిల్లర్లకు పంపించేందుకు చర్యలు తీసుకుంటానని, నిర్వాహకులు ఆదిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉన్నాయని, వ్యవసాయ మార్కెట్లో సుమారుగా 16 వేల క్వింటాళ్ల వరకు వరి ధాన్యం వచ్చిందని, ఇందులో 11వేల క్వింటాళ్ల వరకు కొనుగోలు చేసి మిల్లులకు తరలించినట్లు తెలిపారు. మిగిలిన ధాన్యాన్ని, ఇంకా వచ్చే ధాన్యాన్ని కూడా వేగవంతంగా కొనుగోలు పూర్తి చేసేలా అధికారులకు అదేశాలిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని ధాన్యం కొనుగోలు మరింత వేగవంతం చేస్తా మని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప, వైస్ చైర్మన్ కూర మల్లారెడ్డి, డైరెక్టర్లు, మాజీ చైర్మన్ జడల సురేందర్, మార్కెట్ అధికారులు, కాంగ్రెస్ నాయ కులు భూషణవేన సురేష్ గౌడ్, నూగిల్ల మల్లయ్య, బూతగడ్డ సంపత్, అమ్రేశ్, పాగాల శ్రీకాంత్, మసూద్, నదీం, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## రైతులను నట్టేట ముంచిన ఆడ,మగ సీడ్ కంపెనీలు?

- రైతులకు కంపెనీ ధర తక్కువ.. ప్రైవేటు వ్యాపారుల ధర ఎక్కువ చెల్లింపులు..?

ప్రజాపక్షం/ముత్తారం : రైతులను నట్టేట ముంచుతున్న పలు అడ,మగ సీడ్ కంపెనీలు అడ మగ సీడ్ రంగంలో తమ కంపెనీకి ఎంతో గొప్ప పేరు ఉందని ఊక దంపుడు ప్రచారం చేసుకుని పలు కంపెనీలు రైతులను నట్టేట ముంచింది.ఒక ఎకరం కాదు.. రెండు ఎకరాలు కాదు..ఏకంగా వందలాది ఎకరాల్లో రైతులు ఆడ, మగ వరి పంట సాగు చేశారు.అయితే రైతుకు ఒప్పందం ప్రకారం ఒక్కొక్క సీడ్ కంపెనీ ధరలు ఒక క్వింటాలకు రూ.7000 నుండి సుమారు 13000 లోపు ధర ఉంటుందని విత్తనాలు ఇచ్చే సమయంలో ఆర్గనైజర్లు, సూపర్‌వైజర్లు తెలిపినట్లు రైతులు పలువురు పేర్కొన్నారు. రైతు పండించిన ఒక క్వింటాలకు ఇక్కడి ఆర్గనైజర్లు ఇచ్చిన సుమారు రూ.7000 నుంచి రూ.10000ల ధర ఉన్న ఒక క్వింటాల్ వార్డులను బయట వ్యాపారులు ఒక క్వింటాలకు రూ.15000 నుండి రూ.20,000 లోపు ధర చెల్లిస్తామని కొనుగోలు చేయడంతో రైతులు మోసపోయామని దిగులు చెందుతూ పండిన పంటలను ఆర్గనైజర్లకు తెలపకుండా బయట వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. రైతులు ఆడ మగ సీడ్ కంపెనీ వారితో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆ నోట ఈ నోట బహిర్గతంగానే చెప్పుకుంటున్నారు తాముతీవ్రంగా నష్టపోయామంటూ రైతులు వాపోతున్నారు. గ్రామాల్లో ఆర్గనైజర్లను ఏర్పాటు చేసి ఈ కంపెనీ ఆడ,మగ విత్తనాలను రైతులు అంట కట్టింది. ఇది ఇలా ఉంటే అగ్రిమెంట్ ప్రకారంగా చివరికి పంట దిగుబడి రాకపోవడంతో తాము కంపెనీని నమ్ముకొని మోసపోయామని రైతులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# క్రీడ

## 16 నుంచి ఐపిఎల్ మ్యాచ్‌లు.. ఫైనల్ వేదిక మార్పు..!

క్రికెట్ అభిమానులకు గుడ్‌న్యూస్. ఐపిఎల్ 18వ సీజన్ త్వరలోనే తిరిగి ప్రారంభం కానుంది. భారత్, పాకిస్థాన్‌లు కాల్పుల విరమణకు అంగీకరించడంతో తదుపరి మ్యాచ్‌ల నిర్వహణకు బీసీసీఐ సిద్ధమవుతోంది. మే 16వ తేదీ నుంచి లీగ్‌ను పునరుద్ధరించాలని బీసీసీఐ భావిస్తోంది. అందుకోసం త్వరలోనే కొత్త షెడ్యూల్ ప్రకటించనుంది. ఫైనల్ ఫైట్ మే 30న లేదంటే జూన్ 1 న జరగునందని సమాచారం.




అయితే.. ముందగా నిర్ణయించినట్టు ఫైనల్ మాత్రం ఈడెన్ గార్డెన్స్‌లో జరగదనే వార్తలు వినిపిస్తున్నాయి. సరిహద్దుల్లో ఉద్రిక్తతల కారణంగా ఐపిఎల్‌ను వారం రోజులు వాయిదా వేస్తున్నట్టే మే 9న బీసీసీఐ ప్రకటించింది. పరిస్థితులు ఇలానే కొనసాగితే లీగ్‌ను మొత్తానికే రద్దు చేయడం లేదా దక్షిణాది రాష్ట్రాల్లో నిర్వహించాలని భారత బోర్డు భావించింది. అయితే.. మే 10న ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకరించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దాంతో, మే 16, 17 నుంచి లీగ్‌ను జరిపేందుకు బీసీసీఐ సన్నాహకాలు చేస్తోంది. ఇదే విషయమై ఐపిఎల్ ఫ్రాంచైజీలకు సమాచారాన్ని ఇచ్చింది బీసీసీఐ.

'కాల్పుల విరమణ వార్త తెలియగానే ఐపిఎల్ చైర్మన్, బీసీసీఐ అధికారులు సమావేశం అయ్యారు. వాయిదా పడిన ఐపిఎల్ పునరుద్ధరణపై ఆదివారం సుదీర్ఘంగా చర్చించారు. ఫ్రాంచైజీలతో పాటు, బ్రాండ్‌కాస్టింగ్ సంస్థలతో మాట్లాడి కొత్త షెడ్యూల్‌ను ప్రకటిస్తాం. అందరూ కోరుకుంటున్నట్టే లీగ్‌ను త్వరితగతిన పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నాం' అని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వెల్లడించాడు.

### హైదరాబాద్‌లో క్వాలిఫయర్ 1

ఐపిఎల్ కొత్త షెడ్యూల్ వస్తే.. లక్నోలోని ఏక్నా స్టేడియం వేదికగా లక్నో సూపర్ జెయింట్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో క్రికెట్ పండుగ మళ్లీ అభిమానులను అలరించనుంది. హైదరాబాద్‌లో క్వాలిఫయర్ 1, కోల్‌కతాలో క్వాలిఫయర్ 2 జరిగే అవకాశముంది. మే 30 లేదా జూన్ 1 నిర్వహించే ఫైనల్‌తో విజేత ఎవరో తేలిపోనుంది. నాలుగు ప్లే ఆఫ్స్ బెర్తులకు 7 జట్లు పోటీపడుతున్న విషయం తెలిసిందే.

## ముక్కోణపు వన్ డే సిరీస్

శ్రీలంక చిత్తు..

# భారత్ విజయం



విధ్వంసక సెంచరీతో జట్టు విజయంలో భాగమైన మంధాన 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికైంది. ఈ సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన స్నేహ్ రానా 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును స్వీకరించింది.

వన్డే వరల్డ్ కప్ ముందు భారత మహిళల జట్టు అద్భుత విజయం సాధించింది. ముక్కోణపు సిరీస్ ఫైనల్లో శ్రీలంకను చిత్తుగా ఓడించింది. ఆదివారం జరిగిన టైటిల్ పోరులో స్మృతి మంధాన (116) సూపర్ సెంచరీతో భారీ స్కోర్ చేసిన టీమిండియా.. అనంతరం ప్రత్యర్థిని 245 పరుగులకే ఆలౌట్ చేసింది. దాంతో, 97 పరుగులతో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన జయభేరి మోగించింది. తద్వారా నిరుడు ఆసియా కప్ ఫైనల్లో ఎదురైన ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ముక్కోణపు సిరీస్‌లో లీగ్ దశ నుంచి అదరగొట్టిన టీమిండియా ఫైనల్లో పంజా విసిరింది. బలమైన శ్రీలంకను చిత్తు చిత్తుగా ఓడించి ఆసియా కప్ ఓటమికి బదులు తీర్చుకుంది. ప్రేమదాస స్టేడియంలో ఓపెనర్ స్మృతి మంధాన(116) రికార్డు సెంచరీతో విరుచుకుపడగా.. బౌలర్లు లంక బ్యాటర్లకు దడ పుట్టించారు. అమన్‌జీత్ కౌర్ (354) నిప్పులు చెరగగా.. మిడిల్ ఓవర్లలో స్నేహ్ రానా(438) వికెట్ల వేట కొనసాగించింది. దాంతో, ఆతిథ్యలం 245 పరుగులకే ఆలౌటయ్యింది. విధ్వంసక సెంచరీతో జట్టు విజయంలో భాగమైన మంధాన 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికైంది. ఈ సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన స్నేహ్ రానా 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును స్వీకరించింది. లీగ్ దశలో శ్రీలంకను ఓడించి.. ఆ తర్వాతి పోరులో ఓడిన భారత్ ఫైనల్లో ఛాంపియన్ ఆటతో రెచ్చిపోయింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఓపెనర్లు ప్రతీకా రావల్ (30), స్మృతి మంధాన(116 101 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సర్లు) శుభారంభం ఇచ్చారు. ఆ తర్వాత హర్లీన్ డియోల్(47), జెమీమా రోడ్రిగ్స్(44) కెప్టెన్ హర్మన్‌ప్రీత్(41)లు లంక బౌలర్లను ఉతికేశారు. మిడిలార్డర్ మెరుపులతో ప్రత్యర్థికి 343 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది భారత్. ఛేదనలో అమన్‌జోత్ కౌర్ చెలరేగడంతో శ్రీలంక టాపార్డర్ విఫలమైంది.

### మలుపు తిప్పిన రానా

లంక ఓపెనర్ హాసినీ పెరీరా(0)ను డకౌట్ చేసిన అమన్‌జోత్.. ఆ తర్వాత డేంజరస్ విష్మీ గుణరత్నేను బౌల్డ్ చేసింది. ఓపెనర్ల వైఫల్యంతో కష్టాల్లో పడిన జట్టును కెప్టెన్ చమరి ఆటపట్టు(51), నీలాక్షి డిసిల్వా(48) ఆదుకున్నారు. వీళ్లిదరూ 50 ప్లస్ భాగస్వామ్యంతో భారత బౌలర్లను విసిగించారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని స్నేహ్ రానా విడదీసింది. ఆటపట్టును బౌల్డ్ చేసిన తను మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ఆ తర్వాత సమరవిక్రమ(26), అనుష్కా సంజీవని(28)లు పోరాడినా రానా తిప్పేయడంతో లంక ఆలౌట్ అంచున నిలిచింది. ఈ ఆల్‌రౌండర్ అనుష్క వికెట్ తీయడంతో లంక 245 పరుగులకే కుప్పకూలింది. దాంతో, భారత జట్టుకు 97 పరుగుల భారీ విజయం సొంతమైంది.

### దోహా డైమండ్ లీగ్‌లో నీరజ్.. బరిలో ముగ్గురు భారత అథ్లెట్లు!

భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల కారణంగా ఎన్‌సీ క్లాసిక్‌ను వాయిదా వేసిన నీరజ్ చోప్రా ప్రతిష్ఠాత్మక దోహా డైమండ్ లీగ్‌లో బరిలోకి దిగుతున్నాడు. ఇప్పటికే ఈ లీగ్‌లో రెండు పతకాలు కొల్లగొట్టిన నీరజ్.. టైటిల్‌పై గురి పెట్టాడు. మే 16న ఈ టోర్నీ మొదలవ్వనున్న ఈ పోటీల్లో బడిసె వీరుడితో పాటు భారత్‌కు చెందిన మరో ముగ్గురు పాల్గొననున్నారు. జావెలిన్ త్రోలో కిశోర్ జెనా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. నిరుడు 9వ స్థానంతో నిరాశపరిచిన అతడు పతకంపై కన్నేశాడు. జాతీయ రికార్డు నెలకొల్పిన గల్వీర్ సింగ్ 5 వేల మీటర్ల పరుగులో.. మహిళల విభాగంలో పరుల్ చౌదరీ 3000 మీటర్ల స్టీపుల్ ఛేజ్‌లో బరిలోకి దిగుతున్నారు. కానీ, ఈసారి కూడా




అతడికి ఒలింపిక్ కాంస్య పతక విజేత అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), 2024 విన్నర్ జాకబ్ వాద్లెక్(చెక్ రిపబ్లిక్)లతో గట్టి పోటీ ఎదురయ్యే అవకాశముంది. జర్మనీ అథ్లెట్లు జులియన్ వెబర్, మాక్స్ డెహ్నింగ్, జులియస్ యెగో(కెన్యా), రోడెరిక్ డీన్(జపాన్)లు పాల్గొంటున్నారు

## 'సిందూరం' ఎక్కడని ప్రపంచం అడుగుతోంది

### అమితాబ్ బచ్చన్ ఎమోషనల్ పోస్టు



పహల్గాం ఉగ్రదాడి ఘటన అందరినీ కలచివేసింది. ఆ హృదయవిదారక ఘటనపై ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్ తాజాగా ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. కళ్ల ముందే భర్తను పోగొట్టుకున్న నవ వధువు శోకాన్ని ఉద్దేశిస్తూ తన తండ్రి రాసిన పద్యంలోని ఓ లైన్‌ని ప్రస్తావించారు. ''భార్యతో కలిసి విహార యాత్రకు వెళ్లిన భర్తను ఉగ్రమూక కాల్చి చంపింది. భర్తను చంపొద్దంటూ భార్య ఏడుస్తూ ఎంతగా వేడుకున్నా ఆ ఉన్మాది వినలేదు. ఆమె నుదుట సిందూరం లేకుండా చేశాడు. కళ్ల ముందే భర్త చనిపోవడాన్ని తట్టుకోలేని ఆమె 'నన్ను కూడా చంపేయ్' అంటూ మోకరిల్లింది. అప్పుడు ఆ రాక్షసుడు.. 'నిన్ను చంపను. వెళ్లి ... చెప్పుకో'' అంటూ పొగరు చూపించాడు'' ''కుమార్తెలాంటి ఆమె మానసిక స్థితి చూస్తే.. ''ఆమె వద్ద చితా భస్మం ఉన్నా సిందూరం ఎక్కడని ప్రపంచం అడుగుతుంది'' అని నాన్న రాసిన పద్యంలోని లైన్ గుర్తొచ్చింది. 'అందుకే నేను సిందూరం ఇస్తున్నా.. ఆపరేషన్ సిందూర్' అని తాజాగా ప్రభుత్వం చేపట్టిన సైనిక చర్యను ప్రస్తావించారు. జైహింద్. భారత సైన్యమా.. నువ్వు ఎప్పటికీ వెనకడుగు వేయవు. నీ ప్రయాణం ఎప్పటికీ ఆగదు'' అని పేర్కొన్నారు.

## దర్శకుడిగా విశ్వక్ సేన్



మాస్ హీరో విశ్వక్ సేన్‌కి హీరోగా మంచి ఫాలోయింగ్ ఉంది. పైగా అటు దర్శకుడిగానూ గుర్తింపు తెచ్చుకున్న విషయం తెలిసిందే. విశ్వక్ సేన్ దర్శకత్వంలో వచ్చిన 'ఫలక్‌నుమా దాస్', 'దాస్ కా ధమ్కీ' చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తాజాగా విశ్వక్ సేన్ మరోసారి మెగాఫోన్ పట్టేందుకు రెడీ అయ్యారు. '#కల్ట్' సినిమా రూపొందిస్తున్నారు. నూతన నటీనటులతో ఈ సినిమా రెడీ కాబోతుంది. కాగా తాజాగా '#కల్ట్' పూజా కార్యక్రమం హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోస్‌లో జరిగింది. నేటి నుంచి రెగ్యులర్ షూట్ కూడా జరగబోతుంది. కరాటే రాజు, సందీప్ కాకరాల సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రవి బస్రూర్ స్వరాలు అందించనున్నారు. ఈ చిత్రానికి తరుణ్ భాస్కర్ సంభాషణలు అందించబోతున్నారు. తెలుగుతోపాటు హిందీ, జపనీస్, స్పానిష్, ఇంగ్లిష్ భాషల్లో ఈసినిమా రిలీజ్ కాబోతుంది.

# రీల్

## ఆ వార్తల్లో 'నిజం' లేదు

– సుమంత్



నటుడు సుమంత్, నటి మృణాల్ ఠాకూర్ వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారంటూ ఇటీవల జోరుగా ప్రచారం జరిగింది. వీరిద్దరూ కలిసి దిగిన ఓ ఫొటో కూడా నెట్టింట వైరల్‌గా మారింది. వీటిపై తాజాగా సుమంత్ స్పష్టతనిచ్చారు. తన తదుపరి చిత్రం 'అనగనగా' ప్రమోషన్స్‌లో భాగంగా పెళ్లి వార్తలపై స్పందించారు. ఆయా వార్తల్లో నిజం లేదని పేర్కొన్నారు. సోషల్‌మీడియాను తాను పెద్దగా ఉపయోగించనని.. అందుకే ఈ వార్తలు తన దృష్టికి రాలేదని సుమంత్ తెలిపారు. నెట్టింట వైరల్‌గా మారిన ఫొటో తాము 'సీతారామం' ప్రమోషన్స్ సమయంలో తీసుకున్నామని వివరించారు. మరో ఇంటర్వ్యూలో ఆయన పెళ్లిపై మాట్లాడుతూ.. వైవాహిక బంధంలోకి మరోసారి అడుగుపెట్టే ఉద్దేశం లేదన్నారు. సుమంత్‌కు గతంలోనే వివాహం జరిగిన విషయం తెలిసిందే. నటి కీర్తి రెడ్డిని పెళ్లి చేసుకున్నారు. కొంతకాలానికే వీరిద్దరూ విడిపోయారు.

## 'డ్రాగన్'లో శ్రద్ధా కపూర్?



ప్రశాంత్ నీల్ – ఎన్టీఆర్ కలయికలో రాబోతున్న 'డ్రాగన్' సినిమా పై రోజుకొక రూమర్ వినిపిస్తోంది. ఐతే, తాజాగా ఈ సినిమా గురించి వినిపిస్తున్న అప్ డేట్ ప్రకారం ఈ సినిమాలో మరో హీరోయిన్ కనిపించబోతుంది. ఓ కీలక పాత్ర కోసం శ్రద్ధా కపూర్‌ను తీసుకునే ఆలోచనలో టీమ్ ఉందని తెలుస్తోంది. ఆమె పాత్ర కథకు అనుగుణంగా సెకండ్ హాఫ్‌లో వస్తోందని టాక్. మరి ఈ వార్తలో ఎంతవరకు వాస్తవం ఉందో చూడాలి. కాగా 'డ్రాగన్' సినిమాని ఎన్టీఆర్ కెరీర్‌లోనే అత్యుత్తమ సినిమాల్లో ఒకటిగా చేయాలని ప్రశాంత్ నీల్ ప్రయత్నం చేస్తున్నాడట. అందుకే, ఈ సినిమా స్క్రిప్ట్ కోసం ప్రశాంత్ నీల్ చాలా టైమ్ తీసుకున్నాడు. కాబట్టి, ఇప్పటి వరకూ ప్రశాంత్ నీల్ తీసిన అన్ని సినిమాల్లో కల్లా బెస్ట్ సినిమా ఇదే అవుతుందని అంచనాలు ఉన్నాయి. ఆ మధ్య ఈ సినిమా గురించి ప్రశాంత్ నీల్ మాట్లాడుతూ.. 'ఆడియన్స్ ఊహించని స్థాయిలో ఈ మూవీని తీస్తున్నాను. ఎన్టీఆర్ పై అభిమానంతో ఈ సినిమా చేస్తున్నాను అని చెప్పుకొచ్చాడు. మొత్తానికి భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న 'ప్రశాంత్ నీల్ – ఎన్టీఆర్' సినిమా గురించి నిత్యం ఏదొక రూమర్ వినిపిస్తూనే ఉంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి ఈ సినిమాని నిర్మిస్తున్నాయి. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.




## ప్రభుత్వాలు మారినా ప్రజల బతుకులు మారలేదు

### ప్రజా సమస్యల పరిష్కారనికై పోరాటాలు నిర్వహించాలి

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి

**ప్రజాపక్షం/బెజ్జంకి:** ప్రభుత్వాలు మారిన ప్రజల బతుకులు మాత్రం మారడం లేదని ఏ ప్రభుత్వం అధికారం చేపట్టిన ప్రజలకు కూడు, గుడ్డ, విద్య, వైద్యం అందించవలసిన భాధ్యత పాలకులదే అని లేదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు కా.చాడ వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం మెదక్ జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో సిపిఐ 13వ మండల మహసభ నిర్వహించగా ఈ మహసభకు ముఖ్య అతిథిగా వారు హాజరై పార్టీ జెంధాను ఆవిష్కరించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోతిరెడ్డి వెంకట్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మహసభలో ఆయన మాట్లాడారు. భారత దేశంలో విభిన్న మతాలు, సాంస్కృతులు, సాంప్రదాయాలు, భాషలు, భావాలు నిలయంగా ఉన్న దేశమని దేశంలో భిన్నత్వంలో ఏకత్వమని రాజ్యాంగంలో మనకు హక్కులు కల్పించారని పాలకులు దీనిని తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం అమలు అవుతుందంటే ఆ ఘనత ఎర్రజెండా పార్టీకే దక్కుతుందన్నారు. కార్మిక హక్కుల పరిష్కారమే ధ్యేయంగా శ్రమకు తగ్గ ఫలితం కోసం ఏఐటియూసి ఆధ్వర్యంలో 20న తలపెట్టనున్న సార్వత్రిక సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకోని వాటిని అమలయ్యే దిశగా ప్రజల పక్షాన సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అనంతరం సిద్దిపేట సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దున్నేవాడికే భూమి అనే నినాదంతో భూమి లేని నిరుపేదలకు లక్షల ఎకరాల భూములను పంచిన ఘనత వెట్టి చాకిరి విముక్తికి వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర కేవలం భారత కమ్యూనిస్టు పార్టీకే ఉందన్నారు. పేద బడుగు బలహీన వర్గాలకు అండగా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిపిఐపార్టీ పనిచేస్తుందన్నారు. ఈ సమావేశలో సిపిఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కనుకుంట్ల శంకర్, సంగెంమధు, ఏఐటియూసి జిల్లా అధ్యక్షులు కిష్టపురం లక్ష్మణ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

## భారత సైనిక బలగాలు రావల్పిండిలోనూ

# బలాన్ని చాటాయ్

### లక్నోలో బ్రహ్మోస్ ఉత్పత్తి యూనిట్‌ను ప్రారంభించిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

### ఇండియన్ ఆర్మీ పాకిస్థాన్ సైనిక స్థావరాలపై దాడికి మాత్రమే పరిమితం కాలేదని వెల్లడి




**న్యూఢిల్లీ :** భారత సైనిక బలగాలు 'ఆపరేషన్ సిందూర్' కింద సరిహద్దు సమీపంలోని పాకిస్థాన్ సైనిక స్థావరాలపై దాడి చేయడానికే పరిమితం కాకుండా పాకిస్థాన్ సైనిక ప్రధానకార్యాలయం ఉన్నటువంటి రావల్పిండిలోనూ వారి బలాన్ని చాటాయని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కితాబు ఇచ్చారు. పహల్గామ్ ఉగ్రదాడి ద్వారా అనేక కుటుంబాలను తుడిచిపెట్టిన ఉగ్రవాదులు, భారత వ్యతిరేక శక్తులను భారత సైన్యం శిక్షించిందని ఆయన చెప్పారు. ఆదివారం లక్నోలో బ్రహ్మోస్ ఉత్పత్తి యూనిట్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన ఒక కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్య మాత్రమే కాదని, అది ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశ రాజకీయ, సామాజిక, వ్యూహాత్మక సంకల్పానికి ఒక ప్రతీక అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడం ద్వారా భారత్ ఆపరేషన్ సిందూర్‌ను మే 7న ప్రారంభించిందన్నారు. పాకిస్థాన్ చేసిన నేరపూరిత ఉగ్రదాడులకు ప్రతీకారచర్యలను ఆపరేషన్ సిందూర్ ద్వారా నిర్వహించడం జరిగిందని రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టంచేశారు. భారత్‌పాకిస్థాన్ శనివారం ఒక అవగాహనకు వచ్చి, ఇరుదేశాలు కూడా అన్ని రకాల కాల్పులు, సైనిక చర్యలను భూమి, గగనతలం, సముద్రం మీద నిలిపివేయాలని ప్రకటన చేసినట్లు మంత్రి చెప్పారు. దేశవ్యాప్తంగా భారత సైన్యాన్ని 'ఆపరేషన్ సిందూర్'ను విజయవంతం చేసినందుకు అభినందనలలో ముంచెత్తుతున్నారని రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. భారతదేశంలో ఉగ్రదాడులకు పాల్పడితే భారత బలగాల నుంచి ఎటువంటి పరిణామాలు ఎదురవుతాయనేది యావత్ ప్రపంచం ఇటీవల చూసిందని మంత్రి వివరించారు. ఉరి సంఘటన తర్వాత భారత సైన్యం ఏవిధంగా పాకిస్థాన్‌లోకి ప్రవేశించి సర్జికల్ స్ట్రైక్స్ చేశాయన్నది చూశారని, పుల్వామా దాడి తర్వాత బాలకోట్‌లో వైమానిక దాడులు ఏవిధంగా చేశారన్నది చూశారని, పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్థాన్‌లోకి ప్రవేశించి బహుళ దాడులను ఏవిధంగా నిర్వహించారన్నది యావత్ ప్రపంచం చూసిందని రాజ్‌నాథ్ విపులీకరించారు.ఉగ్రవాదానికి వ్యతిరేకంగా 'జీరో టోలరెన్స్‌ను' అనుసరించడం భారత్ విధానం అని, మన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని నూతన భారతదేశం సరిహద్దుకు ఇరువైపులా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఎలాంటి సమర్థవంతమైన చర్యలను తీసుకుంటుందన్నది స్పష్టమైందని ఆయన వివరించారు.

**బ్రహ్మోస్ క్షిపణి ఒక ఆయుధం కాదు.. భారత సైనిక బలగాల బల సందేశం : రాజ్‌నాథ్‌సింగ్**

బ్రహ్మోస్ కేవలం ఒక ఆయుధం కాదని, భారత సైనిక బలగాల 'బలం సందేశం' అని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. లక్నోలో ఆదివారం సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ వ్యవస్థ అతిపెద్ద ఇంటిగ్రేషన్ టెస్టింగ్ ఫెసిలిటీని ఆయన ప్రారంభించిన సందర్భంగా తన సందేశం ఇచ్చారు.'బ్రహ్మోస్ ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిస్సైల్స్. బ్రహ్మోస్ అనేది ఒక ఆయుధం కాదు, కానీ అది తనకు తాను ఇచ్చే ఒక సందేశం. మన సైనిక బలగాలకు సంబంధించి ఒక బల సందేశం. శతృవుల పట్ల ఒక సందేశం. సరిహద్దులను సురక్షితంగా కాపాడుకోవడంలో ఒక సందేశం' అని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.

## మే 15 నుంచి కాళేశ్వరం త్రివేణి సరస్వతి పుష్కరాలు

### దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఈ నెల 15 నుంచి కాళేశ్వరం త్రివేణి సరస్వతి పుష్కరాలు ప్రారంభమవుతున్నాయని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రతి 12 ఏళ్లకోసారి వచ్చే ఈ మహా పుష్కర మహోత్సవాన్ని తెలంగాణ ప్రభుత్వం ఎంతో భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహిస్తోందన్నారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానానికి, ఆధ్యాత్మిక ఆరాధనలకు వచ్చే లక్షలాది భక్తులకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో అన్ని వసతులను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ పుష్కరాల్లో ప్రతిరోజూ సరస్వతీ హోమం, రుద్ర హోమం మరియు ప్రత్యేక పూజలు ప్రముఖ పీఠాధిపతుల సమక్షంలో జరగబోయే ఈ చారిత్రక మహోత్సవంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు.

# పుతిన్ సంసిద్ధత

(మొదటి పేజీ తరువాయి)

శాంతి చర్చలు జరుగుతాయని పుతిన్ చెప్పారు. ముప్పైరోజుల పాటు ఉక్రేన్‌లో కాల్పుల విరమణ విషయంపై చర్చించేందుకు యూరోపియన్ యూనియన్ దేశాల నాయకులు కీవ్‌లో సమావేశమైన కొద్ది గంటల తర్వాత శనివారం అర్థరాత్రి పుతిన్ ఈ శాంతి చర్చల ప్రతిపాదన చేశారు. పుతిన్ ప్రకటన చేసిన వెంటనే ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో పోస్టింగ్ పెడుతూ, ఉక్రేన్–రష్యాలకు ఇదెంతో గొప్పదినమన్నారు. వేలాదిమంది మరణాలకు దీనివల్ల తెరపడుతుందన్నారు. రెండు దేశాల తరపున తన కృషిని కొనసాగిస్తానన్నారు. ఉక్రేన్ సంక్షోభానికి నిజమైన పరిష్కారం సాధించాలనే ఉద్దేశంతోనే పుతిన్ ఈ శాంతి చర్చల ప్రతిపాదన చేశారనీ, శాంతి సాధనకు ఆయనకున్న ఆలోచలకు ఇది ప్రతిబింబమని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి ద్మిత్రీ పెస్కోవ్ ఆదివారం చెప్పారు. ఉద్ధృతమైన చర్చల ద్వారా మాత్రమే శాంతిని సాధించవచ్చుననే ఉద్దేశంతో ఈ ప్రతిపాదన చేశారన్నారు. 2022 చివరిలో శాంతి చర్చలకు భంగం కలిగించిన విధంగా ఈసారి కూడా ఉక్రేన్ ప్రవర్తించకూడదని ఆయన అన్నారన్నారు. పుతిన్ మద్దతు ఇస్తున్న శాంతి చర్చల్లో ఎన్నో ప్రశ్నలు ఉన్నాయని, వాటికి సమాధానాలు కావాలని ఆయన అన్నారు. వారు కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నారుతప్ప, ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి సిద్ధంగా లేరన్నారు. ఈ పరిస్థితుల్లో రష్యా సైన్యం ఆత్మవిశ్వాసంతో తాత్కాలికంగా యుద్ధరంగంలో ముందుకు దూసుకుపోతోందన్నారు. ''ఇష్టపడేవారికి కూటమి'' శనివారంనాడు సమావేశమై, 30 రోజులపాటు ఉక్రేన్‌లో కాల్పుల విరమణకు అన్ని దేశాలు బేషరతుగా అంగీకరించాయని, రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఈ విషయంలో తీవ్రమైన ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించాయి. తర్వాత పుతిన్ సానుకూలంగా స్పందించారు.


**నేటి నుండే విరమించాలి**

**చర్చలకు నేను రెడీ: జెలెన్‌స్కీ**

పుతిన్‌ను కలుసుకుని ప్రత్యక్ష చర్చలు జరిపేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఉక్రేన్ అధ్యక్షుడు వి.జెలెన్‌స్కీ అన్నారు. చర్చలకు ముందుగానే కాల్పుల విరమణ పాటించాలని కోరారు. ఒక్కరోజు కూడా యుద్ధంచేసి హత్యలు చేయడానికి తాము సిద్ధంగా లేమని అన్నారు. 15వ తేదీ వరకూ ఆగకుండా 12వ తేదీ నుండే కాల్పుల విరమణ అమలుకు పుతిన్ సిద్ధం కావాలన్నారు. యుద్ధాన్ని ముగించేందుకు రష్యా చేస్తున్న ఈ ఆలోచన ఎంతో సానుకూలమైన విషయమని ఆయన అన్నారు. యావత్ ప్రపంచం ఎంతోకాలంగా ఉక్రేన్‌లో యుద్ధ పరిష్కారం కోసం ఎదురుచూస్తోందని ఆయన అన్నారు. ఏ యుద్ధాన్ని అయినా ముగించాలంటే ముందుగా కాల్పుల విరమణతో ప్రారంభం చేయాలని, ఈ శుభారంభం రేపు సోమవారం నుండి ప్రారంభం కావాలని ఉక్రేన్ ఆశిస్తోందని ఆయన అన్నారు. యూరప్ దేశాల ''ఇష్టపడేవారి కూటమి'' నాయకులు కూడా, సోమవారం నుండి 30 రోజుల కాల్పుల విరమణకు రష్యాపై ఒత్తిడి తేవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు విజ్ఞప్తి చేశారు.

**పుతిన్‌ను జెలెన్‌స్కీ సరిగ్గా అర్థం చేసుకోలేదు**

పుతిన్‌ను ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సరిగ్గా అర్థం చేసుకోలేదని రష్యావిదేశాంగమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మారియా జఖరోవా అన్నారు. ''పుతిన్ ప్రకటనపై జెలెన్‌స్కీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడే మా దృష్టికి వచ్చాయి. కానీ పుతిన్‌ను జెలెన్‌స్కీ సరిగ్గా అర్థం చేసుకోవాలి, ఉక్రేన్‌లో యుద్ధానికి గల మూల కారణాల గురించి మొదట చర్చించాలనేది రష్యా అధ్యక్షుడి ఉద్దేశం, ఇస్తాంబుల్‌లో ఉక్రేన్ యుద్ధానికి గల మూల కారణాలను చర్చించాలి, ఆ తర్వాతే కాల్పుల విరమణకు సంబంధించిన చర్చలు జరుగుతాయి'' అని ఆమె వివరణ ఇచ్చారు. ఇదిలా ఉండగా రష్యా విదేశాంగశాఖ రాయబారి రోడియన్ మిరోష్నిక్ టెలిగ్రామ్‌లో ఒక పోస్టింగ్ పెడుతూ, జెలెన్‌స్కీ కాల్పుల విరమణను కోరడం అంటే దాని అర్థం తిరిగి మరిన్ని బలమైన ఆయుధాలు సమకూర్చుకోవడానికి కొంత విరామాన్ని కోరడమేనని విమర్శించారు.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com